ఆంధ్ర సచిత్ర వారపత్రిక



.11.72


50 పై.

దీపావళి సంచిక


వెంకన్న కోట్లు
బొమ్మల కథ:
24
అమెరికా దౌత్యకార్యాలయం నుండి ఒకాయన
వెంకట్రావుగారి పెళ్లిముహూర్తం వేళకి వచ్చాడు...
కొత్త రాకెట్ ప్రయోగించేప్పుడు తమ్ముడానికి - మా దేశం మిమ్మల్ని ఆహ్వానిస్తోంది!
తప్పక వస్తాం!
మా వెంకన్న ఎంతవాడయ్యాడూ! అప్పుడే ఎన్నెన్ని దేశాలు తిరగ బోతున్నాడూ! నే వాడికి 'వెంకన్న' అని పేరుపెట్టిన వేళావిశేషం అంతాను!
ఢాం
మన హనీమూన్ అమెరికాలో!
ఢాం

(అయిపోయింది)

దీపావళి శుభాకాంక్షలతో!



వీనస్ మహీజా పిక్చర్స్

బాలభారతము

ఈస్ట్మన్ కలర్


నిర్మాత సిహెచ్. ప్రకాశరావు. దర్శకత్వం కె. కామేశ్వర రావు. బి.ఎ., సంగీతం యస్. రాజేశ్వర రావు

నవయుగ

దీపావళి కథల పోటీలో రు. 500 బహుమతి పొందిన రచయిత(త్రు)లు



శ్రీమతి నాయని కృష్ణకుమారి



శ్రీ వి. ఎస్. ఎన్. మూర్తి



శ్రీమతి జి. రమాకుమారి

పాఠకులు, రచయిత(త్రు) అందరికీ మా దీపావళి శుభాకాంక్షలు.

దీపావళి కథలపోటీలో రు. 500 బహుమతిపొందిన రచయిత(త్రు)లు పంపిన ఫోటోలని, తమ జీవిత వివరాలని తెలియచేస్తూ రాసిన ఉత్తరాలని యిక్కడ వేస్తున్నాము.

స్థలాభావం వల్ల ఈ వారం ఒకవారం విపరీతం, శీర్షిక వెయ్యలేక పోతున్నాము— సం.


శ్రీమతి నాయని కృష్ణకుమారి

'నా. పుట్టుక 14—3—30 గుంటూరులో. ఆంధ్ర సాహిత్యాకాశాన భావకవిత అనే మేలు కట్టుమ ఎత్తిపట్టిన నాలుగు స్తంభాల్లో ఒక స్తంభంగా భాసించినవారు శ్రీ నాయని సుబ్బారావుగారు. వారు మా నాన్నగారు. 1951 నాటికి ఆంధ్ర విశ్వవిద్యాలయం వాల్తేరులో విద్యాభ్యాసం ముగిసి ఎం.ఏ. పట్టా (తెలుగులో) చేతికందింది. 1952లో ఉస్మానియా విశ్వవిద్యాలయ మహిళా కళాశాలలో అధ్యాపకత్వం లభించింది. 1961లో ఈ విశ్వవిద్యాలయంలో సంస్కృతభాషలో ఎం. ఏ. (పట్టం) పొంద గలిగాను. 1970లో ఇక్కడే పి. హెచ్.డి. పట్టాన్ని సాధించాను— అందుకు పరిశోధించిన విషయం. తెలుగు జానపద కథాగీతాలు. నా వృత్తి అధ్యాపకత్వం కాబట్టి చదవడమనేది అందులోని భాగమే. చదువుకు సంబంధించినంతవరకూ నాకు కొత్తా పాతా అనే హద్దులు లేవు. నా సామర్థ్యం మేరకు అక్షరరూపం వహించిన ప్రతిదీ చదవాలనే నాతహతహ.

రచన విషయానికి వస్తే ఎప్పుడూ ఏదో ఒకటి వ్రాస్తుంటేగానీ తోచదన్నంత దురదృష్టవంతురాల్ని కాదు. రచన చెయ్యడం నాదృష్టిలో పండగసంబరం లాంటిది. ఎప్పుడో ఒక్కసారి ఆ కోరిక మెరుపుకొట్టినట్టు కొడుతుందిగాని, యాచకుడిలాగా వెంట బడదు.

రచనా ప్రక్రియకు సంబంధించినంతవరకూ నా దృష్టిలో కవిత, కథ, నాటిక, నవల, వ్యాసంవంటి అన్ని ప్రక్రియలూ సమానమైనవే. అందులో ఒకటి వ్రాయడం తేలిక. మరొకటి కష్టం అని నేనా కోను. నా అనుభవం కూడా అలా చెప్పడం లేదు. నాపుస్తకాలు— (1) ఆంధ్రుల కథ. 2. గౌతమి 3. మనమూ, మనపూర్వులూ 4. ఆయూరా.


1954 లో నేను పెండ్లి చేసుకున్నాను. నా భర్త శ్రీ కనకపల్లి మధుసూదనరావు, ఆంధ్రప్రదేశ్ కేంద్రసహకార భూమితనఖా బాంక్‌లో ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు. నాకు నుగ్గురు పిల్లలు.'



శ్రీ కె. వి. దుర్గాప్రసాద్



శ్రీ శంగధామ్



శ్రీ యర్రంశెట్టి శాయి




శ్రీ వి. ఎస్ ఎస్. మూర్తి

'కలంపేరు:'ఉమ'.అసలుపేరు: వడ్లమాని సూర్యనారాయణమూర్తి. పుట్టిన తేది 1—4—1949. జన్మస్థలం అమలాపురంలోని బుచ్చెమ్మ అగ్రహారం. హైస్కూలు విద్యాభ్యాసం ఏలూరు, హైదరాబాదులలోనూ, ఇంజనీరింగు కాకినాడలోను జరిగింది. ప్రస్తుతం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ టెక్నికల్ సిగ్నల్స్ బ్రాంచిలో ఆఫీసరుగా బెంగుళూరులోని ఎయిర్‌ఫోర్స్ టెక్నికల్ కాలేజీలో శిక్షణ పొందుతున్నాను. రేంక్ పైలట్ ఆఫీసర్. ఇంకా పెళ్లికాలేదు.

గతమూడేళ్ళలో నేను వ్రాసిన ఏడు కథలు ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురించబడ్డాయి. వాటిలో పోస్ట్‌మన్ స్నేహం, అట్లతద్ది అన్న కథలకి పలువురి ప్రశంసలు లభించాయి. 'ఉమ' పేరుతో గతంలో వందకు పైగా కార్టూనులు ఆంధ్రజ్యోతి,ఆంధ్రసచిత్రవారపత్రికలలో ప్రచురింపబడ్డాయి. తెలుగులో అభిమాన కథారచయిత శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య. అభిమాన విషయం. స్నేహం.'

శ్రీమతి జి రమాదుమూర్తి

'జననం: 1949. శ్రీకాకుళంలో. శ్రీవారి ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో మకాం. నాకో పాప. అతపాప. ఈ కథకాక ఇంతకుముందు రెండు కథలు రాసాను. విసుగులేకుండా పుస్తకాలు చదువుతుంటాను. సినిమాలు తప్ప మరో హాబీ లేదు.'



...రచయిత(త్రు)లు

శ్రీ కె. వి. దుర్గాప్రసాద్

'మా అసలుఊరు బెజవాడ. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో వుంటున్నాను. 1946లో పుట్టాను. చదువంతా బెజవాడ్లోనే. వివాహం కాలేదు.

ఈ పత్రికలోనే 1964లో నా మొదటికథ తర్వాత నో అరడజను కథలను పైగా ప్రచురింపబడ్డాయి. ఇంట్లో అంతా నన్ను బాబు అనిపిలుస్తారు. ఆ పేరుతోనే కార్టూన్లు వేస్తుంటాను. వెంకన్నా'స్ కోల్డు నా మొదటి కార్టూన్ సీరియల్. కారవాన్ (ఇంగ్లీషు పక్షపత్రిక)లో కూడా నా కార్టూన్లు ప్రచురింప బడుతున్నాయి.

సంగీతం అంటే యిష్టం. ఫోటోలు తీయడం మరీ యిష్టం.

నాగురించి యింకా చెప్పుకోవలసింది ఏవీ కనిపించడం లేదు.'

శ్రీ రంగధామ్

'పూర్తిపేరు కొల్లూరు రంగధామరావు. విద్యార్హతలు బి. యస్‌సి, బి యస్‌సి. టెక్. వృత్తి: ఆయిల్ టెక్నాలజిస్టు. జననం1930.

సుమారు పదేళ్ళుగా, (తరుచుగా కాకపోయినా) సాహిత్యరచన చేస్తున్నాను. అయిదు నవలలూ ఏభై కథలూ, ఒక నాటికా ప్రచురితమయ్యాయి. నవలలో 'శ్రీదేవి'కి కథలలో 'సజీవశిల్పం', 'గాజు కిటికీ', 'కీలుబొమ్మలు'లకు బహుమతులు వచ్చాయి. సంగీత, సాహిత్యాలయందు విపరీతమైన మక్కువ వుంది. నివాసం. గుంటూరు.'

శ్రీ యఱ్ఱంశెట్టి శాయి

'సొంతఊరు మచిలీపట్నం. వయసులో ఇరవై ఎనిమిదేళ్ళు లెక్కబెట్టాను. కాలేజిరోజుల్లోనే ఆంధ్రసచిత్రవారపత్రికలోనామొదటికథ'అర్ధరాత్రి-ఆత్మహత్య' ప్రచురితమయింది. బి. యెస్సీ పైనలియర్లో, చదువుకి గుడ్‌బై కొట్టి రైల్వేలో చేరిపోయాను. ప్రస్తుతం సికింద్రాబాద్‌లో అసిస్టెంట్ స్టేషన్‌మాస్టరు ఉద్యోగం. గత ఆంధ్రప్రభ దీపావళికథలపోటీలో 'పల్లకి' అనే కథకి సెకండ్ ప్రైజు వచ్చింది.

ఈ ఎనిమిదేళ్ళల్లోనూ సుమారుగా మాటయాభై కథలు అన్ని పత్రికల్లోనూ ప్రచురింపబడ్డాయి. రేడియోలో కొన్ని నాటికలు ప్రసారమయినయి.

గురువులాంటి మిత్రుడు ఆదివిష్ణు ప్రోత్సాహం ఈకథల వెనుక కథ.


వివాహమయింది. ఓపాప—మరోబాబు. ఉదయం లేచిందగ్గర్నుంచీ రాత్రి పడుకోబోయేవరకూ సమస్యలతో సతమతమయ్యే మధ్య తరగతి మనుష్యులకథలు చదవాలన్నా రాయాలన్నా చాలా ఇష్టం. ఎప్పుడూ నవ్వే స్నేహితులతో నవ్వుతూ నవ్విస్తూ—సరదాగా గడపడం హాబీ.'

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938 – 1972)

శుక్రవారం : 10–11–72
శ్రీవిరోధినామ సం॥ కార్తీక మాసం॥ శుద్ధ చవితి
సంపుటము : 66 సంచిక : 9
స్థాపితం : 1908
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1
విడి ప్రతి వెల 50 పైసలు

విషయానుక్రమణిక



దీపావళి తమాషా
కిస్సింగర్
అమెరికా ఒత్తిడి
భారత్-పాక్ ఉపఖండం
కేంద్రానికి మరోతలనొప్పి
ముల్కీ సమస్య
భారత బృందం
సిమ్లా ఒప్పందం అమలుకు
పాక్ ఉపసంహరణ బృందం
కలిసికట్టు భావం

హైదరాబాద్ నోట్ బుక్

తిరుమలరామచంద్ర

మంత్రులు లేని మహాసభ

రాజధానిలో ఏ యూనివర్సిటీసభ జరిగినా, మంత్రులో, మహామంత్రులో, రాజ్యపాలకులో, రాష్ట్రపతులో ప్రారంభోత్సవం జరుపడమో, అధ్యక్షత వహించడమో పరిపాటి. దీనికి భిన్నంగా జరిగింది అక్టోబర్ 14, 15 తేదీలలో తృతీయ అఖిలభారత శిశుశల్య చికిత్స (పీడియాట్రిక్ సర్జరీ) మహాసభ. మంత్రులు రావడం, తమకు తోచీతోచని మాటలు పలకడం, ఆ వృత్తిలోనో, రంగంలోనో ఆరితేరినవారికి తమ అమూల్యమైన సలహాలివ్వడం వంటి అనాహూతాలేవీ లేకపోవడం ఈ మహాసభ విశేషం. రాజకీయాల ప్రసక్తిలేని శాస్త్రజ్ఞులే అందరూ. వైద్య శాఖ డైరెక్టరు శ్రీ రాఘవేంద్రరావు స్వాగత వచనాలు పలికారు. నిజాం కళాశాల భౌతిక శాస్త్రాచార్యులు, ప్రిన్సిపాలు శ్రీ పురాణిక్ ప్రారంభోత్సవం జరుపుతూ, వైద్య శాస్త్రానికి, భౌతికశాస్త్రానికిగల సన్నిహితత్వం వివరించి, సంతాన నిరోధం ఉధృతమయిన ఈ కాలంలో, ఉన్న శిశువులను బాలారిష్టాలకు గురికాకుండా రక్షించుకోడం అవసరమన్నారు. అధ్యక్షత వహించిన శ్రీ యు. టిన్. షాహి ప్రతి వైద్యశాలలోను అఖిలభారత పీడియాట్రిక్ సర్జరీ వార్డులు నెలకొల్పాలన్నారు. శ్రీయుతులు డా. జె. సుబ్బారావు (గుంటూరు), దయానందరావు, చలపతిరావు (హైదరాబాదు), అంజనాదేవి, విశ్వనాథరావు (విశాఖపట్నం), రామలింగంశెట్టి (మైసూరు) మొదలయినవారు చిన్న పిల్లల కడుపునొప్పి, మెగాకోలన్ (పెద్దపేగు)లో ఒకభాగం వాపు, పిల్లల ప్రజననాంగ దోషాలు మున్నగు విషయాలపై అపూర్వ వ్యాసాలు చదివారు. పీడియాట్రిక్ సర్జనులు తొన్నటి వెంకట దుర్గమాధవమూర్తి, ధర్మవరం మీరాబాయి (ఆంధ్ర శాఖ - శిశుసుస్థాని శ్రీ) మహాసభను చక్కగా నిర్వహించారు; ప్రత్యేక సంచిక ప్రకటించారు.

ప్రజాకవి, ప్రజానేత

ప్రజలది కానిదంటూ ఏదీలేదు. కాని, కేవలం ప్రజలే ధ్యేయంగా మెలగిన వారిని ప్రజానాయకులనో, ప్రజాకవులనో అంటాము. అలాటివారు వేమన, ప్రకాశం. వారి సంస్మరణార్థం తంతితపాలా శాఖ వారు సిద్ధపరచిన ప్రత్యేకమయిన తపాలా బిళ్లలను కేంద్ర మంత్రి శ్రీ బహుగుణ అక్టోబర్ 16వ తేదీన జూబిలీ హాలులో ఆవిష్కరించినప్పుడు, జనం నాలుగు వందల సంవత్సరాల ఆంధ్రప్రదేశ్ చరిత్రను సంస్మరించి విజ్ఞానవంతులు కావడం జరిగింది. ప్రకాశాన్ని గౌరవించడం, ఆ యుగాన్ని గౌరవించడం అని శ్రీ బహుగుణ అనడం చాల బాగుంది. మంత్రి శ్రీ నరసారెడ్డి ప్రకాశం తలపెట్టిన సంస్కరణలు వివరించగా, మంత్రి శ్రీ భగవంతరావు వేమన, ప్రకాశం ప్రజల సొమ్మన్నారు. ఇలాగే ఆయుర్వేదమే తానైన వైద్యరత్న గోపాలాచార్యుల స్మారకం తపాలా బిళ్లలూ వెలువడుతాయని నమ్ముతున్నాను.

పడగ విప్పిన ధరలు

జంటనగరాల పౌరులు పడగవిప్పి మిడినాగులవలె పెరిగివస్తున్న ధరలుచూచి గాభరా పడుతున్నారు. దసరాలోనైనా ఈ గాభరా మరీ పెరిగింది. దేశమంతా ప్రధానమైన వస్తువులు: బియ్యం, పప్పులు లేక పప్పు రొట్టెకదా! ఆ పప్పులే వింత తిప్పలు పడినా దొరక్కపోతే ఏమవుతుంది? తాలింపులకు రెండు మిల్లీల నూనె వాడుదామన్నా మానెల ధరచూచిన ఇల్లాలు మౌనంగా ఉండిపోతూంది. కూరగాయలు ఏది అడిగినా, కిలో రూపాయిన్నర. అతి చౌకయిన అరటిపళ్లు డజను రూపాయిన్నరా! అన్నా! పేదలు. గుడ్లు తలమునకలవుతుంటే, కంటిపాపలు కంటిగుడ్లు వెడల్పయిపోయి మునకలు వేస్తూ ఉంటున్నాయి. పెరుగుతున్న ధరలను అదుపులో పెట్టడానికి తొలిసారిగా ప్రయత్నించినవారు ప్రకాశం అని తపాలా బిళ్ల ఆవిష్కరణ సందర్భంలో అన్న మంత్రి శ్రీ నరసారెడ్డి, తక్కిన మంత్రులు ప్రకాశం అడుగు జాడలలో నడిస్తే ప్రజలు ఎంతో సంతోషిస్తారు.

పుట్టపర్తి ప్రసంగాలు

నవరాత్రి సందర్భంగా విశ్వహిందూ పరిషత్తు ఏర్పాటుచేసిన శ్రీమద్రామాయణ ప్రసంగాలు వాల్మీకికి మరొకమారు కవితాభిషేకం చేశాయి. బహుభాషావేత్త, కవితలో ఉన్నతస్థాయిని అందుకొన్నవాడు, వక్త 'పద్మశ్రీ' శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు పది రోజులూ ప్రసంగించి, వాల్మీకి హృదయాన్ని విపులీకరించగా, శ్రోతలు తన్మయులై విన్నారు. పుట్టపర్తి ప్రసంగం, అటు పురాణం, ఇటు విమర్శ, అటు హరికథ, ఇటు పరిశోధన, అటు వాల్మీకి, ఇటు తులసీ, అటు వైష్ణవం, ఇటు శాక్తం. ఆహా! అనేకానేక విషయాల సమాహారం. వీటన్నిటికీ మించిన ఆకర్షణ—పట్టుదలగా రాయలసీమ—అనంతపురం—యాసలోనే ప్రసంగించడం. ఆయన భావుకుడు. శ్రోతలను, వింత ఉన్నత వీధులలోనైనా విహరింప జేయగలడు.

డాక్టర్ సరోజినీ రేగాని

కొందరనిచూస్తే ఒక్క ఉద్దేశ నిర్వహణకు, కర్తవ్యబోధనకు పుట్టారా అనిపిస్తుంది. అలాటివారు డాక్టర్ సరోజినీ రేగాని. రేగాని అనగానే ఏ సింధీ, గుజరాతీయో అని భ్రాంతిపడేరు. కాదు. శ్రీకాకుళంజిల్లా రేగాణంనుంచి ఆమె ముత్తాతలు బస్తరుకు వలసవచ్చారు. అక్కడినుంచి హైదరాబాద్‌కు కొంతకాలం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చరిత్రశాఖ

రీడరు; ప్రస్తుతం స్టేట్ ఆర్కైవ్స్— రాష్ట్ర ప్రభుత్వ చరిత్ర కాధారాలశాఖ— డైరెక్టరు, 1724 నుంచి 1857 వరకు వున్న నిజాం, బ్రిటిషు ప్రభుత్వాల సంబంధాలపై పరిశోధన జరిపి డాక్టరయ్యారు. ఎక్కుసార్లు విదేశాలు పర్యటించారు; ఇటీవలే మొన్న ఏప్రిల్‌లో మాస్కోలో జరిగిన ఇంటర్నేషనల్ ఆర్కైవ్స్ మహాసభలో భారత ప్రతినిధిగా పాల్గొన్నారు. ప్రస్తుతం ఈమె ఏకైక లక్ష్యం తమ సంస్థను అన్ని విధాల ఉన్నతస్థాయికి తేవడం. ఆమె తమ సంస్థ వివరాలు తెలిపారు:

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆవరణలో సువిశాల సుందర భవనం. 1965 జులై 6న లాల్‌బహదూర్‌శాస్త్రి ప్రారంభోత్సవం జరిపారు. 800 సంస్కృత తెలుగు, పార్సీ, అరబ్బీ, ఉరుదూ, మరాఠీ లిఖిత గ్రంథాలున్నాయి. సాలార్‌జంగ్, పన్‌చక్కీ, రాజేంద్ర, ఖుస్రోషాహ్సేన్ — కుటుంబాలు సేకరించిన రికార్డులు, 23 మంది వ్యక్తులు సేకరించిన రికార్డులు, 100 మంది వ్యక్తుల రికార్డులు, పాతదస్తర్ల సెక్రటేరియట్ రికార్డులు, మెకంజీ రికార్డులు, ప్రభువు సేకరించినవి ఇంకా ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ మన రాష్ట్ర చరిత్రకు ఖనులు. ఈ శాఖ అపూర్వ పుస్తకాలనూ ప్రచురిస్తుంది. త్వరలో ఒకడజను పుస్తకాలు వెలువడుతాయి.

దాదాపు తరం అనుభవం, శ్రద్ధగల అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ రాయసం విశ్వనాథరావు వివిధ శాఖలు చూపించారు. విరిగిపోయిన, చినిగిపోయిన రికార్డులను షిఫాన్ గుడ్డతో బాగుచేసేశాఖ, రికార్డులను భద్రపరచే పెట్టెలు తయారుచేసేశాఖ, ఫోటోశాఖ, మైక్రో ఫిలిములను ఫోకస్‌చేసి చదవడానికి వీలుకలిగించే ఆర్కైవ్స్ రీడరు, ఒక్కటేమిటి ఆశ్చర్యమనిపించింది. శ్రీ జియాఉద్దీన్ అహమద్ అపూర్వమైన పారసీ లిఖిత ప్రతులు చదివిచూపారు. రెండు భాషల రికార్డులో 'తమ వచ్చిన మంత్రి పరదేశి' అని ఒక ప్రత విూద సంతకం వుంది. ఆర్కైవ్స్ రీడరు పనులను శ్రీ వి. మురిరత్నం వివరించారు. ఇలాటిది రాష్ట్ర రాజధానులలో లేవన్నారు. ఫోటోగ్రఫీ శాఖను నిర్వహించే శ్రీ మజీద్ ఖాన్ అలాంటిశాఖ కేంద్రంతో తప్ప మరెక్కడా లేదన్నారు. ఇదంతా చూచిన తర్వాత, ఆంధ్రప్రదేశ్ చరిత్రకాధారాలు ఇంకా ఎన్నో తరాలవరకు సురక్షితంగా వుంటాయి, అపూర్వ విషయాలు వెలువడుతాయి అన్న నమ్మకంతో తిరిగి వచ్చాను.

ఉపశ్రుతి

'దాటు, వైతరణిదాటు!' అన్నాడు యమ భటుడు. 'నేనెందుకు దాటుతా? దాటనంటే దాటు!' అన్నాడు జీవి. 'ఎందుకు?' గద్దించాడు యమభటుడు. 'నేను మా రాజధానిలో ఇలాటివి ఎన్నో దాటాను. ఇమ్యూనిటీకోసం చిత్రగుప్తుల వారికి అర్జీపెట్టుకొన్నాను' అన్నాడు జీవి ధీమాగా. 'ఏ రాజధాని నీది?' 'హైదరాబాదు మహానగరం'. ●

పాఠకులకి మనవి

దీపావళి కథల పోటీలో ఉత్సాహంతో పాల్గొన్న వారందరికీ మా కృతజ్ఞతాభినందనలు:

అందరికీ మా దీపావళి శుభాకాంక్షలు!

వచ్చిన కథలన్నిటిలో ఎన్నుకున్న ఆరింటిలో మూడు ఈ సంచికలో వేస్తున్నాము.

మిగిలిన మూడు వయివారం వేస్తాము.

బాలట్ పత్రం వయివారం సంచికలో ఉంటుంది:

పాఠకులందరూ మాతో సహకరించి బాలట్ పోటీలో పాల్గొని దానిని విజయవంతం చెయ్యగలరని ఆశిస్తున్నాము.

పైవారం సంచికలో ప్రచురింపబడే మూడు కథలు: వక్రరేఖ – శ్రీ కొలను వేంకట దుర్గాప్రసాద్; వెండి అరటాకు – శ్రీ "రంగధామ్"; సమస్య – శ్రీ యఱ్ఱంశెట్టి శాయి.


పోటీకి వచ్చిన కొన్ని కథలని మామూలుగా ప్రచురణకి స్వీకరించాము. వాటిని రాసిన వారికి రిజిస్టర్డ్ పోస్టుద్వారా స్వీకరించినట్లు తెలియ జేస్తున్నాము. ఇవి కాక మిగిలిన కథలు మేము ప్రచురణకి స్వీకరించలేదని రచయిత(త్రు)లు గమనించ ప్రార్థన.

దీపావళి కథల పోటీ నిబంధనలని మరోకసారి పాఠకుల దృష్టికి తెస్తూ ఏట్టి పరిస్థితులలోనూ ప్రచురణకి తీసుకొనబడని కథల విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలూ జరపటానికి వీలులేదని మనవి చేసుకుంటున్నాము.

సంపాదకుడు
ఆంధ్ర సచిత్ర వార పత్రిక

దీపావళి కథల పోటీలో రూ.500 బహుమతి పొందిన కథ

ఎండు చేపలు



నాయని కృష్ణకుమారి

✸ కారు ఆగిపోయింది. ఇక ముందుకు కదలడానికి లేదు. ఇరుకు సందులో అటూ ఇటూ దుకాణాల వరసలు, అగ్గిపెట్టెల్తో చేసిన రైలుబళ్ళలా కనిపిస్తున్నాయ్. ఎత్తుగా ఉన్న బడ్డీల మధ్యన ముగ్గిర్గా దుకాణాదారులు కూర్చుని ఉన్నారు. వాళ్ళముందు గల్లా పెట్టెలున్నయ్. ఆ పెట్టెల కటూ ఇటూ తాటాకులు పేర్చి సిట్లు ఎండుచేపలు పనలు పనలుగా అమర్చి ఉన్నయ్. ఆ చేపలకూ, గల్లా పెట్టెల్లో పడే డబ్బుకూ ప్రత్యక్షంగా ఎటువంటి సంబంధమూ లేదు. అవి ఒకటి కొకటి, ఏ చిక్కు క్షణాల్లోనూ ఆసరాగా నిలబడవు. కాని గల్లా పెట్టెల్లో డబ్బు చేరాలంటే ఆ ఎండుచేపలు అక్కడుండక తప్పదు. అవి లేకపోతే పెట్టెలు ఖాళీగానే ఉంటాయి.

కారులోంచి ఇద్దరాడమనుషులు దిగారు. ఇద్దరూ సన్నగా, చురుగ్గా ఉన్నారు. ఆ యిరుకు సందు దాటి అవతలవైపున్న కూరగాయలు కొనుక్కోడానికి వెళ్తున్నారు. ఊరు మొత్తంమీద అక్కడే చౌగ్గా నవనవలాడుతూ అన్నిరకాల కూరగాయలూ దొరుకుతాయని ప్రతీతి. అవి కొని తీరుతీరులుగా, వండి, వడ్డించి, తమకైన వాళ్ళ కడుపులు నింపడమే ఆ క్షణాన వాళ్ళ జీవిత పరమార్థం. అందుకని వాళ్ళ దృష్టంతా దూరంగా, కనపడని కాయగూరల్ని వెతుకుతోందే కానీ, ఎదురుగా కనిపించే ఎండుచేపల్ని గమనించలేదు.

'అబ్బ ! ఏం మండిపోతున్నాయండీ కూరలు!' ఒకావిడన్నది.

'మరే! మన కూరలమ్మి తెచ్చే సరుకు నోట పెట్టే పనే లేదు. ఏ పూట కాపూట రూపాయ చెల్లుతుంది కానీ, చట్టినిండనా కడుపు నిండనా?'

'దాన్ది మరీ అన్యాయం లెండి. చచ్చిపోయినయ్యో, పుచ్చిపోయినయ్యో, వాళ్ళూ వాళ్ళూ పారేసినయ్యన్నీ ఏరుకొచ్చే బాపతు. అవే మన దగ్గరకొచ్చి మండించేస్తది.'

'ఇక్కడ బోలెడు చౌకంట. ఈ అలగా జనం గంపలు గంపలు, రూపాయకూ, రెండుకూ, కొని మనదగ్గర లాభాలు పోసుకు పోతారు.'

'మరి మనమేగా వీళ్ళకు తేరగా దొరికేది! వీళ్ళకూ మనవే గవర్నమెంటుకూ మనవే.'

అట్లా దారెంట పోతూనే వాళ్ళిన్నో మాట్లాడుకున్నారు. కూరగాయలమ్మే వాళ్ళ నిరంకుశత్వాన్ని ఖండించారు. వాళ్ళు తమలాంటి వాళ్ళను దోచే దోపిడీ విధానాన్ని నిరసించారు. ప్రభుత్వమే సహకార శాఖలు స్థాపించి, కూరగాయలు చౌగ్గా సరఫరా చెయ్యకూడదా అనుకున్నారు. ఇందిరమ్మ ఏవేవో పెద్ద మాటలు చెబుతుంది గానీ ఇటువంటి అవసరమైన మార్పులు తేవద్దా అంటూ వాళ్ళ వాళ్ళ మగవాళ్ళు. ఏమీ తోచనప్పుడు మాట్లాడుకునే చిలకపలుకులు అక్కడ వల్లించుకున్నారు. చివరకు కూరలమ్మే వాళ్ళ బుట్టలో పడకుండా చౌగ్గా కాయగూరలు కొనుక్కుపోడానికని బయలుదేరిన

తమ తెలివిని అభినందించుకుంటూ చకచకా నడుస్తున్నారు.

ఆ నడకలో కనీ కనపడని ఒయ్యారముంది. అహముంది. దగ్గరున్న డబ్బు తమచుట్టూ అల్లిన ఆత్మ విశ్వాసమనే బలమైన రక్షణవలయముంది. వాళ్ళిద్దరూ, చౌగ్గా కాయగూరలు కొనుక్కోడానికి మైళ్ళకు మైళ్ళు కారేసుకుని రాగలిగినంత ధనవంతులు.

వాళ్ళు కూరలమ్మి కూడా ఇట్లాగే చకచకా నడుస్తుంది. కాని ఆ నడకలో ఒయ్యారం బదులు ఒకటే తొందర! ఆవిడ చాలా పొట్టి మనిషి. సన్నటి శరీరం. తిండి తక్కువై చిక్కిపోయిన కడుపు. అందులో కనపడని మంటలు! తానీడుస్తున్న జీవితపు బరువు తగ్గడానికి ఎక్కడ కొంచెం సులువు చిక్కుతుందా అని వెతికి వెతికి గాజువారిన కళ్ళు! పని ముగించుకుని తొందరగా ఇల్లు చేరాలనే తపన. వచ్చే డబ్బుల్తో తన వాళ్ళ కడుపులు నింపాలి. తాను తినాలి. అదే యావ! ఏ ఆసరా లేదని తెలిసీ, ఒంటరిగా నట్టడవిలో దారి వెతుక్కుంటున్నదానిలా తత్తరపాటుతో నడుస్తుందా మనిషి. మైళ్ళకు మైళ్ళు గంప నెత్తి నెత్తుకుని కాలినడకన తిరిగితే తప్ప కడుపు నిండనంత బీదమనిషి ఆవిడ!

ఇద్దరాడమనుషులూ, కూరగాయలమండీ మధ్యకు వచ్చేశారు. మండీ విశాలంగా ఉంది. అన్నీ పెద్ద పెద్ద పాకలు. ఒక్కోచోట ఒక్కో రకం కూరగాయలు కుప్పలు పడి ఉన్నయ్, ఎక్కడ చూసినా ఒకటే జనం. వాన పడ్డప్పుడు గుంటల్లో నిలిచిపోయే నీటికిమల్లే ఎక్కడంటే అక్కడ పోగులు పడుతున్న జనం. వాళ్ళు అరుస్తున్నారు. చేతులు తిప్పుతున్నారు. ఒక చోటు నుంచి మరోచోటుకు కదులుతున్నారు. వాతావరణమంతా చిత్రమైన మనిషి వాసనతో నిండిపోయింది. ఇంత మంది మధ్య ఎంత భద్రత! తాము అడవిలో లేనట్లు క్రూరమృగాల మధ్య కారాడనట్లు, కనపడని భూతాల బారిన పడడానికి వీలులేనట్లు తమ చుట్టూ దట్టంగా కమ్ముకుంటూ నమ్మకాన్ని కలిగించే కమ్మటి వాసన. ఎదుటి మనిషి గుండెల్లో మనుషులమీద మమకారాన్ని పెంచే మెతక వాసన!

ఇద్దరికీ ఆ వాతావరణం వింతగా ఉంది. నరాల్లో ఓ రకమైన సన్నని ఉత్తేజాన్ని కలిగిస్తోంది. ఇక్కడ కూరగాయలు కారుచౌగ్గా కొని, ఇళ్ళదగ్గర మగవాళ్ళు తమ ఘనకార్యాన్ని మెచ్చుకునేట్లు చాటాలి. వాళ్ళకదే ధ్యాస!

వాళ్ళచుట్టూ కాయగూరలు కుప్పలు పడి ఉన్నయ్. ఎవరెవరో మనుషులు బస్తాలకు బస్తాలు తెచ్చి పోగులు పోసి పోతున్నారు. ప్రతి పోగు వెనకా ఓ ఆసామి ఉన్నాడు.

సరిగ్గా ఆ యిద్దరూ నిలుచున్నచోటికి దగ్గరగా ఓ సొరకాయలగుట్ట పడ్డది. ఎవరో ఒకతను, అప్పుడే ఆ కాయల్ని గుమ్మరించాడు. గుమ్మరించిన తలకు చుట్టుకున్న గుడ్డతీసి మొహాన పట్టిన చెమటను అద్దుకున్నాడు. వాడిచూపులు, కింద గుట్టగా పడ్డ కాయల్ని వదిలి రావడం లేదు. వాడికళ్ళల్లో మెరుపులేదు. వాడి కడుపు చిక్కిడొక్కలు డోలుమంటూ ఉంది. కాయలన్నీ గుండ్రంగా నవనవలాడుతూ పాలూ అన్నం తినేవాళ్ళ కడుపుల్లాగా మెరుస్తున్నయ్, వాటివెనక కూర్చున్న ఆసామి కడుపుకూడా గుండ్రంగా ఉంది. అతని కళ్ళకింది కండలు ఉబ్బి. ఊరిన చెంపల్తో కలిసి, మొహంకూడా ఒక సన్నటి సొరకాయలాగే ఉంది. ఆ కళ్ళు, కండలవల్ల సగం మూసుకుపోయి, మెరుస్తున్నాయో మత్తుగా ఉన్నాయో తెలీడంలేదు. కాయలమ్మినవాడు, ఆసామి యిచ్చిన డబ్బు లెక్కపెట్టుకున్నాడు. వేళ్ళు మడిచాడు. తెరిచాడు. లోలోపల గొణుక్కున్నాడు. పెదాలచివర తృప్తివల్ల ఏర్పడే రేఖలు లేవు. ముఖంలో వెలుగులేదు. అయినా వాడు నోరువిప్పి ఆసామీతో ఒక్కమాటా ఆడలేదు. చేసుకున్నవాడికి చేసుకున్నంత అన్న కర్మభూమిలో పుట్టిన అతి సామాన్య ప్రాణి వాడు. వాడు పెదవి విప్పడు. ఆసామిని ఏమీ అనడు. వాడు వెళ్ళిపోయింతర్వాత, ఆసామీ మీది కండువాతీసి, ఒక్కసారి బలంకొద్దీ దులిపి మళ్ళీ వేసుకున్నాడు లేచి నిలబడి, గట్టిగా అరవడం మొదలుపెట్టాడు.

"రూపాయి ఆరణాలకు రెండు—రూపాయి ఆరణాలకు రెండు!"—వాడిచుట్టూ జనం పోగవుతున్నారు. కూరగాయలమ్మకోవాల్సిన ఆడమనుషులు గంపలమీద గంపలు పేరుస్తూ అనువైన చోటుకోసం తొక్కిసలాడుకుంటున్నారు.

ఆ యిద్దరాడవాళ్ళకూ సొరకాయల దరిదాపుకు పోవడానిక్కూడా సందు లేదు.

ఆ సమయంలో దూకుడుగా వచ్చింది రత్తమ్మ. రత్తమ్మ సన్నటిమనిషి. అటూ ఇటూ రెక్కలొలిచేసిన ఈనెపుల్లలా ఉంది. ఆవిడ కళ్ళల్లో కసి ఉంది. ఆవిడ చేతుల ఊపులో గాలివాన లక్షణాలున్నయ్. ఆవిడలో భయం ఏకోశానా లేదు, రత్తమ్మ తనదారికడ్డంగా ఉన్న వాళ్ళను మోచేతుల్తో పొడిచి తోసేసింది. జలగర్భాన్ని స్క్రూను చీల్చుకుని ముందుకు దూసుకుపోయే కత్తిపడవకు మల్లే, సరాసరి కాయల ముందుకు, ఆసామీ ఎదుటికివచ్చి, నిటారుగా నిలబడ్డది.

'ఏంది, నాగయ్యో! రూపాయారణాలకు రెండా! కాయలమ్ముతున్నావా, బంగారమమ్ముతున్నావా!' అని అరచింది. నాగయ్యకు వెంటనే ఏదనాలో తట్టలేదు. గుడ్లప్పగించి చూస్తున్నాడు.

'నీ ఆశ మండిపోను! నీకాయలమ్మినోడు నేనెరిగినోడే! ఆడిదగ్గర పందపాతిక్కి పడేసుకున్నావంటగా! ఆకాడికి నీకు గిట్టే లాభమెంత? మరి అంత లాభవా? మరో ధర జెప్పు!'— గట్టిగా అరిచింది రత్తమ్మ. చుట్టూఉన్న సముద్రపు హోరులాంటి జనం గోలను, ఆ అరుపు మింగేసింది.

రత్తమ్మ అక్కడి జనానికి కొత్త గాదు. నాగయ్యకు దూరపు చుట్టం. బ్రతికిచెడ్డమనిషి. బాగున్న రోజుల్లో ఆవిణ్ణి నాగయ్యే చేసుకుంటా డనుకునేవాళ్ళు. అందుకనే నేమో, ఆవిడకు నాగయ్య మీద హక్కుందనే అందరూ నమ్ముతుంటారు. నాగయ్యకు రత్తమంటే ఏ మూలనో భయం. ఆవిడ చెప్పే మాటల్లో దాగి ఉండే కటిక సత్యాలే అతన్ని బెదరగొట్టేవి. అతను రత్తమ్మకంటే, రత్తమ్మ నలుగురూ వినేట్టు అరిచే మాటలకు జడిసి పోతుంటాడు.

'ఇదో నడమంతపు మనిషి పోగయిం

ఎండు చేపలు

దయ్యా నా ప్రాణానికి!' అని బెంబేలుగాడి తోటివాళ్ళ సానుభూతికోసం వెంపరలాడి పోతుంటాడు.

'ఇయ్యాళ బంగారమంటి బేరం చెడ గొట్టేట్టుంది. ఎండలు మండిపోతున్నయ్. పచ్చటి కూరలకు మొహంవాసిన జనం ఎంతైనా పెట్టి కొంటారు. దీన్నెంపడెగ్గ ధర దిగలాగుతుందో ఏమో!' అనుకున్నాడు. అయినా ఒక్క ఆడది, తన్నిట్టా లొక్కెం చడమేమిటి? రోషం పొడుచుకొచ్చింది.

'ఏందే నీ సోది? నేను కాయ పైసా క్కొంటాను. నా యిష్టమొచ్చినట్లమ్ము తాను. అదిక్కడ రూలే! అందరూ అదే జేస్తున్నారు. నీకాడ డబ్బులుంటే నువ్వో అట్టాగే జేస్కో'—సవాలు చేశాడు నాగయ్య.

'డబ్బులు! అయి లేకేగా మీ ఆటలు చెల్లిచ్చుకుంటున్నారూ! నీ యెదాన అంతంత పోసి మేం గంపలెత్తుకుని ఊసురోమంటూ ఇల్లిల్లూ తిరగాలా? ఇంతా కష్టపడితే మాకు మిగిలేయి కాలి కష్టమూ, ఇడి పైసలూ! ఒక్కొ అమ్మ గీసి గీసి బేరం చేసిందంటే అయి కూడా మిగలవు. నువ్వు నీడపట్టున గూచునే బక్క మనుషుల కష్టం సొమ్ము అప్పనంగా పడేసుకు తింటావా? ఇదంతా డబ్బుందనేగా! అసలు నీ దగ్గరంత డబ్బెందుకుండాల? అడిగే నాయాళ్ళెవరూ కనపడక పోమట్టేగా!' రత్తమ్మ రెచ్చిపోతోంది. చుట్టూ గంపలు పెట్టుకుని నిల్చున్న ఆడమనుషులు రత్తమ్మ వేపు ఆరాధనతో చూస్తున్నారు. వాళ్ళలాగే వాళ్ళ గంపలు కూడా నోళ్ళు తెరుచుకుని వింటున్నయ్.

'సెబాస్ రత్తమ్మా, మా మనసులో మాట, మే వెన్నటికీ చెప్పలేని మాట చెప్తున్నావ్' అనుకుంటున్నారు వాళ్ళు.

నాగయ్య కళ్ళల్లో కోపం చేరింది. కళ్ళ చుట్టూ ఉన్న ఉబికిన కండరాలు పక్కకు జారి కళ్ళు పూర్తిగా తెరుచుకున్నయ్. వాటిల్లో ఇప్పుడు ముమ్మరమైన కోపంతో పాటు సన్నగా భయం కూడా కదులు తున్నట్లు తెలుస్తోంది.

'అయితే ఏంది నువ్వనేది? నన్నియ్యాళ కాయలమ్ముకో నియ్యవా?' గొంతు దాటిగా పలికింది. స్వరంలో కోపం మోగుతోంది. మనిషి ఊగుతున్నాడు.

'అయ్యో! ఎందుకమ్ముకోనియ్యనూ!

చికి డబ్బుంది గాబట్టి మాయినరిగా లాభం మిగుల్చుకో ! పేదోళ్ళను దోచుకు తింటానంటే ఊరు ఊరుకోదు.'

'ఏదే ఊరు! ఊరు ఊరంతా పగిలబడి మా దగ్గరే కొంటా ఉంది. ఊరుకోకేం చేస్తది ? నా దగ్గిరికి కార్డు మీద వస్తారు జనం !'

'వస్తారొస్తారు. మేం మిగిలిచ్చుకుంటున్న లాభాలో డాబాలేస్తున్నామనీ, కళ్ళు తిరిగొస్తున్నారు. ఇదుగో నాగయ్యా ఎవరెట్టా పోయినా నే మారుకునేది లేదు. అయ్యా! నువ్వు ధర దగ్గియ్యాల్సిందే జాగర్త!' శివమెత్తినదాన్లా అరిచింది రత్తమ్మ. అరుస్తూనే అంతటితో ఊరుకోకుండా నాగయ్య మీద ఎటువంటి చర్య తీసుకోవా



ఎండు చేపలు

లనుకుందో ఏమో ఒక్క అడుగు ముందుకు వేసింది. వేసిన అడుగు పక్కనున్న నున్నటి సొరకాయమీద పడడమేమిటి, కాలు జారిపడి రత్తమ్మ నిలువునా పడిపోవడమేమిటి రెప్పపాటులో జరిగింది. రత్తమ్మ తల, పక్కనున్న క్రాటాలికి తగిలి నేలమీద రక్తం చిందింది. సానుభూతి చూపించడానికి తత్తరపడి చేరుతున్నట్లుగా, సొరకాయలు దొర్లుకుంటూ కిందపడ్డ మనిషి చుట్టూ చేరినయ్.

ఏం జరిగిందో అర్థంకాని నాగయ్య నిలువుగుడ్లేసుకుని చూస్తూ ఉండిపోయాడు. చుట్టూ ఉన్న జనం కెరటాల్లా తెర్లిపోతున్నారు. నేలమీద పాకుతున్న రక్తం అందరివేపూ ఎర్రగా చూస్తోంది. రత్తమ్మపడ్డ తీరుకు పొట్టమీదున్న గుడ్డ కొద్దిగా తొలిగింది. తిండిలేక చిక్కిన కడుపు, చుట్టూ మూగిన జనానికి జరిగిన కథకు మూలమేమిటో చెపుతున్నట్లుగా ఉంది.

దగ్గరే ఉన్న ఇద్దరాడవాళ్ళకూ కాళ్ళు ఒణుకుతున్నయ్. కళ్ళల్లో నీటిపొరలు. మనసునిండా దిగులుతెరలు. వాటిమధ్య, రత్తమ్మ చిక్కిన కడుపూ, దానిచుట్టూ చేరిన నాగయ్య కడుపులాంటి నున్నటి సొరకాయలూ, కదలాడసాగాయి.

వాళ్ళిద్దరూ, పూర్తిగా బెదిరిపోయారు.

భయంతో గుండె దడదడలాడుతుండగా, ఎంతవేగంతో నడిచారో వాళ్ళకే తెలీదు. ఈసారి వాళ్ళకు ఇరుకు సందులో అటూ ఇటూ దుకాణాలమీద ఎండుచేపలు భూతద్దంలో చూచినట్లుగా కనిపిస్తున్నయ్. అంతేకాదు, వాటి స్థానంలో కూరగాయల తట్టలెత్తుకుని ఇళ్ళిళ్ళూ తిరిగే ఎండుచేపల్లాంటి మనుషులు కట్టల్లా మార్చి మార్చి కనపడసాగారు. వాళ్ళు నేలమీద తాపీగా జరుగుతున్న రత్తమ్మ రక్తంలాగా, మెరుస్తూ, ఎర్రగా మండిపోతున్నట్లున్నారు.

అప్పటినుంచి ఆ యిద్దరూ మళ్ళీ చౌగ్గా కాయగూరలు కొందామని కాదేసుకుని బయలుదేరలేదు. ఇంటికి తట్ట లెత్తుకొచ్చిన మనుషుల్లో గిచి గిచి బేరాలు తెలియలేదు

ప్రశ్నోత్తరాలు

...కె. రామలక్ష్మి...

జి. ఎమ్. ఎస్, పెనుమంత్ర

అక్కయ్యా నీవు అంత ఓపిగ్గా సమాధానాలు యిస్తున్నావు కదా? నీకు పత్రిక వారు ఎంత ముడుపు యిస్తారేమిటి?

చూశావా? నీ ఆడబుద్ధి పోనిచ్చుకున్నావు కాదు చిట్టి చెల్లెలా?! నీ జీతం ఎంత? అని నేమడిగావా? అలా అడగడం సభ్యత కాదు.

కొందరు ఆస్తిచూసి గర్వపడతారు. కొందరు అందం చూసి గర్వపడతారు. మరి నువ్వు ఏంచూసి?

ఆ రెండూ లేకపోయినా హాయిగా బ్రతుకుతున్నందుకు—గర్వపడకూడదా?!

వి. ఎన్. ఆర్, గుంటకల్లు

మనుషులు దూరం అయినకొలదీ మమతలు దగ్గరౌతాయి. మరి మనుషులు దగ్గరైనకొద్దీ మమతలు దూరం అవుతాయా?

దూరం అవవుగాని తగ్గుతాయి! సాన్నిహిత్యంలో లోపాలన్నీ భూతద్దంలోంచి చూసినట్టు ఒకటికి రెండింతలై కన్పిస్తాయి. అదే దూరం నుంచి చూస్తే కనీ కనిపించకుండా పోతాయికదా?!

ఎమ్. పి. ఎస్, విశాఖపట్నం

చేతిలో అద్దం పగిలితే?

ఏడేళ్ళు దురదృష్టం—అని ఒక మూఢనమ్మకం!

బి. ఎమ్. ఆర్, టాటానగరు

పెండ్లి ముఖ్యమా? ఉద్యోగం ముఖ్యమా?

ఉద్యోగమే—ఆర్థికంగా తన కాళ్ళమీద తాను నిలబడని వ్యక్తి—యింకో మనిషిని ఎలా పోషిస్తాడు? పోషించలేని వాడు పెళ్లిచేసుకోవడం—అన్యాయం.

కె. ఎస్, కె. ఎస్; కె. జి, బెంగుళూరు

కె. రా. గారూ బాక్సాఫీసు ఎక్కడ వుంది?

థియేటరు బ్యాటరు దగ్గిర!

వి. ఎస్, కావలి

మాలతి చందూరుగారికి ఎందరో తమ సమస్యలను రాసి సలహాలు కోరుతూ వుంటారు మరి మిమ్మల్ని ఒక్కరూ సలహా అడగరేం?

మాలతి అనుభవం కల వ్యక్తి. నేనో? యింకా అనుభవం గడించడంలోనే కొట్టుకొంటున్న దాన్ని. పాఠకులకి ఆ మాత్రం తెలియదేమిటి?

జి. ఆర్. డి, కొల్లిపర

కొంతమంది మనస్సులో ఎంతో ద్వేషం వుంచుకుని పైకి నవ్వుతూ మాట్లాడుతారు వారినేమనాలి?

ఏమీ అనక్కరలేదు—వారిని చూసి మనమే నేర్చుకోవాలి. నీ కోపం ఉత్తరిమీద చూపిస్తే—ఏమ దూరు కుంటారు?

పి. ఆర్. ఆర్, మద్రాసు

ఇంత మహానగరం అయివుండీ, పాత కాలపు ఆచార వ్యవహారాలు, మతనమ్మకాలూను. యింకా! ఇదే తమిళుల ప్రత్యేకత కాబోలు. పార్లమెంటుకెళ్లినా పరాయిదేశం వెళ్లినా వాళ్ల తమిళ సింబాలిజం మార్చుకోరట.

అది ఎవరికీ యిబ్బంది కానప్పుడు—ఎందుకు మార్చుకోవాలిట? మద్రాసు మహానగరపు ప్రత్యేకతలదే—ఎవరి బ్రతుకు వారు బ్రతుకవచ్చు. మీ మీ పద్ధతుల కెవరూ వింత పడరు.

వి. ఎమ్. టి, మహబూబాబాద్

మీ జవాబులు సూటిగా వాడిగా వేడిగా వుంటాయి ఆత్మవిశ్వాసం అందులో తొణికిస లాడుతూ వుంటుంది. అందుకే మీ జవాబు నాకు కావాలి. కవరుకూడా పంపిస్తాను.

క్షమించు సోదరీ, వ్యక్తిగతంగా—ఉత్తరాలు రాయలేను. కవరు పంపడం దండుగ.

వి. ఎస్. ఎస్. వి. కె, పార్వతీపురం

ఉత్తరాలు, కథలు, వ్యాసాలురాసి పత్రికకు పంపేటప్పుడు— ఇండియన్ యింకునే వాడాలా?

అక్కర్లేదు. ఒక్క బొమ్మలకే వాడాలి. అవి బ్లాకు చేయించాలి కనుక.

హెచ్. ఎల్. ఆర్, హోసూరు

జీవితంలో అనుకొన్నదాన్ని సాధించలేకపోవడం దురదృష్టం అనుకోవడం సబబే నంటారా?

దురదృష్టం అనుకోవడం దేనికి? ప్రయత్న లోపం కూడా కావచ్చును కదా?

శారద, కంకటపాలెం

మీ జవాబులు కొందరికి పచ్చి మిరపకాయి నమిలినట్లు, మరికొందరికి చెరుకుగడ తింటున్నట్లు వుంటుంది. మరి మా ప్రశ్నలు మీకు ఎలా వుంటాయి?

బాగా మబ్బుపట్టి సన్నగా చినుకు పడుతూంటే—పక్కింటి వాళ్లింట్లో కరెంటుపోయి మనింట్లో పోకుండా వుంటే— హాయిగా కూర్చుని కారపు సెనగలు తింటున్నట్టు, నన్ను తిట్టుకుంటున్న వాళ్ల నన్ను తల్చుకుంటున్నట్టు— మహా నందంగా వుంటుంది శారదా.

పి. ఎమ్. టి, కాకినాడ

జీవితం మీకు ఎలా అనిపిస్తుంది రామలక్ష్మి?

ఇదొక నీటి బుడగ. ఎండ పడుతున్నంతసేపూ దాని మీద మెరిసే ఇంద్రధనుసులవి, మెరుపులవి చూసి ఆనందించాలని వుంటుంది. అది పగిలి పోయాక— ఏమో— ఎవరు చెప్పగలరు?

జె. సి. జె, ప్రొత్తకోట

ఈనాడు మానవుడు ప్రకృతిని జయించానని గర్వపడుతున్నాడు గాని తనలో అంతర్గతమై ఉన్న పంచేంద్రియాలను జయించలేక పోవుటలో గల రహస్యమేమిటి?

మానవుడు చంద్రునిపై పాదం మోపాడే గాని ప్రకృతిని జయించాడా అన్నదింకా సందేహమే కదా! ఇక పంచేంద్రియాలను జయించాలన్న గట్టి కోరిక లేకపోవడమే. దాట్లో వున్న రహస్యం.



మన ముఖ్యమైన పర్వాలలో దీపావళి ఒకటి. ఇందులో పిల్లల వేడుకలు, ఉత్సాహము అధికము. శ్రీ కృష్ణుడు నరకాసురుడిని సంహరించి, ప్రజల కందరకూ అంతు లేని ఆనందాన్ని కలిగించడంవల్ల పండుగ చేసుకొంటున్నట్లు అందరూ అనుకొంటారు.

కాని, నరక చతుర్దశి, దీపావళి—అనే వీటినుండి గ్రహించవలసిన విషయాలు ఎన్నో ఉన్నవి.

ఈ పండుగను ఎంతో వేడుకగా జరుపుకోవడం అటుంచి చూడగా—లోకానికి ఉపయోగపడే ప్రయోజనమూ ఉన్నది. జరిగిపోయిన కాలం వర్షర్తువు. అనారోగ్యానికి మూలం. శరత్కాలంలో కూడా ఆ వెనకటి ఋతువువలని అనారోగ్యస్థితి ఉండనే ఉంటుంది. క్రిమి, కీటాదులు ఎంతో విజృంభిస్తాయి. వాటివల్ల సస్యాలకు ఎంతో నష్టం కలుగుతుంది. బాణా సంచాలు కాల్చడంవల్ల వాటిలోని గంధకము మున్నగు క్రిమిసంహారక ద్రవ్యాలవల్ల అవి నశిస్తాయి.

జీవులు ప్రాణపరిత్యాగం చేసినతర్వాత నాకాన్నో, నరకాన్నో—వారివారి కర్మలను అనుసరించి పొందుతారు. నరకం ఎన్నో యాతనలకు నిలయం; తమోమయం. ఇక నాకం—అంటే స్వర్గం సమస్తసుఖాలకు నిలయం. తేజోమయ మైనది. అందరూ స్వర్గాన్నే కోరుతారు; నరకాన్ని ఎవ్వరూ కోరరు.

దీపావళినాడు చేసే దీపారాధన జ్ఞానానికి సూచకమైనది. అది అజ్ఞానమనే తమస్సును పోగొడుతుంది.

'తమసి న పశ్యతి దీపేన వినా
న చక్షురపి.'

అంటే—కన్నులుండి, బాగా చూడగల వారైనా సరే, చీకటిలో దేనినీ చూడలేరు. చీకటిలో ఉండే వస్తువులను చూడాలంటే దీపం ఉండితీరాలని దీని అభిప్రాయం.

నరకాసురవధ అంటే నరకానికి కారణమైన అజ్ఞానాన్ని నశింపజేయడమని అభిప్రాయం. నరకానికి కామ, క్రోధ, లోభాలు మూడున్నూ హేతువులు. ఆ మూడింటినీ నశింపజేస్తే అజ్ఞానాంధకారం నశిస్తుంది.

'త్రివిధం నరకస్యేదం
ద్వారం నాశన మాత్మనః,
కామః క్రోధస్తథా లోభః
తస్మాదేతత్ త్రయం త్యజేత్.'

ఈ అంధకారాన్ని నశింపజేయడానికి తగిన జ్ఞానదీపం ఎలా ఉండాలో గమనించండి.

'వైరాగ్యతైల సంపూర్ణే
భక్తివర్తి సమన్వితే,
ప్రబోధపూర్ణపాత్రే తు
జ్ఞప్తిదీపం విలోకయేత్.'

ప్రబోధమే పూర్ణపాత్ర—అంటే నిండైన ప్రమిద. దాన్ని వైరాగ్యమనే నూనెతో నింపాలి. భక్తి అనే వత్తిని వెయ్యాలి. అలా వేసి వెలిగిస్తే జ్ఞానమనేదీపం వెలిగించవచ్చుని వీని అభిప్రాయం.


వైరాగ్యం కలిగి, భక్తిభావం సమగ్రమై ఉన్నప్పుడు ప్రబోధం అజ్ఞానమనే అంధకారం నశించి, జ్యోతీరూపమైన జ్ఞానం కలుగుతుందని దీనివల్ల గ్రహించాలి.

మరొక విషయం—

నరకుని బాధలనువడలేక దేవతలందరూ శ్రీకృష్ణుని శరణుపొంది, అతని మూలంగా తమ బాధలను తొలగించుకొని కృతార్థులైనారుగదా!

జీవుల జాడ్యాన్ని నిర్మూలించే చైతన్య జ్యోతియే శ్రీకృష్ణపరమాత్మ స్వరూపం! కామాంధులూ, క్రోధావిష్టులూ, మోహపాశబద్ధులూ అయినవారు నరకాభిభూతులై ఉంటారు. జ్ఞానజ్యోతి అయిన నారాయ

హరిరామ్



ణుని ఆశ్రయించినప్పుడే వారికి వరక నిర్బంధం తొలగిపోతుంది.

అంతర్జ్యోతిని— దివ్యజ్యోతిని ఆశ్రయించినవారిని మాయాంధకారం సమీపించలేదు. అది తనంతట తానే దూరంగా తొలగిపోతుంది.


అంధకారరూపమైన అవిద్యకు వశులైన వారు నరకాన్నే పొందుతారు. వారికి జ్ఞాన జ్యోతిస్సు కానరాదు. జ్యోతీరూపమైన శ్రీమన్నారాయణుని దయకు పాత్రులైన వారు మాత్రమే జ్ఞానజ్యోతి మూలంగా భగవద్వైభవాన్ని దర్శించగలుగుతారు.

ఈ తత్త్వాన్ని వ్యక్తంచెయ్యడమే దీపావళియొక్క పరమప్రయోజనం.

—అంగిరస ●

దీపావళి కథల పోటీలో రూ.500 బహుమతి పొందిన కథ

నిర్ణయం



"ఉమ"

చదువుకుంటున్న పుస్తకం ప్రక్కన పెట్టి 'ఇదుగో విన్నే' అంటూ భార్యని పిలిచాడు జానకి రామయ్య. లోపల నట్టింట్లో కూర్చుని రుక్మిణితో బియ్యంలో రాళ్ళు ఏరుతున్న విశాలాక్షమ్మ ఆ పిలుపు విని 'ఓయ్ వస్తున్నా' అంటూ లేచి నిలబడి వాకిట్లో వాలుకుర్చీలో కూర్చున్న జానకి రామయ్య దగ్గరకి వెళ్ళి 'ఏమిటి' అంది.

ఆయన మెల్లిగా 'నాకు తినటాని కేదయినా కావాలి' అన్నాడు.

'అస్తమానూ తినటాని కేం వుంటుంది. ఇప్పుడేకదా భోజనంచేశారు' అంది విశాలాక్షమ్మ కొంచెం విసుగ్గా.

'నాకు ఆకలి వేస్తూంది' అన్నాడు జానకి రామయ్య.

విశాలాక్షమ్మకి చిరాకు కలిగింది. ఆవిడ పెద్దగొంతుతో 'అవును మీకీమధ్య ఆకలి ఎక్కువవుతోంది. ఏంలేదని చెప్తే అర్థం చేసుకోరే. ఒక్కడి సంపాదనమీద ఇల్లు గడుస్తూంది. మనుషులం ఎంత కష్టపడుతున్నామో మీకేమయినా తెలుస్తూందా. మరీ కుర్రాడయిపోతున్నా రీమధ్య. మీకంటే కృష్ణుడే నయం. 'లేదురా' అంటే అర్థం చేసుకుని వెళ్ళిపోతాడు' అంది.

అత్తగారి గొంతు విని రుక్మిణి తలుపు చాటుకివచ్చి 'మీరు ఇలా రండి అత్తయ్యా' అంది

జానకి రామయ్య కుర్చీలోంచి లేచి నిలబడి తువ్వాలు భుజంమీద వేసుకుని 'అవును నువ్వు ఉందని ఎప్పుడన్నావు. ఎప్పుడూ లేదని ఏడుపే. మొద్దుమొహం' అంటూ వీధి గుమ్మంలోనుంచి బయటికి నడిచాడు.

విశాలాక్షమ్మ లోపలికివెళ్తూ 'చూడమ్మా ఈయన అల్లరి. రోజురోజుకీ పసివాడయి పోతున్నారు. ఓరోజు జంతికలంటారు, మరోరోజు పాయసం కావాలంటారు, మరో రోజు సినిమా చూస్తానంటారు. వీటన్నిటికీ డబ్బెక్కడనుంచి వస్తుంది. ఒక్క సంపాదనమీద ఇల్లు గడవాలా. పైగా చేసే ఆ కోమటి గుమాస్తా ఉద్యోగంకూడా మానేశారు. ఏదైనా అంటే నాకొడుకు రెండు చేతులా సంపాదిస్తున్నాడు. పెద్దకష్టాలు ఎలాగూ పడ్డాను. కనీసం ఇప్పుడయినా అనుభవించాలి. ఇంకెవడికిందా పనిచెయ్యను' అంటారు. వాడికొచ్చే మాటయాభైరూపాయలతో ఈ సంసారం ఎలా గడుస్తుందంటే వినరు. అంతా నా ఖర్మ' అంది.

'ఊరుకోండత్తయ్యా! ఆయనకి మాత్రం తెలియవేమిటి. పాపం నిజంగా ఆకలి వేస్తూందేమో' అంది రుక్మిణి.

విశాలాక్షమ్మ ఒకసారి మూతి ముడిచి బియ్యం ముందు కూలబడి, అందులోని రాళ్ళు ఏరటంలో నిమగ్నురాలయింది.

రుక్మిణి వీధిలోకి వచ్చి మామగారు ఎటు వెళ్తున్నది చూసింది. ఆయన అలవాటు ప్రకారంగానే సముద్రంవైపు వెళ్ళసాగాడు. ఆమె ఒకసారి నిట్టూర్చి వీధితలుపు దగ్గరగా వేసి, వచ్చి అత్తగారి దగ్గర కూర్చుంది.

* * *

జానకి రామయ్య మెల్లిగా నడుస్తూ

సముద్రం ఒడ్డుకి చేరాడు. తను ఇల్లు సముద్రం ఒడ్డునే వుండటంవల్లనూ, చిన్నతనంనుంచీ ఆ ఒడ్డునే గడపటంవల్లనూ ఆయనకి సముద్రం అన్నా, దానిచుట్టూ వాతావరణమన్నా విపరీతమయిన ఇష్టం.

దూరంగా జాలరివాళ్ళు ఇసుకలో కూర్చుని చిరిగిపోయిన వలలు సరిచేసుకుంటున్నారు. ఆయన బద్ధకంగా ఒక్కసారి ఒళ్ళు విరుచుకుని శిథిలాలయి పోయిన డచ్చివారి మేడలవైపు నడవసాగాడు.

మేడల ప్రక్కన డచ్చివారి సమాధులు వున్నాయి. అప్పుడప్పుడు గేటుతీసివుంటే జానకిరామయ్య ఆ సమాధులలోకి వెళ్ళి ఎవరెవరు ఎప్పుడు చచ్చిపోయారో చూస్తుంటాడు, 'పాపం ఎక్కడివాళ్ళో ఎక్కడ చావు రాసి పెట్టుంది.' అనుకుంటుంటాడు

జానకిరామయ్య ప్రక్కనుంచి వెళ్ళుతుండటం చూసి ఓ బెస్తవాడు 'ఓ చుట్టుంటే ఇప్పించండి బాబో' అన్నాడు వెంటనే మరొకడు 'ఛస్ గమ్మునుండొరే బాబుగారు చుట్టలు కాల్చరు' అన్నాడు ఆయన వాళ్ళవైపు ఓసారి చూసి, డచ్చివారి మేడ ప్రహరీగోడ దగ్గరగా వెళ్ళి, ఓరాయి మీద కూర్చుని, దూరంగా వున్న సాగర సంగమం కేసి చూడసాగాడు. ఆయన కూర్చున్నస్థలానికి కొద్దిదూరంలో బెస్తవారి పిల్లలు చెడుగుడు ఆడుతున్నారు. ఆయన వాళ్ళ ఆట చూస్తూ ఏదో ఆలోచించసాగాడు.

* * *

ఇంట్లోకి వస్తూనే పుస్తకాలగంపి ఓమూలకి విసిరేసి 'అమ్మా తినటానికేంచేశావు' అన్నాడు కృష్ణుడు. విశాలాక్షమ్మ తలెత్తి 'ఇదుగో ఆ తాతకి మనవడు' అంది. రుక్మిణి మెల్లిగా 'ఏంలెదురా' అంది.

'తాతయ్యకి కూడా ఏం పెట్టలేదా' అన్నాడు కృష్ణుడు.

'ఊహూ' అంది రుక్మిణి.

'నాకు నిజంగా ఆకలేస్తూంది. మధ్యాహ్నం కూడా ఏం తినలేదుకదా.'

విశాలాక్షమ్మ ఓసారి తలెత్తి చూసి, ఏం మాట్లాడకుండా తనపనిలో నిమగ్నురాలయింది.

రుక్మిణి లేచి నిలబడి 'ఉండు అటుకులయినా వున్నాయేమో చూస్తా'నంటూ వంటింట్లోకి వెళ్ళింది. డబ్బాలు వెదుకుతే కాసిని అటుకులు కనిపించాయి.

'ఈ అటుకులు వేయించి కారంచల్లి ఇయ్యి. తాతయ్యా నేనూ తింటాము' అన్నాడు కృష్ణుడు.

రుక్మిణి వేయించి ఇచ్చింది.



దీపాల తోరణం (ఫోటో: శ్రీ ఆర్. ఉదయభాస్కర్)

దివ్వెల రవ్వలు

ఇవి దివ్వెలు— ఇవి రవ్వలు
రజనికి దివ్వెల రవ్వలు
నేలతల్లి తలపువ్వులు
నిశాచరుల ఎదచువ్వలు
ఈ చీకటి వాకిటలో
దూసిన వేకువ బాకులు
ఖేటక నాటిక సత్యా
భ్రుకుటీ ముకుళిత రేఖలు
సత్రాజితి సారించిన
శింజిని మ్రోగిన మువ్వలు
అరిభంజన సమయంలో
నెత్తుట దోగిన పువ్వులు

చరిత్ర సత్యం చాటెడి
విజయేందిర అందియలివి
మానవతను వెలికి తెచ్చు
భువితారా తోరణాలు
నరకాసుర నాశనులను
కదిపిన బంగ్లా గువ్వలు
అరుణారుణ దీధితితో
చెదిరిన శౌర్యపు రవ్వలు
కన్నతల్లి పెదవులపై
చెన్నొందిన చిరునవ్వులు
అందమైన ఆగామికి
ఇవి దివ్వెలు— ఇవి రవ్వలు.

— పైడిపాల

కృష్ణుడు కొంచెం నోట్లో పోసుకుని మిగతాది పొట్లంకట్టి బయటకి వరు గెత్తాడు.

'ఒరేయ్ క్రిష్ణా తాతయ్య సముద్రం ఒడ్డుకి వెళ్ళారు' అంది రుక్మిణి వెనుక నుంచి. 'నాకు తెలుసు' అన్నాడు కృష్ణుడు.

ఇసుకలో పరిగెట్టుకుంటూ వెళ్లి దూరంనుంచే 'తాతయ్యా' అంటూ పిలి చాడు కృష్ణుడు. జానకిరామయ్య వెనక్కి తిరిగిచూసి లేచి నిలబడ్డాడు. కృష్ణుడు ఆయన దగ్గరకి వచ్చి 'నీకోసం వేయించిన అటుకులు తెచ్చాను. రా తిందాం' అన్నాడు. ఆయన వాడికేసి ఆప్యాయంగా చూసి 'వద' అన్నాడు. ఇద్దరూ బోర్లగించిన ఓ పడవ ప్రక్కన కూర్చుని పొట్లంవిప్పి అటుకులు తినసాగారు.

'తాతయ్యా ఇవాళ స్కూల్లో మా మాష్టారు ఓ పద్యం చెప్పాడు. అసలేమీ అర్థం కాలేదు. మళ్ళీ చెప్పమంటే, కసిరి 'కావాలంటే మా యింటికొచ్చి ప్రైవేటు చెప్పించుకో లేకపోతే మీ తాతతో చెప్పించుకో' అన్నాడు.

'ఏడిశాడు నేను చెప్తానులే నీకు' అన్నాడు జానకిరామయ్య.

సముద్రం అలలు పౌర్ణమి ప్రశాంతమవుతున్న కొద్దీ ఎగిసెగిసి పడుతున్నాయి. తాత మనవలిద్దరు సముద్రంకేసి చూస్తూ కూర్చున్నారు. మధ్యమధ్యలో కృష్ణుడు కొన్ని అటుకులుతీసి చుట్టుచేరిన కాకులకి విసరసాగాడు. అటుకులు అయిపోగానే 'నేను వెళ్ళి ఆడుకోవాలి తాతయ్యా. శీనుకి వాళ్ళబావ కొత్తబేటు కొన్నాడు' అంటూ కృష్ణుడు వెళ్ళిపోయాడు. మరి కొంతసేపు అక్కడే కూర్చుని సంధ్య చీకట్లు పడుతూంటే ఇల్లు చేరాడు జానకి రామయ్య.

* • •

రాత్రిభోజనం పూర్తికానిచ్చి అరుగు మీది మంచంపై నడుం వాల్చాడు జానకి రామయ్య. ఎదురుగావున్న ఇన్స్పెక్టరుగా రింట్లో గోడగడియారం ఎనిమిదిగంటలు కొట్టింది.

జానకిరామయ్య మస్తిష్కంలో ఏవేవో ఆలోచనలు రేగసాగాయి. ఆయన తన గతం ఎలా గడచినదీ గుర్తు తెచ్చుకోసాగారు.

నిర్ణయం

ఆయన జీవితం చిన్ననాటినుంచి చాలా కష్టాలలో గడిచింది. తండ్రిజబ్బుతో ఉన్న ఇల్లుతప్ప ఆయనకేమీ మిగలలేదు. కొన్నాళ్ళకి జబ్బుతో తండ్రి మరణించాడు. అప్పటికి ఆయన స్కూలు ఫైనలు పాస య్యాడు. ఆ తర్వాత స్నేహితులు, శ్రేయోభి లాషలు సహాయంతో టీచరు ట్రెయినింగు పూర్తిచేసి విజయనగరంలో ఓ స్కూలులో ఉపాధ్యాయుడుగా చేరాడు. కొన్నేళ్ళకి ఆయన పెళ్ళయింది. స్వంతఇల్లు వదిలి పరాయివూళ్ళో వేరే ఇల్లు అద్దెకి తీసుకుని కాపురం పెట్టే స్తోమత లేక ఆయన తల్లిని, భార్యనిఉన్న ఊళ్ళోనేవుంచి తను మాత్రం ప్రతి మూడురోజులకోసారి, సెలవు దినాలప్పుడు సైకిలుమీద ఇంటికి వస్తుండే వాడు.

రోజులు గడుస్తున్నకొద్దీ పెరిగే ధర లతో ఆయన ఆర్థిక పరిస్థితి మరింత క్రుంగిందేకాని బాగుపడలేదు. ఆయన ఏవేవో చిల్లరపనులుచేసి నెలకి ఐదూ, పదీ సంపా దించేవాడు. విజయనగరంలో బంధువుల ఇంట్లో, వరండాలో ఓమూలవుంటూ, వండుకుంటూ కాలం గడిపాడు. ఆయన ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే వుండేది.

జానకిరామయ్యకి కొడుకుపుట్టాడు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు ముద్దూ ముచ్చటా ఆయన తీర్చలేకపోయాడు. సంవత్సరాలు గడుస్తున్నకొద్దీ కుర్రవాడికి కూడా ఆ యింటి పరిస్థితులు అర్థమవ సాగాయి.

చిన్నో దరఖాస్తులు పెట్టుకున్న తర్వాత జానకిరామయ్యకి స్వంతవూరు భీమునిపట్నంకి బదిలీ అయింది.

కొడుకుని పెద్ద చదువులు చదివించి, అతడు పెద్ద ఉద్యోగస్తుడు అయితే తను వృద్ధాప్యంలో సుఖపడవచ్చుని ఆశించిన జానకి రామయ్యకి నిరాశ ఎదురయింది. ఆయన కొడుకు సుందరశివరావు స్కూల్ ఫైనల్తో చదువాపేసి, 'ఇంటి పరిస్థితులు ఇలా వుండగా పై చదువులు చదవను' అని ఖచ్చితంగా చెప్పేసి చిట్టివలసలో ఓ మిల్లులో గుమాస్తాగా చేరిపోయాడు.

కొన్నేళ్ళకి సుందరశివరావు పెళ్ళ యింది. రుక్మిణి కాపురానికొచ్చింది. కృష్ణుడు పుట్టాడు. రిటైరయ్యేసరికి జానకిరామయ్యకి తన పాత జీవితమే ఎదు రుగా కనిపించింది. కొడుకుకి వచ్చే జీతం తోనే ఇల్లు గడపాలి.

'కొడుకు పెద్ద ఉద్యోగంచేసి తనని ఉద్ధరిస్తాడనుకొన్న' ఆశ ఆయనని వెక్కి రించసాగింది. ఆయనకి ఉక్రోషం జీవితం మీద కసి ఏర్పడ్డాయి. 'నేనింతవరకూ ఎప్పుడు సుఖపడ్డాను' అని ఆయన తనని తాను ప్రశ్నించుకున్నాడు. చివరికాయన బలవంతంగానయినా కోర్కెలు తీర్చుకోవా లని ప్రతివిషయానికి మారాము పెట్టడం మొదలుపెట్టాడు.

ఆయన మనస్తత్వం ఆయన మొదటి నుంచి పడిన కష్టాలు తెలిసిన సుందర శివరావు తండ్రి అడిగినవన్నీ ఏదోవిధంగా సమకూర్చేవాడు. కాని విశాలాక్షమ్మకి మాత్రం భర్త ధోరణి బొత్తిగా నచ్చేది కాదు.

ఆలోచిస్తున్న జానకిరామయ్య సైకిలు చప్పుడు విని కళ్ళు మూసుకుని కదల కుండా పడుకున్నాడు. సుందరశివరావు ఇంటి ముందు సైకిలు దిగి, వరండాలో సైకిలు ఉంచి లోపలికి వెళ్ళిపోయాడు. ఎదురింటి గడియారం పదిగంటలుకొట్టింది.

కాసేపటికి లోపల్నుంచి విశాలాక్షమ్మ కొడుకుకి అన్నం వడ్డిస్తూ—

'ఇంత ఆలశ్యమయిందేరా' అని అడి గింది.


'మిల్లులో పని తగిలిందమ్మా. తర్వాత ట్యూషన్ కుర్రాళ్ళకి పరీక్షలు వస్తున్నాయి కదా. వాళ్ళకి ఏదో లెక్కలు తెలియకపోతే చెప్తూవుండిపోయాను' అన్నాడు సుందర శివరావు. తర్వాత 'నాన్న నిద్రపోయా రామ్మా' అని అడిగాడు.

'ఆ! నిద్రపోయేవుంటారు. చంపేస్తు న్నారనుకో ఇది కావాలని అది కావాలని. లేదంటే కోపం.' అంది విశాలాక్షమ్మ.

'పోనీలేమ్మా. అడగని కనీసం ఈ వయ సులోనయినా ఆయనని సుఖపడనియ్యి.'

'ఏమి సుఖమో' అంటూ నిట్టూర్చింది విశాలాక్షమ్మ.

జానకిరామయ్య ఈ మాటలు వింటూ


SANKAR
I C
CEMENT
దీపావళి శుభాకాంక్షలు
ఇండియా సిమెంట్స్ లిమిటెడ్
ధన్ బిల్డింగ్, మద్రాసు 1
తయారుచేయు
శంకర్
సిమెంట్

కుర్చీలో కూర్చుని ఎదురుగా వున్న కొబ్బరిచెట్లు, చందమామ, సముద్రం అల లను చూడసాగాడు. కాసేపటికి ఆయనకి నిద్రపట్టింది.

* *

'కృష్ణుడి వళ్ళు కాలిపోతూంది. జ్వరం బాగా వున్నట్టుంది. వచ్చేటప్పుడు ఏదయినా మందు పట్టుకురండి,' అంది రుక్మిణి. 'అలాగే' అన్నాడు సుందరశివరావు సైకిలుమెట్లు మీదుగా క్రిందకి దింపుతూ.

'ఊరంతా మాయదారి జ్వరాలు నాయనా. ముందుగా డాక్టరుకి చూపించాలి. లేకపోతే తర్వాత కష్టపడవలసివస్తుంది,' అంది విశాలాక్షమ్మ.

'అలాగే అమ్మా' అంటూ సుందర శివరావు సైకిలు ఎక్కి మిల్లుకి వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం ఆ వీధిలో ఇన్‌స్పెక్టరు గారి ఇంటికివచ్చిన డాక్టరు సుందర శివరావు చెప్పటం మూలంగా వాళ్ళ యింటికి వచ్చి కృష్ణుడిని పరీక్షించాడు.

'సందేహం లేదు ఇది పారా టైఫాయిడ్. టెంపరేచర్ అంతా చాలా ఎక్కువగావుంది. మీరు కుర్రవాడిని జాగ్రత్తగా చూసుకోవాలి' అన్నాడు.

'అయ్యో దేవుడా! నేను మొదట్నించి అనుకుంటూనేవున్నాను' అంది విశాలాక్షమ్మ.

నిర్ణయం

'మీ రంతా భయపడవలసినదేమీ లేదు. మందులు, ఇంజక్షనులు వ్రాసిస్తాను. తెప్పించి వాడండి. తగ్గిపోతుంది' అంటూ ఓ కాగితంమీద వ్రాసిచ్చాడు డాక్టరు.

రుక్మిణి కృష్ణుడి తలదగ్గర దిగులుగా కూర్చుండటం చూసి 'మీరేం భయపడకండమ్మా తగ్గిపోతుంది. నేను రెగ్యులర్‌గా వచ్చి చూస్తుంటాములెండి' అన్నాడు డాక్టరు.

రుక్మిణి తలెత్తి కృతజ్ఞతా పూర్వకంగా ఓసారి చూసింది.

డాక్టరు తన మెడికల్ చెస్ట్ తీసుకుని బయటకి నడిచాడు. గుమ్మంలో, అంత వరకూ సముద్రతీరంలో తిరిగి వచ్చిన జానకిరామయ్య ఎదురుపడ్డాడు.

'నమస్కారం మాష్టారూ! బాపున్నారా!' అంటూ పలకరించాడు డాక్టరు,

'ఆ!' అన్నాడు జానకిరామయ్య. డాక్టరు వెళ్ళిపోయాడు.

జానకిరామయ్య ఇంట్లోకి వస్తూనే భార్యని ఉద్దేశించి 'డాక్టరు మనింటికెందుకు వచ్చాడు' అన్నాడు.

'కృష్ణుడికి టైఫాయిడ్‌ట' అంది విశాలాక్షమ్మ.

ఆమాట విని ఆయన కృష్ణుడు పడుకున్న గదిలోకివెళ్ళి కాసేపు వాడినిచూసి ఏం మాట్లాడకుండావచ్చి అరుగుమీద కూర్చుని ఎదురుగావున్న సముద్రంకేసి చూడసాగాడు.

* * *

జానకిరామయ్య అరుగుమీద కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. ప్రక్కింటి శీను పరుగెత్తుకుంటూ వచ్చాడు.

'ఏమిట్రా శీనూ సంగతి' అన్నాడాయన.

శీను ఆయాసపడుతూ 'మరేమోనండీ తాతగారూ బీచ్చివలనకి. సర్కసొచ్చింది. స్కూలు కుర్రాళ్ళందరం ప్రొద్దున్నవెళ్ళి ఏనుగులు, లొట్టిపిట్టలు, గుర్రాలు, పెద్దపులులు, ఎలుగుబంట్లు అన్నీ చూసి వచ్చాము. సర్కసులో అమ్మాయి జీపు, మోటారుసైకిలు నడిపిస్తూ జంప్ చేయిస్తుందట. ఇంకా ఏవేవో ఫీట్లున్నాయిట' అంటూ కృష్ణుడి గదిలోకి పరుగెత్తాడు.

జానకిరామయ్య గదిలో జరుగుతున్న కుర్రవాళ్ళ సంభాషణ వినసాగాడు. శీను తాను చూసిన వింతలూ, విశేషాలు చిలవలు, పలవలుగా కృష్ణుడికి చెప్తున్నాడు. తను రెండురోజుల్లో సర్కసుకి వెళ్ళబోతున్నట్టు కూడా చెప్పాడు.

కృష్ణుడు దిగులుగా 'నేనెలారా సర్కసు చూసేది. ఈ జ్వరం తగ్గాలి కదా. అప్పటి వరకూ సర్కసు వుంటుందో లేదో' అన్నాడు.


'సర్కసు వుంటుంది లేరా. ముందు నేను చూసొచ్చి నీకన్నీ చెప్తాను. నీ జ్వరం తగ్గాక మనిద్దరం మళ్ళీ చూద్దాము' అన్నాడు శీను.

కృష్ణుడు మాట్లాడలేదు.

శీను సర్కసు వింతలు మిగతా స్నేహితులకి చెప్పటానికి వెళ్ళిపోయాడు.

జానకిరామయ్య మెదడులో ఒంటెలు, ఏనుగలు, పులులు, సింహాలు ఎలుగుబంట్లు, సైకిళ్ళమీద అమ్మాయిలు, జీపులో అమ్మాయి సర్కసు చేయసాగారు. ఆయన తను చిన్ననాట చూసిన సర్కసు గుర్తు తెచ్చుకోసాగాడు. తర్వాత మెల్లిగా 'అవును చాలా ఏళ్ళయింది. సర్కసు చూడాలి' అనుకున్నాడు. ఆయనకి ఏదో తెలియని హుషారు కలిగింది.

* * *



ఆదివారం ఉదయం జానకిరామయ్య భార్యనిపిల్చి 'నేనివాళ సర్కను మ్యాట్నీ చూస్తాను' అన్నాడు.

'ఏమిటీ!' అంది విశాలాక్షమ్మ.

'ఇవాళ సర్కను మ్యాట్నీ చూస్తాను.'

'డబ్బెక్కడిది. ఇంటిఖర్చు ఈమధ్య కృష్ణుడి జ్వరంతో పెరిగిందికదా. పైగా ఇలా నెల మధ్యలో సర్కసులు, సినిమాలు అంటే డబ్బెక్కడనుంచొస్తుంది' అంది విశాలాక్షమ్మ.

'నేనివాళ సర్కను చూడాలి' అన్నాడు జానకిరామయ్య.

విశాలాక్షమ్మలో సహనం చచ్చిపోయింది. ఆవిడ పెద్దగొంతుతో 'ఉదయానే నాచేత కేకలెందు కేయిస్తారు. అస్తమానూ డబ్బు అంటే ఎక్కడినుంచొస్తుంది. మన పాతు ఇక్కడేదయినా ఉందా అస్తమానూ త్రవ్వి తెచ్చుకోడానికి' అంది.

ప్రక్క గదిలోంచి సుందరశివరావు గుమ్మం దగ్గరికి వచ్చి 'అమ్మా నువ్విలా రా!' అన్నాడు.

కొడుకుని చూడగానే జానకిరామయ్య చివాలునలేచి నిలబడి 'ఛీ వెధవ బ్రతుకయిపోయింది' అంటూ భుజంమీద తువ్వాలు వేసుకుని బయటకి నడిచాడు.

'నాన్ననేమీ అనకమ్మా' అన్నాడు సుందర శివరావు చొక్కా తొడుక్కుంటూ.

'నీకేం తెలియదురా! నువ్విలా ఊరు కున్నావనే ఆయన ఆడింది ఆట పాడింది పాటగా వుంది' అంది విశాలాక్షమ్మ.

'పోనీలేమ్మా' అన్నాడు సుందరశివరావు. సైకిలు వరాండాలో నుంచి బయటకి నడిపిస్తూ 'ఇవాళ మిల్లులో ఓవర్‌టైము ఉందమ్మా. వచ్చేసరికి ఆలస్యం అవుతుంది. మీరందరూ భోజనం చేసెయ్యండి' అన్నాడు.

రుక్మిణి వంటింటి గుమ్మం దగ్గరికి వచ్చి 'వచ్చేటప్పుడు కృష్ణుడి మందు మర్చిపోకుండా వ్రటండి. రేపటితో మందు అయిపోతుంది' అంది.

'అలాగే' అంటూ సుందరశివరావు సైకిలు ఎక్కాడు.

విశాలాక్షమ్మ వీధి తలుపువేసి కృష్ణుడి గదిలో వాడిదగ్గర కూర్చుంది.

• •

సుందరశివరావు సైకిలు రోడ్డుమీద ఆపి. దూరంగా డచ్చినారి బిల్డింగుల అవతల రాళ్ళమీద కూర్చుని నీటిలోకి చిన్నచిన్న రాళ్ళు విసురుతున్న తండ్రిని చూసి, మెల్లిగా అటువైపు నడవసాగాడు.

జానకిరామయ్య తల వెనక్కి త్రిప్పి దగ్గరగా వస్తున్న కొడుకునిచూసి చేతిలో రాళ్ళు నీటిలో విసిరేసి మౌనంగా కూ... న్నాడు.

సుందరశివరావు దగ్గరకి వచ్చి ... అంటూ పిల్చాడు. జానకిరామ... త్రిప్పాడు. 'మీకేదయినా కావాలం... గండి. ఇవాళ సర్కసుకి వెళ్ళండి ... జేబులోనుంచి ఐదు రూపాయల ... తండ్రికిచ్చాడు. జానకిరామయ్య ... కుండా ఆ నోటు అందుకున్నాడు ... శివరావు వెనక్కి తిరిగాడు. అతడి ... తండ్రి తననేం అడగడని. అయ... సారీ అతడిమాట అంటూనే వుం...

ఐదురూపాయిల నోటు చేతిల... కుని జానకిరామయ్య కొద్ది క్షణా... లంగా నిలబడ్డాడు. ఆయన ... తను చేసేపని సరియునాదేనా ... రేగసాగింది. ఇంతలో ఆయనకి



పులులు, సింహాలు, ఏనుగులు, ఒంటెలు వగైరా కళ్ళముందు ఆడాయి. ఆయన ఒక్కసారి హుషారుగా నడవసాగాడు.

* * *

సర్కసులో జానకిరామయ్య సంతోషానికి అంతులేకపోయింది. ఆయన ప్రతి ఐటమూ కళ్ళు పెద్దవి చేసుకుని చూడసాగాడు. చిన్నపిల్లలుకూడా రకరకాలుగా మొగ్గలు వెయ్యటం, తీగమీద ఆడపిల్లలు నడవడం వగైరాలుచూసి ఆయన 'పాపం వీళ్ళు చాలా కష్టజీవులు' అనుకున్నాడు. బఫూన్ పిల్లిమొగ్గలువేసి తమాషాలు చేస్తున్నప్పుడు ఆయన చిన్నపిల్లవాడిలా చప్పట్లు చరచసాగాడు. చుట్టూవున్న జనం తనని విచిత్రంగా చూడడంతో తన్నుతాను సంభాళించుకున్నాడు.

సర్కసు అయిపోయింది.

జానకిరామయ్య బయటకివచ్చి బజారు గుండా నడవసాగాడు. మిఠాయి దుకాణం చూడగానే ఆయనకి పకోడీలపై మనసు పోయింది. ఆయన పకోడీలుకొని పొట్లం చేతిలో పట్టుకుని తన ఊరు వైపు నడవసాగాడు. సూర్యుడు పశ్చిమాద్రిన క్రుంకుతున్నాడు. సాయంకాలపు నీరెండ ఆహ్లాదంగా వుంది. 'ఇంటికి నడిచే వెళ్తాను. మూడుమైళ్ళేగా' అనుకున్నాడాయన. పకోడీలపొట్లం విప్పి హుషారుగా నడవసాగాడు.

చీకటి పడుతుండగా ఇల్లుచేరి స్నానం చేశాడు. విశాలాక్షమ్మ భోజనం వడ్డిస్తూ 'సర్కసు ఎలావుంది' అని అడిగింది.

'సర్కసుకేం బ్రహ్మాండంగా వుంది. నువ్వుకూడా రావాల్సింది' అన్నాడు జానకిరామయ్య.

'ఆ! అదొక్కటే తక్కువయింది' అంది విశాలాక్షమ్మ. ఆయన మారుమాట్లాడకుండా సీదా అరుగుమీది మంచంపై పడుకున్నాడు.

ఎదురింటి గడియారం తొమ్మిది గంటలు కొట్టింది.

జానకిరామయ్య దూరంగావున్న కొబ్బరి చెట్లు, చంద్రుడు, సముద్రంకేసి చూడసాగాడు. ఆయన మెదడులో సాయంత్రం తను చూసిన సర్కసు చిత్రాలే మెదులుతున్నాయి.

కాసేపటికి సుందరశివరావువచ్చి సైకిలు వసారాలో ఉంచి లోపలి వెళ్ళిపోయాడు.

నిర్ణయం

కృష్ణుడి గదిలోనుంచి బయటకి వస్తున్న తల్లినిచూసి 'నాన్న పడుకున్నారామ్మా' అని అడిగాడు.

'ఆ! పడుకున్నట్టున్నారు' అంది విశాలాక్షమ్మ.

'సర్కసు కెళ్ళారా!'

'ఆ వెళ్ళొచ్చారు. ఆ సర్కసు చూసిన తర్వాత ఒకటే పొంగిపోతున్నారు' అంది విశాలాక్షమ్మ.

సుందరశివరావు పెరట్లోకి వెళ్ళి కాళ్ళు కడుక్కునివచ్చి భోజనంచేసి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

జానకిరామయ్యకి నిద్రపట్టటంలేదు. ఆయన మంచంమీద అటు ఇటు దొర్లసాగాడు. ఎదురింటి గడియారం పదకొండు గంటలుకొట్టింది. ఆయన మంచంమీద నుంచి లేచి కూర్చుని కాలిపిక్కలను చేతితో మర్దనా చెయ్యసాగాడు. కాసేపటికి దాహం అనిపించి నీళ్ళకోసం లోపలికి వెళ్ళాడు.

కృష్ణుడి గది గుమ్మందగ్గర గడపమీద తలపెట్టుకుని విశాలాక్షమ్మ నిద్రపోతూంది. గదిలో ఓమూలగా కోడిగుడ్డు దీపం మసగమసగ్గా వెలుగుతోంది. ఆయన చప్పుడు చెయ్యకుండా మెల్లిగా గదిలోకి తొంగి చూశాడు. కృష్ణుడు నిశ్చలంగా నిద్రపోతున్నాడు. 'వెర్రికుంక ఎలాగయి పోయాడో' అనుకున్నాడు.

సుందరశివరావు గది తలుపులు తెరిచి వున్నాయి. వంటింటివైపు వెళ్ళబోతున్న జానకిరామయ్య కొడుకు గదిలో జరుగుతున్న సంభాషణ విని అప్రయత్నంగా ఆగిపోయాడు.

'అన్నట్టు కృష్ణుడిమందు తెచ్చారా' అడుగుతోంది రుక్మిణి.

'లేదు. ఉన్న ఐదురూపాయలు నాన్న సర్కసుకి వెళ్తానంటే ఇచ్చేశాను. సాయంత్రం ఆకలివేస్తే ఎవడిదగ్గరో రూపాయి అప్పుచేసి టిఫిన్ తిన్నాను.'

'మామగారు ఏమిటో విచిత్రంగా మారిపోతున్నారు.'

'పాపం ఆయన చాలా కష్టజీవి రుక్మిణీ. చిన్నప్పటినుంచి ఆయన నైజం నాకు బాగా తెలుసు. నేనేదో పెద్ద ఉద్యోగంచేసి ఆయనని ఉద్ధరిస్తానని అనుకునేవారు. ఆయన ఆశ నేను వమ్ము చేశాను. అందుకే ఇప్పుడు ఆయన ఏది కావాలంటే అది లభించేట్టు చూస్తున్నాను. ఆయన మాత్రం పెద్ద కోరికలు కోరుతున్నారా.'

'కృష్ణుడి మందు సంగతేం చేస్తారు.'

'రేపు ఎలాగో అలా డాక్టరుగారినే అడిగితెస్తాను. ఆయన చాలా మంచివాడు. పైగా వచ్చే నెలనుంచి వాళ్ళబ్బాయికూడా నా ట్యూషన్‌లో చేరబోతున్నాడు.'

'ఎవరికోసం ఇదంతా. మీ నాన్నగారి కోసమేనా. ఆయన కష్టజీవి అన్నారే. మరి మీరుమాత్రం కారేమిటి?'

'నాన్నపడిన 'కష్టం ముందు నా కష్టాలో లెక్ఖకాదు రుక్మిణీ! ఆయనకోసం ఏమైనా చెయ్యటానికి వెనుకాడను. వచ్చేనెల నుంచి ఉదయం రెండుగంటలు ప్రెస్సులో ప్రూఫ్‌రీడరు పనికి ఒప్పుకున్నాను. నెలకి నలభై రూపాయలు ఇస్తారు. ఏపని చేసయినాసరే నాన్నని సుఖంగా వుంచడమే నా ధ్యేయం.'

'ఈ లెక్ఖన రోజూ ఉదయం ఏనిమిది నుంచి, రాత్రి ఎనిమిది గంటలవరకూ పని చేస్తే మీ ఆరోగ్యం సంగతేంకాను. మీరీ పనులు చెయ్యటానికి వీలులేదు. కావాలంటే నేనే ఇద్దరు ముగ్గురు పిల్లలకి ఇంట్లో హిందీపాఠాలు చెప్తాను. సరదాకి పాసయిన విశారద ఇందుకేనా పనికొస్తుంది.'

'పిచ్చి పిల్లా!'

జానకిరామయ్య మరి అక్కడ నిలబడ లేక పోయాడు. వడివడిగా అడుగులువేస్తూ వచ్చి తన మంచంమీద కూలబడ్డాడు. ఆయన చెవుల్లో, కొడుకు కోడళ్ళ సంభాషణ గింగురుమంటూంది. ఆయన కంటి ముందు ఏవో పొరలు కరిగిపోయినట్లనిపించింది. ఆయన తలగడలో ముఖం దాచుకున్నాడు. ఆయన మెదడులో ఎన్నో భావాలు చెలరేగసాగాయి.

'నేను దుర్మార్గుడిని. నా సుఖంకోసం ఇంతమందిని కష్టపెడుతున్నాను. ఇది సుఖమా. ఛీ!!! నేనేదో కష్టపడ్డానని అనుకుంటున్నాను కాని నాకోసం ఎంత మంది కష్టపడుతున్నారు. ఆఖరికి పరాయి పిల్ల కోడలుకూడా నాకోసం ప్రైవేట్లు చెప్పటానికి సిద్ధపడుతూంది. ఈ మధ్య

చరగతి జీవితాలే ఇంతే. నాకోసం నాకొడుకు వాడికోసం వాడికొడుకు ఈ విధంగా అందరూ కష్టపడుతూ పోవల్సిందే కానీ దీనికో మార్గంలేదా. ఈ లెఖ్ఖన నాకొడుకు ఎప్పుడు సుఖపడతాడు. వాడికోసం కృష్ణుడు చదువాపేసి గుమాస్తా అవుతాడు. ఈ చక్రం ఇలా పరిభ్రమిస్తూనే వుంటుంది. లేదు! ఇలా జరుగకూడదు! కనీసం నా కొడుకయినా వృద్ధాప్యంలో ఏ లోటు రాకుండా గడపాలి' అనుకున్నాడు. అప్రయత్నంగా ఆయన కళ్ళవెంబట కారిన కన్నీళ్లతో తలగడ తడిసిపోయింది.

ఆలోచిస్తూనే ఆయన నిద్రపోయాడు.

* * *

మర్నాడు ఉదయం విశాలాక్షమ్మ కాఫీ ఇచ్చే సమయానికి జానకిరామయ్య చిరిగిన గొడుగు గుడ్డకి కుట్లువేస్తున్నాడు. ఆవిడ ఏదో అనబోయి మౌనంగా ఊరుకుంది.

ఎనిమిది గంటలకే భోజనం ముగించాడు జానకిరామయ్య. తనపెట్టె ముందు ఉంచుకుని, తనకి ఉన్న ఒక్కగా నొక్క కాఫీపొడి రంగు చిరుగులకోటు, చత్వారపు కళ్ళజోడు బయటకి తీశాడు. చొక్కాని పంచెలో దోపి, పైన కోటువేసి ఒక్కక్షణం అద్దంముందు నిలబడి సంతృప్తిగా నవ్వుకుని గొడుగు తీసుకుని, వరండాలోవున్న తన పాత చెప్పులు ఓసారి దులిపి తొడుక్కుని బయటకి నడిచాడు.

భర్త చర్యలు అర్థంకాక తెల్లబోయి చూడసాగింది విశాలాక్షమ్మ.

వీధి గుమ్మంలో మెట్లు దిగుతూ ఓసారి వెనక్కి తిరిగాడు జానకిరామయ్య. విశాలాక్షమ్మ ద్వారబంధంవద్ద నిలబడి ఆయనకేసి చూస్తోంది.

'ఓసి పిచ్చిమొహమా! ఎందుకే అలా తెల్లబోయి చూస్తావు. నా బ్రతుకంతా కష్టంలోనే గడచిపోయింది. ఈ బ్రతుకు ఇలాగే వెళ్ళనీ. కనీసం నా కొడుకు జీవితమయినా హాయిగా వెళ్ళిపోవాలి. దానికి కృష్ణుడు పెద్ద చదువులు చదవాలి. పెద్ద ఉద్యోగస్థుడు కావాలి. అప్పటికి మనం ఏలాగూ వుండము. వాడు వాళ్ళ నాన్నని పువ్వుల్లో పెట్టి చూసుకోవాలి. అందుకే నేను మళ్ళీ ఆ కోమటి గుమాస్తా ఉద్యోగంలో చేరుతున్నాను. నాకు నెలనెలా వచ్చే యాభై రూపాయల్లో పాతిక రూపాయలు ప్రతినెలా బ్యాంకులో క్యుములేటివ్ **డిపాజిట్‌లో వేస్తాను. కృష్ణుడు న్యాలు** చదువు పూర్తిచేసేసరికి అది చేతికొస్తుంది. నాకోసం నువ్విదంగా ఆఫీసులో పని చెయ్యక్కర్లేదు, రుక్మిణి హిందీ ప్రైవేట్లు చెప్ప నక్కర్లేదు' అంటూ జానకి రామయ్య గొడుగువిప్పి మెట్లుదిగి చకచకా నడవసాగాడు.

పెరట్లో స్నానంచేసి అప్పుడే ఇంట్లోకి వస్తున్న సుందరరావు, వంటింట్లో నుంచి పెరట్లోకి వెళ్ళబోతున్న రుక్మిణీ ఈ మాటలు వింటూ నాన్న ప్రతిమల్లా నిలబడిపోయారు.

వాకిట్లో నిలబడ్డ విశాలాక్షమ్మ సజల నయనాలతో భర్త వెళ్తున్నవైపే చూస్తూ నిలబడిపోయింది.

ఏమమ్మా దీపశిఖా!

డా॥ సి. నారాయణరెడ్డి

ఏమమ్మా దీపశిఖా!
ప్రేమిస్తున్నారు నిన్ను
పువ్వులా నవ్వేవారు
నవ్వలేక ఏడ్చేవారు
ఆగిపోతున్న గుండెకాయతో
అందంగా నిట్టూర్చేవారు.

ఉంది ఒకటి
చింతనిప్పుల కుంపటి.
ఉంది ఒకటి
చిత్రవర్ణాల చీకటి.
వాటినే గనక ప్రేమిస్తే
వాటి జ్వాలా నిశ్వాసాల
ఆటు పోటులతో
గుండెల సవ్వడులు పెనవేస్తే
నిర్భయంగా జీవిస్తారని
నిఖారస్సైన శిఖరాలమీద నిలుస్తారని
ఎంత మొత్తుకున్నా వినరే
ఏమిటే పిల్లల ఉన్మాదం?
ఏ ప్రమాదం లేని బ్రతుకును కాదని
ఎందుకు కోరుకుంటారో
ఈ పులిజూదం.

ఏ బిస్మిల్లాఖాన్ సన్నాయిరెక్కలమీదో
ఏ బాలమురళీ స్వరతరంగాలమీదో
గాలి పటాల్లాగా
కాగితపు పడవల్లాగా
పరదాగా తేలిపోవచ్చునంటే
స్వర్గ ద్వారాలను పిలుకోవచ్చునంటే
వినేనా వినరే పిల్ల.
రెక్కలు మాడినా సరే
కొవ్వొత్తే కావాలని
పొంతం మునిగినా సరే
సముద్రమే కావాలని




మొండికేసుకున్న వాళ్లకు—
మొత్తం బ్రతుకును ఆహుతిక్కై
ముడుపు కట్టుకున్న వాళ్లకూ—
ఎవ్వరేమి చెప్పినా శుద్ధదండగు.

అనంతవేదనలు కొటువేస్తున్నా
ఆ హృదయ జీవులకు
ఆ ప్రియ భావులకు
ఇదే ఒక అద్భుతమగు దివ్యోలవంతము.

విద్యార్థి

తేజోవతి

సీరియల్



జరిగిన కథ

తల్లికి ఇష్టంలేకపోయినా ఎం. ఎ. లో చేరాడు విద్యార్థి. తన అన్నకూతురు లక్ష్మిని విద్యార్థి వివాహం చేసుకుని జీవితంలో స్థిరపడాలని ఆమె సంకల్పం. కాని, లక్ష్మి ఎవరినో ప్రేమిస్తున్నట్లు తెలుసుకున్న విద్యార్థి, మేనమామతో వాదం పెంచుకుని తిరిగి వచ్చేస్తాడు. జ్ఞానాంబ విద్యార్థిని బాగా ఆకర్షించింది. ఇద్దరూ బాగా చనువుగా వుంటున్నారు. లక్ష్మిని ప్రేమించిన మధుని వెతికి పట్టుకున్నాడు విద్యార్థి. కాని, అలాంటి మోసగాణ్ణి పెళ్ళిచేసుకోనంది లక్ష్మి. మధుకి బుద్ధి చెప్పి పంపించాడు విద్యార్థి. పుష్కరాలకని ఇంటికి వచ్చిన విద్యార్థికి తల్లి ఒక సంబంధం గురించి చెప్పింది.

18

పుష్కరాలు ముగిసినరోజున, ధనమ్మగారి ఆజ్ఞ ప్రకారం బందరు వెళ్ళాడు విద్యార్థి... ఆ రోజు ముసుగ్గా వుంది ... గాలి వాన వస్తుందేమో నన్నట్లుగావుంటే వెంటనే 'కాంప్' క్లోజ్ చేశారు. ధనమ్మగారు తప్పకుండా బందరు రమ్మంది. ముక్కూ మొగం తెలియని వాళ్ళ యింటికి వెళ్ళడానికి విద్యార్థికిబెరుకుగావుంది. తెల్లటి పాంటుమీద తెల్లటి షర్టు టక్‌చేసిన విద్యార్థి చాలా అందాగా హుందాగా కనబడుతున్నాడు. అతడు బందరులో వాళ్ళింటికి వెళ్ళేసరికి, వాళ్ళందరూ అతడికోసమే ఎదురు చూస్తున్నట్లు ఎంతో మర్యాదగా ఆహ్వానించారు. చాలా అధునాతనంగా వున్న యిల్లు చూడ ముచ్చటగా వుంది. తలుపులకున్న కర్టెన్స్, హాలులోవున్న సోఫాసెట్ అధునాతనమైన ఫర్నిచర్...అది దేవేంద్ర భవనంలా అనిపించింది. ఆ యింట్లో అడుగు పెట్టిన వాళ్ళకు ఆ యిల్లు వదిలి రావడమంటే చాలా కష్టమనిపిస్తుంది. విద్యార్థికి ఆ యింట్లో జరుగుతున్న మర్యాదలు చూస్తే అంతా అయోమయం గావుంది దానికితోడు అతడు హాల్లో కూర్చుంటే యిరుగు పొరుగుతోసహా అందరూ వచ్చి తొంగిచూసి పోతున్నారు. ఇంతలో మాయ కాఫీ టిఫినూ తీసుకొచ్చింది. అతి నాజూకైన జిలుగు చీరలో ఆనాటి మాయరూపం కళ్ళు జిగేలుమనిపించేలా వుంది!...

'మా అమ్మాయి మాయ...మీరు చూశారుగా...పి. యు.సి. చదువుతోంది. సంగీతం కూడా చెప్పించాం,' అన్నారు మాయ నాన్నగారు...ఆయనో పెద్ద రిటైర్డ్ ఆఫీసరట.

సుహాసుభాషా!...మీ అమ్మాయికి సంగీతంవస్తే నాకేం సాహిత్యం వస్తే నాకేం? నాకు కావల్సింది మా అమ్మ... ఆవిడను పంపితే రేపయినా కాలేజికి వెళ్ళొచ్చు...అనుకున్నాడు విద్యార్థి మనసులో...ఆ రాత్రికి వుండమని వాళ్ళు చాలా బలవంతం చేశారు. కానీ విద్యార్థి పట్టుబట్టి వాళ్ళను పయాణంచేసి తీసుకొచ్చేశాడు. ఇక ఆరోజు గుంటూరుకు వెళ్ళలేకపొయ్యాడు విద్యార్థి...రాత్రి భోజనాలయ్యాక కొడుకుని పిల్చింది ధనమ్మగారు, 'నీతో మాట్లాడాలి రమ్మ'ని.

'ఏమిటమ్మా?...ఆశకు ఎక్కడైనా సంబంధం చూశావా?' అన్నాడు వచ్చి మంచంమీద కూర్చుంటూ...వెంటనే ధనమ్మగారు, 'అయ్యో రామ!... ఆశకు పెళ్ళిచేసే స్థితిలోవున్నామా మనం?... నీ పెళ్ళికాందే ఆశకు పెళ్ళెలా అవుతుందనుకున్నావ్?' అన్నారు.

గతుక్కుమన్నాడు విద్యార్థి...

'అదేమిటమ్మా!... ఆడపిల్లకు కాందే మొగపిల్లాడికి తొందరేమిటి?... అయినా ఆశకుకూడా మరో రెండేళ్ళపోని చూద్దాం ..అప్పటికి నాకు వుద్యోగమూ దొరుకుతుంది' అన్నాడు.

'ఆc...ఆ అప్పుతీర్చి...ఆశ పెళ్ళిచేసి... యిది అయ్యేదికాదు కానీ...ఆ అమ్మాయిని సౌభాగ్యం కూతురు మాయను చూశావుగా ...పిల్ల బంగారపు బొమ్మలా వుందికదూ... చదువూ—సంగీతం, పనీ—పాటా...ముచ్చటగా వుంది పిల్ల... వాళ్ళందరూ కూడా యిష్టపడ్డారు నిన్ను చూసి...కట్నంకూడా ఎనిమిదివేలదాకా ముట్టచెబుతామన్నారు. దాంతో సొమ్ము తాకట్టునుండి విడిపించవచ్చు...ఆ యింటిమీద అప్పు కూడా కట్టెయ్యవచ్చు...పెళ్ళి ఖర్చుపోనూ మిగతాది బాంకిలో వేస్తే...మిగతాది అప్పుతెచ్చి ఆశ పెళ్ళికూడా చేసెయ్యవచ్చు ... నువ్వు 'ఊc...' అంటే యిక ముహూర్తాలు పెట్టుకోడమే తరువాయి' అని చెప్పింది ధనమ్మగారు.

అప్పటికి అర్థమైంది విద్యార్థికి ఆ అమ్మాయి అంతలా సిగ్గుపడడంలోని ఆంతర్యం; వాళ్ళ మర్యాదలలో పుష్కలం ...భగవాన్...నాకు తెలియకుండా మళ్ళీ ఎలాంటి యిరకాటంలో పడేశావయ్యా?... అనుకున్నాడు మనసులో...స్వైకమాత్రం...

'నా కిప్పుడేం తొందరమ్మా... ఈ చదువు కానీ...' అన్నాడు.

'అయ్యో యింకెన్నాళ్ళురా ... అయిపోవచ్చిందిగా అదికూడా...పోనీ అంతగా చదువుకు నష్టం అంటే యిప్పుడు మనం 'అవున'నుకొని తాంబూలాలు పుచ్చుకుందాం. పరీక్షలు కాగానే లగ్నం పెట్టుకోవచ్చు...వాళ్ళు కాదనలేదుగా,' అంది.

పెద్దచిక్కులో పడ్డాడు విద్యార్థి...తల్లితో ఏ సంగతీ తర్వాత చెబుతానని చెప్పి వచ్చేసి మంచంమీద వాలి పోయాడు.

అతడి కళ్లముందు మాయరూపం సాక్షాత్కరించింది. లక్ష్మి అంత అందంగా లేకపోయినా, కోలముఖంతో, చక్కని చిన్ని కళ్లతో కొనదేరిన ముక్కు, తెల్లగా పిల్ల అందంగా వున్నట్లే లెఖ్ఖ. తడిసిన తలతో. తడిసి ఒంటి కంటుకుపోయిన బట్టల్లో, సిగ్గుల మొగ్గలా వున్న మాయరూపం అతడి కళ్లముందు పదేపదే కన్పిస్తోంది. అందులో కట్నం ఎనిమిదివేలు. అంటే తను యిలా పైసాపైసాకు లెక్కలు చూసుకోవల్సిన అవసరం వుండదు. హాయిగా నిశ్చింతగా వెళ్లిపోతుంది చదువు ...యిగాపేడు పంటలుకూడా అంత బాగా పండేట్లు లేవు. ఇక యీ పంటలో యీ పేడు అప్పుతీర్చడమనేది కల్ల. తను వుద్యోగంలో చేరినా యీ అప్పుతీర్చి, ఆశ పెళ్లి చెయ్యడ మనేది సాధ్యపడే విషయమేనా?.. అసలు తనకు వుద్యోగం యిప్పించేది ఎవరు?... ఈ రోజుల్లో 'రికమండేషన్' లేందే వుద్యోగాలు దొరకటంలేదు మేనమామనా విరోధం చేసుకున్నాడు మాయ నాన్నగారు మంచి పలుకుబడి కలవాడ చెప్పింది అమ్మ. ఆయనైతే తనకు నిమి షాలమీద వుద్యోగం సంపాదించి పెట్ట గలడు. ఆశకు సంబంధం కూడా ఆయనే చూడగలడు. ఇలా వాకిలీ చూస్తుంటే 'ధనబలం. బంధుబలం' కూడా వున్న వాళ్లలానే కన్పడుతున్నారు. భగవంతుడు యీ రూపంలో తన చదువుకు సహాయం చెయ్యదల్చుకున్నట్లుగా అనిపించింది విద్యార్థికి.

కాని అంతలోనే అతడికి జ్ఞానాంబ జ్ఞాపకం వచ్చింది. నిశ్చలంగా వున్న సరస్సులో రాయి విసిరి సంచలనం కలుగ జేసినట్లు ఆ అమ్మాయిలో సంచలనం కలుగజేశాడు. తీరా యిప్పుడు ఆ అమ్మాయి ఖర్మానికి ఆ అమ్మాయిని వదిలేసి తన బాగు తను చూసుకుంటున్నాడు!... అయినా తన మనసింత చంచలమైందా? ...మొదట లక్ష్మిని ప్రేమించానన్నాడు... ఆ తర్వాత సుందరితో ప్రణయ కలాపం సాగించాడు...తర్వాత జ్ఞానాంబకు ఆశ పెట్టి ఆ అమ్మాయిలో వలపుల చివుర్లు తొడిగించాడు...మళ్లీ ఆ యను చూడగానే తన మనసు మళ్లీ జారిపోతుంది!... తన లక్ష్యం తన ఆశయం, తన దృఢ నిశ్చ యాలు యివన్నీ గాలివీస్తే చెల్లాచెదరయి పొయ్యే దూదిపింజల్లాంటివా?... తనని తనే ప్రశ్నించుకున్నాడు.

కానీ— అలా అనుకుంటే చదువు సాగే దెలా?... తన లక్ష్యం సాధించు కునేదెలా? ...అతడి మనసు ప్రశ్నించింది... అయితే లక్ష్యసాధనకు మార్గమేదైనా ఫర్వాలేదా? ...ఆ రోజున మేనమామ దయా ధర్మాల మీద ఆధారపడటం యిష్టం లేదన్న వాడివి...ఈ రోజున మామగారి ప్రాపు కోసం పాకులాడుతున్నావ్...అంతేనా?... నీకూ మీ వాళ్లకూ తేడా ఏమిటి?... మేనమామను తిట్టుకున్నావ్ ... తల్లిని ఏవగించుకున్నావ్ ... నువ్వు చేస్తున్న పనేమిటి? నీకు లేదా ఆ ధనదాహం?... అయితే మీ ముగ్గురిలీ వేర్వేరు ప్రవృత్తు లేల...అంతేనా?... అతడి అంతరాత్మ నిలేసి ప్రశ్నిస్తోంది.

అయితే అమ్మమాటల్లో ధ్వనించిన నిశ్చయం వింటే ఆవిడ మామయ్యని కోడలిగా చేసుకోవాలన్న దృఢ నిశ్చయంతో వున్న ట్లుంది...ఆవిడ మాటను మన్నించడం తన కర్తవ్యంకాదా?... ఆవిడ అభీష్టం ప్రకారమేకదూ నువ్వు ఎం. ఏ. లో చేరావ్? ...కాని యీ విషయం వ్యతి రేకిస్తే పర్యవసానాలు చాలా విషమంగా వుండమ్మ...చివరికి యీ యింటితోనే తెగతెంపులు చేసుకోవలసి వస్తుందేమో... అయితే జ్ఞానాంబ...తనను చూడకుండా



ఒక్కరోజు వుండలేదే ?... ఆ అమ్మాయిని దూరం చేసుకోగలడా?... ఆ అమ్మాయి చేయూత లేకుండా యీ సమస్యల వూబి నుండి బయటపడగలడా ?... ఆ రాత్రి అతడికి ఆలోచనలతో నిద్రపట్టలేదు.

అయితే యీ విషయం యింతదాకా జ్ఞానాంబ దగ్గరే కదపలేదు. ముందు తన అభిప్రాయం కనుక్కున్న తర్వాతే తను ఒకనిర్ణయం తీసుకుంటే బాగుంటుం దనిపించిం దతడికి ... మర్నాడు బయలుదేరుతుంటే, 'ఫిబ్రవరిలో ముహూర్తా లున్నయ్యట.' అని ధనమ్మగా రంటే నవ్వి, 'మే లో పరీక్షలుకూడా వున్నాయి.' అని చెప్పేసి వచ్చాడు విద్యార్థి.

అతడు కాలేజికి వెళ్ళాడన్న మాటేగానీ యిప్పుడెప్పుడు జ్ఞానాంబ దగ్గరకు వెళ్ళి మాట్లాడుదామా ... అని ఆతురత పడుతోంది మనసు ... మూడు గంటలకు క్లాసులు అయిపోగానే, వద్దామంటే కాలేజీ బస్సులో చోటులేదు...మళ్ళీ ట్రిప్ దాకా ఆగకుండా సిటీబస్‌లోనే వచ్చేశాడు విద్యార్థి.

వచ్చీ రావడంతోనే కాఫీకూడా తీసుకోకుండా జ్ఞానాంబ వాళ్ళ యింటికి వెళ్ళాడు. అప్పటికింకా లక్ష్మి స్కూలు నుండి రాలేదు. జ్ఞానాంబ అప్పుడేవచ్చి, కాఫీ పెట్టే ప్రయత్నంలో వుంది.

తను వెళ్ళగానే ప్రశాంతమైన చిరునవ్వుతో ఆహ్వానిస్తూ ఎదురైన జ్ఞానాంబను చూడగానే, లక్షల విలువచేసే యీ చిరునవ్వును తను వదులుకోగలడా ?...అనిపించింది.

'మీతో మాట్లాడాలని వచ్చాను 'అన్నాడు ఒకచేత్తో కాలరు సర్దుకొంటూ.

'ఈ మధ్య చదువుకోడానికంటే మాట్లాడ్డానికేగా ఎక్కువగా వస్తున్నారు!' అంది. నవ్వి కాఫీగ్లాసు అందిస్తూ జ్ఞానాంబ. విద్యార్థి మాట్లాడలేదు. కాఫీగ్లాసులు కడిగి పెట్టేసి వచ్చి కూచుంటూ, 'ఇక మాట్లాడండి' అంది.

ఎదుట చిరునవ్వుతో జ్ఞానాంబ...నన్ను ఏ దివ్యలోకాల్లోకి తీసుకుపోతావు చెప్పు ?... అని అడగాలనిపించిందతడికి... నువ్వే నాకు కావాలి జ్ఞానాంబా అంటోంది అంతరాత్మ ...కానీ పెదవిదాటి ఒక్కమాటా బయటికి రావడంలేదు...ఎలా చెప్పాలి?...ఏమని

చెప్పాలి?...యిత్యాది ప్రశ్నలు చుట్టుముట్టాయి అతడ్ని...కాస్సేపు అలా మౌనంగానే వుండి తర్వాత తల వంచుకునే మెల్లిగా అన్నాడు.

'అదే...అదే...పెళ్ళి...విషయం.'

జ్ఞానాంబ నవ్వింది... 'మంచివారే !... మీ పెళ్ళి విషయంలో నా సలహా అడగడానికి వచ్చారా?' అంది.

'నా ఒక్కడికే సంబంధించిన విషయమైతే మీ సలహాతో అవసరం లేకపోనేమో...' అన్నాడు.

కాస్సేపాగి ... 'కానీ ... యిది మన విషయం...అందుకే...' అన్నాడు. 'మన అన్నమాటమీద సాధ్యమైనంతగా నొక్కి పలుకుతూ.

'అంటే ? !...'

'అంటే...ఒకసారి అన్నారు చూడండి... 'ఐపిటీ దట్ పూర్ మాన్' అని...ఆ 'పూర్ మాన్' నేనే అవుదామని.'

'మీరు 'పూర్ మాన్' ఎందుకవుతా రండీ ?... యిప్పటికే కారు...కాలేరు.' అంది అప్పటికీ హాస్యధోరణిలోనే.

'ఆఫ్‌కోర్స్...మీరు ఒప్పుకుంటే 'పూర్ మాన్'ను యిప్పటికీకాను. నేను చాలా సీరియస్‌గా మాట్లాడుతున్నాను జ్ఞానాంబ గారూ...' అన్నాడు.

'ఆ విషయం మాట్లాడ్డానికి యివ్వాళంత తొందర ఏమొచ్చింది?'

'తొందరే వచ్చింది.'

జ్ఞానాంబ మౌనవ్రతం పూనినట్లు కాసేపు కూర్చుంది ఏమీ జవాబు చెప్పకుండా ... ఏమంటుందోనన్నట్లుగా ఆత్రతతో చూస్తున్నాడు విద్యార్థి.

కాస్సేపాగి తలవంచుకుని మృదువుగా అన్నది.

'నా పరిస్థితులన్నీ తెలుసు మీకు ... ముళ్ళపొదల్లో వున్నాను నేను ... తెలిసీ ఎందుకు నాలో ఆశలు రేపుతారు?...మీలో ఆశలు ఎందుకు పెంచుకుంటారు విద్యార్థి గారూ?' అంది అరిచేతులు చూసుకుంటూ.

'ముళ్ళపొదలోవున్న వారికే తోడు కావల్సింది...ఇద్దరం ముళ్ళపొదల్లోనే వున్నాం కాబట్టి ఒకరికొకరం తోడుంటామేమోనని.'

'కానీ ముళ్ళపొదలోవున్నవారు...ఆపొదలో నుండీ తమని తప్పించేవారిని కోరుకోడం సహజం...కానీ యింకో ముళ్ళపొదలో వున్నవారు చెయ్యగలిగిన సహాయమేముంటుంది?'

'అంటే—పెళ్ళయితే నేను మీకు ఏవిధంగానూ వుపయోగపడననుకొంటున్నారా?...'

'కాదు...నేను మీకేమీ వుపయోగపడలేనేమో నంటున్నాను...ఇంకా స్కూలు ప్రారంభదశలోనే వుంది...అక్కయ్యను అత్తగారింటికి పంపడానికి యింకా కొంత డబ్బు కావాలి...వొదినా పిల్లలూ వాళ్ళకోదారి చూపించాలి...ఇటువంటి పరిస్థితుల్లో...'

'మీ జీతంలో దమ్మిడీ నాకక్కరలేదు... దాన్ని యిప్పట్లాగే మీ వాళ్ళకే పంపించవచ్చు...స్కూలు పూర్తిచేయించే బాధ్యత మీతోబాటూ నేనూ వహిస్తాను ... ఏమం

అజ్ఞాతయోధుడు

నమ్మిన సిద్ధాంతం కోసం
నమ్మి పోయిన
అజ్ఞాతయోధుని గూర్చి
అల్లుతున్నాను కవిత

తుపాకి గురిపెట్టిన వాని ముఖాన
తుపుక్కున ధైర్యంతో ఉమ్మిన
మృత్యుభయం యెరుగని వాడు,
సత్యాన్నే నమ్మిన వాడు

పదవి పేరు చెబితేనే
పెదవి విరిచి తప్పుకునే
నిస్వార్థ జీవి అతడు
నేటి జగతి కతడు తగడు

తల్లిలేదు ఇల్లు లేదు
ఇల్లాలిపై మనసు పోదు
జాతి శత్రువుల దునిమే
సమరమంకె వినుట గాదు

తామ్రపత్రం కోరలేదు
ఛాయాచిత్రం నోచలేదు
అతనికి కావలసింది దేశం;
అతని నరనరాల ఆవేశం

వాని కానరాని సమాధి
స్వాతంత్ర్య సౌధానికి పునాది
అతన్ని గౌరవించిననాడే శుభోదయం
అతన్ని మరువనినాడే మనకు జయం.

—దాశరథి


ముత్యాల వంటి పళ్లతో వజ్రపుతునక
వంటి ఒంటితో, బాలకృష్ణుని లాగా
ముద్దులొలుకుతూ ఉంటాడు నా
బంగారు తండ్రి!
కాల్షియం శాండోజ్ నేను తీసుకుంటున్న దందుకేగా
గర్భస్థ శిశువుకు ఎముకలు, పళ్లు ఏర్పడేది ఆఖరి మూడు నెలలలోనే.
బిడ్డకు కావలసిన కాల్షియమును మాతృదేహమే సమకూర్చాలి.
అందువల్ల, గర్భిణీ స్త్రీలకు ఈ కాలంలో కాల్షియం అధికంగా కావాలి
తల్లి కాల్షియం శాండోజ్ సేవిస్తే, బిడ్డకు దృఢమైన ఆరోగ్యవంతమైన పళ్లు ఎముకలు ఏర్పడతాయి. తల్లికి కాళ్ళ తిమ్మిరు ఉండవు.
కమ్మని రాస్ప్‌బెర్రీ రుచి గలిగి, చప్పరించుటకనువైన బిళ్లల రూపంలో పరిశుద్ధమైన కాల్షియమును లభింప చేస్తుంది కాల్షియం శాండోజ్.
రోజుకు 4-6 బిళ్లలు ఇస్తే చాలు. ఎముకలు, పళ్లు, దృఢంగా పెరగటమేకాక విటమిన్లు సి, డి, B12 ప్రయోజనం కూడా లభిస్తుంది
కాల్షియం ఉత్పత్తులలో యావత్ప్రపంచములో పేరుపొందిన శాండోజ్ వారిచే ఇది తయారు చేయబడింది.
రోజూ కాల్షియం శాండోజ్ సేవించండి. మీ కలలు వాస్తవమౌతాయి!
కాల్షియం-శాండోజ్
SANDOZ
ఆబాలగోపాలమునకు అనుదిన సేవన యోగ్యం!
గర్భస్థ శిశువు యొక్క కాల్షియం అవసరాలు గర్భిణీ సమయంలో, ముఖ్యంగా చివరి 3 నెలలలో హెచ్చుగా పెరుగుతాయి. అందువలన తల్లులు అవసరమైనంత కాల్షియం శాండోజ్‌ను మొదటి నెల నుండి తీసుకోవటం అవసరం.
10.44
1.0
0.045
1, 2, 3, 4, 5, 6, 7, 8, 9

విద్యార్థి

టారు?'

'ఎవరన్నా భార్యనుండి సుఖాలు ఆశిస్తారుగానీ కష్టాలు ఆశిస్తారా?...' మృదువుగా, కోమలస్వరంతో అంది జ్ఞానాంబ.

'భార్య నుండి ఆశించేది కష్టాలూ, సుఖాలు కావండీ... ప్రేమా...అనురాగం... అవి లభిస్తాయని తోచినప్పుడు కష్టాలను పాలుపంచుకోడానికి ఎవ్వరూ వెనుదియ్యరు... మొగిలి రేకుల సువాసన కావాలంటే... ముళ్ళుగీసుకుంటయి...తప్పదు... అయినా యింత తర్కించేబదులు...ఇష్టంలేదని ఒక్కమాట చెబుతే సరిపోతుందిగదా' అన్నాడు ముఖం చిన్నబుచ్చుకుని విద్యార్థి...

జ్ఞానాంబ కిలకిలా నవ్వింది...

'అలగాల్సింది ఆడపిల్లలండీ ... మొగవాళ్ళుకారు' అంది నవ్వుతూనే...

విద్యార్థి తలెత్తి ఆమె కళ్ళల్లోకి చూచాడు అంతర్యం చదవడానికి ప్రయత్నిస్తూ—

ఆ చూపుతో జ్ఞానాంబ సిగ్గుపడి మొగ్గలా అయింది ... కళ్ళు వాలిపోతున్నాయి... సిగ్గు బరువుతో తల వొంగిపోయింది ... చెంపల్లో క్రొత్త కాంతులు తళుక్కుమన్నాయి... జ్ఞానాంబ ప్రేమాంబే అయింది...

విద్యార్థి అప్రయత్నంగా ఏదో అర్థిస్తున్నట్లుగా చెయ్యి జాపాడు...

జ్ఞానాంబ మెల్లిగా తన చేతిని అతడి చేతిలో వుంచింది...

అనుకోకుండా దొరికిన ఈ పెన్నిధి ఎక్కడ చెయ్యిజారిపోతుందోనన్నట్లు ఆత్రంగా, ఆప్యాయంగా ఆ చేతిని తన పెదవుల దగ్గర పెట్టుకోబోతుండగా ఇంతలో అడుగుల సవ్వడి విన్పించింది ...

తక్షణం తన చేతిని లాగేసుకుంది జ్ఞానాంబ... ఒకసారి దీర్ఘనిశ్వాస వదిలాడు విద్యార్థి...

అప్పుడే లోపలి కడుగుపెడుతున్న లక్ష్మి విద్యార్థిని చూసి, 'ఓహో అప్పుడే పుష్కరాలు అయిపోయినయ్యా?...బావగారికి మేం జ్ఞాపకం వచ్చాం' అంది...

మళ్ళీ జ్ఞానాంబవైపు తిరిగి, 'ఈయన్ను ఎవరు చేసుకుంటారోగానీ మా బావగారికి స్కాలర్షిప్, సర్వీసు కనబడితే భార్యా పిల్లల్ని కూడా మర్చిపోతాడు' అన్నది నవ్వుతూ...

'నీకా దిగులు లేదుగా! ... యింక నీకెందుకు బాధ?...' అంటూనే లేచాడు విద్యార్థి...

'అదేం నేను రాగానే వెళ్ళిపోతున్నావ్?... నారాక అంతబాధ కలిగించిందా?'

'మళ్ళీ యింటికెళ్ళి వంట చేసుకోవాలి మరదలా నీతో కబుర్లు చెప్పడానికి...' అన్నాడు...

'ఈపూట యిక్కడే భోజనం చెయ్యొచ్చు వుండండి విద్యార్థిగారూ...' అన్నది జ్ఞానాంబ స్మితవదనంతో, అనురాగ పరిపూరితమైన సరళ స్వరంతో...

'అవును బావా ... అప్పుడు రిజల్ట్సు వచ్చినప్పుడుకూడా సినిమాకు తీసుకెళ్ళలేదు మమ్మల్ని... ఇవ్వాళ తీసుకెళ్ళాల్సిందే తప్పదు.'

'అమ్మా!... ఎందుకూ?... మళ్ళీ తలనొప్పి అంటూ నన్ను వేపచెట్టు ఎక్కించి తమాషా చూడ్డానికా?'

'బావగారూ ... ఈసారి తలనొప్పికాదు గదా... కడుపునొప్పి వచ్చినా... మీ వెంట సినిమాకు వచ్చేది వచ్చేదే... కాబట్టి తమ పర్సుకు యివ్వాళ తాకిడి తప్పదు' అన్నది లక్ష్మి...

విద్యార్థి కాదనలేదు ... అతడి మనసు ఏదో లోకాల్లో తేలిపోతున్నట్లుంది ... అప్పుడేకాదు... ఆ తర్వాతకూడా... మనసు మధురోహల పందిరి అయితే, మేధస్సును బలవంతాన చదువువైపు మళ్ళించడానికి ప్రయత్నిస్తున్నాడిద్దరూ ... అతడికి జీవితం భగవంతుడిచ్చిన అపురూప వరంలా, పూల రధంలో వినువీధిని ప్రియురాలితో కలిసి చేస్తున్న విహారంలా వుంది.

తల్లికి ఈ పెళ్లి యిష్టముండదని తెలుసు, ఆవిడను ఎదురించాల్సి వస్తుందని తెలుసు...కానీ అలభ్యమైన జ్ఞానాంబ సాహచర్యంలో అతడు తల్లిని ఎదిరించడానికి కూడా వెనుదియ్యలేదు ... ఇంకెంత...నాలుగైదు నెలల్లో తన చదువు అయిపోతుంది. ఇన్నింటికి పరిష్కారం కనిపెట్టిన జ్ఞానాంబ తన జీవిత భాగస్వామి సమస్యలపట్ల ఉదాసీనత ఎన్నటికీ చూపించదు. తన సమస్యలన్నిటినీ ఆ పిల్లమీద వదిలేసి తను నిశ్చింతగా, హాయిగా ఆనందడోలికల్లో వూగిపోవచ్చు—అని కలలు కంటున్నాడు విద్యార్థి.





కాల్గేట్ డెంటల్ క్రీమ్‌తో నోటి దుర్వాసనను ఆపండి... రోజంతా దంతక్షయాన్ని నివారించండి!


కాల్గేట్ 10 మందిలో 7 గురికి వెంటనే నోటి దుర్వాసనను నివారించినదని, భోజనము అయిన వెంటనే కాల్గేట్ పద్ధతిలో పళ్లు తోముకొంటే ఎక్కువ దంతక్షయమును, ఎక్కువ మందికి అరికట్టినదని దంతశాస్త్ర చరిత్రలో పూర్వము ఎప్పుడూ ప్రకటింపబడనట్లు శాస్త్ర పరీక్షలు నిరూపించేయి. ఎందుకంటే: కాల్గేట్ డెంటల్ క్రీమ్‌తో ఒకసారి పళ్లు తోముకొంటేనే 85% వరకు నోటి దుర్వాసన మరియు దంతక్షయమును కలిగించే సూక్ష్మ క్రిములు పోతాయి. ఎంత చక్కని పెప్పర్‌మెంట్ రుచి కూడ ఉంది—కాల్గేట్ డెంటల్ క్రీమ్‌తో రోజూ పళ్లు తోముకొనుటకు పిల్లలు యిష్టపడతారు.

పూర్తి దంత రక్షణకు
కాల్గేట్ టూత్ బ్రష్
వాడండి
15 రకములలో - ప్రతివారికి
అనువైనది లభించును.

శుభ్రమైన, తాజా శ్వాసకు మరియు తెల్లగా మెరిసే పళ్లకు...
ఎక్కువ మంది జనులు ప్రపంచములో ఏ యితర టూత్‌పేస్టు కంటే కాల్గేట్‌నే కొంటారు!



[illegible] ఉంది. [illegible]
టీసి చేరినా ఈ సంవత్సరం చదువు సాఫీగా సాగిపోతోంది. అతడి లక్ష్యం మరో కొద్ది నెలల్లో నెరవేరబోతోంది. కోరుకున్న పిల్ల



తన యిల్లాలయి జీవితపు బాటలో ప్రేమ ప్రసూనాలు వెదజల్లబోతోంది. అతడి మనసు వూహల ఉయ్యాలల్లో తేలిపోతోంది సంతోష శిఖరాగ్రాలను చేరుకుంది.


అతడికి తృప్తిగా ఉంది. కొంచెం గర్వం కూడా కలుగక పోలేదు...అవును... అతడనుకొన్నది సాధించ బోతున్నాడు...అందరూ నీవల్ల కాదన్న పనిని తను చేసి చూపిస్తున్నాడు...విధితో కాచిన పందెంలో తను గెలవబోతున్నాడు!...ఆ ఆనందంలోనే రోజాలు వారాలయి ... వారాలు నెలలయి... రెండు నెలలు దాటిపొయ్యాయి...ఈ రెండు నెలల్లో వాళ్ళిద్దరూ మరింత సన్నిహిత మయ్యారు...

డిసెంబరు వచ్చింది. విద్యార్థి 'టెర్మి నల్ ఎగ్జామ్స్' రాశాడు. పరీక్షలు కాగానే వూరికి వెళ్ళాల్సి వచ్చింది. అతడికి జ్ఞానాంబను వదిలి వెళ్ళాలనిపించలేదు. కానీ తనే దగ్గరుండి కుప్పలవీ కొట్టించమని బల వంతం చేసి పంపించింది జ్ఞానాంబ.. ఇంటికి వెళ్ళినప్పటినుంచీ క్షణం తీరిక దొరకలేదు విద్యార్థికి...కుప్పలు కొట్టించి, వాటిని మిల్లుకు తోలి...వాళ్ళు డబ్బులిచ్చే దాకా ఒకటికి పదిమాట్లు వాళ్ళ చుట్టూ తిరిగి ... వీటితో సరిపోయింది. రోడ్డు పక్కనున్న రెండెకరాలలో ముందు వచ్చింది ధాన్యం. లోపలున్న చేల్లో మాత్రం చుట్టూ వున్న పొలాల్లో కుప్పలు కొట్టడమయి దారి పడే దాకా రాలేదు. ధాన్యం పని అయ్యాక, ఇల్లు బాగు చేయించి, సున్నం కొట్టిస్తే బాగుంటుం దన్నది ధనమ్మ గారు...ఇల్లు అద్దెకిచ్చారు కాబట్టి కొన్ని మరామత్తులు చెయ్యక తప్పదనిపించింది విద్యార్థికి కూడా.

మాఘ మాసంలో తాంబూలాలు పుచ్చు కుందా మన్నది ధనమ్మగారు. విద్యార్థి ప్రతిసారీ పరీక్ష లనడంతో సరే అవి నాల్గు నెలల్లో అయిపోతయిగా అనుకుని ఆ విష యమే స్నేహితురాలికి తెలియపర్చింది.

విద్యార్థికి సెలవులయి పొయ్యాయి. అక్కడి యింటి పనులు పూర్తి కానందున వెంటనే రాలేక ఒక వారం పది రోజులు పొయ్యాక వచ్చాడు.

ఆ రోజు యిరవై తొమ్మిదో తారీఖు. గుంటూరులో హర్తాల్ జరుగుతోంది. తెలంగాణాలో జరిగిన గొడవలకు నిరసనగా



ఏటేటా వచ్చే దురద
దానికి నివారణ ఏమిటి?
చెమటకాయలతో దురద, దురదని ఎంతో చికాకు పడతారు. గోకితే చర్మము పొరలు తేరి అసహ్యముగా ఉంటుంది. జాన్సన్స్ ప్రిక్లీ హీట్ సబ్బు మరియు ప్రిక్లీ హీట్ పౌడరు ఎండ వేడితో చెమట కాయలు రాకుండా త్వరగా రక్షణ కలిగిస్తాయి అవి రెండూ చెమటకాయలనుండి రక్షణ నివ్వటను వేడు అల్లిస్తున్న తయారులలో ఎంతో పేరు పొందినవి.
మొదట, ఔషధములు చేర్చిన జాన్సన్స్ ప్రిక్లీ హీట్ సబ్బుతో స్నానము చేయండి. అది వాడిన చర్మ రంధ్రములకు ఉపశమనము కలిగించి, అంటురోగములను పోగొట్టును.
తరువాత, చెమ్మను పీల్చి చర్మమునకు హాయిని కలిగించే జాన్సన్స్ ప్రిక్లీ హీట్ పౌడరును ఒంటిమీద జల్లుకోండి. దానిలో చెమటకాయలనుండి రక్షణనిచ్చే ఒక ప్రత్యేకమైన అంటిసెప్టిక్ పదార్థముంది. దానితో వెంటనే గుణము కనిపిస్తుంది. చెమటకాయల బాధనుండి తప్పించుకొనే పద్ధతి యిదే.
Johnson's PRICKLY HEAT SOAP
Johnson's PRICKLY HEAT POWDER for instant relief
జాన్సన్స్*
ప్రిక్లీ హీట్
పౌడరు మరియు సబ్బు
జాన్సన్ అండ్ జాన్సన్ లిమిటెడ్
*ట్రేడ్ మార్క్
Copyright Johnson & Johnson—INDIA 1972

దీపావళి శుభాకాంక్షలు!



పురాణ దంపతులు పార్వతీ పరమేశ్వరుల వాగ్వివాదాంశం భక్తి గొప్పదా? శక్తి గొప్పదా? అని. ఆ పరీక్షకు అలంబనంగా అవతరించిన పతివ్రతామతిలకం మల్లమ్మ. తెలుగు వారింట ఆడపడుచుగా జన్మించి ఆంధ్రుల ఆరాధ్య దేవతయై మహిమాన్వితమైన ఇలవేల్పుగా భాసిల్లిన ఆమె గాథే మల్లమ్మ కథ. ఆర్. ఎస్. మూవీస్ బేనర్‌పై ఎల్. వి. భుజంగరావు సమర్పిస్తున్న ఈ మహోజ్వల చిత్రానికి దర్శకులు: సంజీవి— నిర్మాత: బి.వెంకటరామయ్య.

విద్యార్థి


అంధలో అల్లర్లు జరుగుతున్నాయి...ఆరోజు దుకాణా లన్నీ మూసేశారు ... రెచ్చిపోయిన జనం విధ్వంసక చర్యలకు దిగడంతో 144వ సెక్షను పెట్టారు.. లాఠీ ఛార్జికి పరిస్థితి అదుపులోకి రానందున బాష్పవాయు ప్రయోగం జరిపారు... ఆరోజు జరిగిన అవాంఛనీయ సంఘటనల మూలంగా పాంటువేసుకుని హైరోడ్డుమీద కన్పించిన యించుమించు ప్రతి వాళ్ళనూ, వయో భేదంతో నిమిత్తంలేకుండా బాదేశారు.

విద్యార్థికిదేమీ తెలియదు... జ్ఞానాంబా వాళ్ళగదికి వెళితే తలుపు తాళంవేసివుంది ...సత్యం గదికి వెళితే సత్యం లేడనీ, వాళ్ళ నాన్నగారికి వొంట్లో బాగుండనందున వెళ్ళిపొయ్యాడని చెప్పారు ... లోకన్‌బాబు కూడా యింకా వూరినుండి రాలేదు...విద్యార్థి అనుకోకుండా హైరోడ్డువైపువెళ్ళాడు ఫ్రెండ్స్ కనబడితే కాలేజి విషయాలు తెలుస్తాయిగదా అని... అక్కడ మిగతావాళ్ళతోబాటు అతడికీ బాగా దెబ్బలు తగిలాయి.

చిరాకెత్తుకొచ్చింది విద్యార్థికి...ఏమిటీ పోలీసుల దౌర్జన్యం?...ఎవరు నేరస్థులో, ఎవరు అల్లరిమూకలో ఎవరు కారోకాడో చూడకుండా చావ బాదడమేనా?...ఒళ్ళంతా నొప్పులుగావుంటే మూల్గుకుంటూ వచ్చి గదిలోపడుకున్నాడు...ఆరోజు హోటళ్ళు కూడాలేవు...కదిలే ఓపికగూడాలేకుండా పడుకున్న విద్యార్థికి పోలీసుశాఖమీద యింతా యింతా అనరాని కోపం వచ్చింది... తిట్టుకుంటూ పడుకున్నాడు.

అయితే కాస్సేపటికి నొప్పులు కాస్త వుపశమించాక తను పోలీసువారిని నిందించడంలో అర్థంలేదేమోననిపించింది... శాంతియుతంగా సాగించాల్సిన సత్యాగ్రహోద్యమాన్ని, అల్లరి మూకలు చేరి హింసాయుతంగా మార్చేసి దౌర్జన్యకాండలకు దిగితే పోలీసులు హింసాకాండ ప్రారంభించక ఏం చేస్తారు ?...కనీసం ఆత్మరక్షణకైనా వాళ్ళు లాఠీఛార్జీలాంటివి చెయ్యక తప్పదు ...అటువంటప్పుడు అసలు వారు తెలివిగా తప్పించుకుంటారు...ఏమీ తెలియని అమాయకులు బలికాక తప్పదు...అనుకున్నాడు.

(ఇంకా ఉంది)



మైసూర్ బ్యూటీ
పుష్పాంజలి
చారిత్రిక
సౌందర్యం
దావణగేరే
బట్టలు
dcm/3/72 tel

సినిమా

ఉషశ్రీలో పద్మశ్రీ!

అవి వ్రాసేసరికి నాగేశ్వరరావో, రామారావో నటిస్తున్నారా అన్న సంశయం పాఠకులకు కలగడం సహజమే. కానీ, నేను చెప్పొచ్చేది హాస్యబ్రహ్మ రేలంగినే.

అస్వస్థత పాల్గానియెడల, రేలంగి యిప్పటికీ టాప్ హాస్య నటుడిగా వుండేవారే.

ఉషశ్రీవారి 'ప్రేమపక్షులు' చిత్రంలో రేలంగి జడ్జి పాత్రను పోషిస్తున్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటరుగా కృష్ణంరాజు, డిఫెన్సు లాయరుగా కృష్ణకుమారి నటిస్తున్నారు. ఈ చిత్రంలోని నాయకుడి పాత్రను కొత్త హీరో ప్రకాష్ ధరిస్తున్నాడు. నాయిక వేషాలు రెండు ఉన్నాయి. ఒకదాన్ని చంద్రకళ, మరొకదాన్ని విజయలలిత నిర్వహిస్తున్నారు. ఈ చిత్రానికి పి. చిన్నపరెడ్డి దర్శకుడు.

అక్టోబరు 14 న పై చిత్రానికి వీనస్ స్టుడియోలో ప్రారంభోత్సవం జరిగింది. దర్శకుడు పి. పుల్లయ్య స్విచ్ ఆన్ చెయ్యగా, పార్లమెంటు సభ్యులు కొట్టగడ్డ శ్రీనివాసరావు క్లాప్ కొట్టారు. తొలి షెడ్యూలు 23 వరకు సాగుతుంది. అనిల్ ప్రభాస్ విడుదల.

విజయలలిత నాయికగా మరొక చిత్రం

రవి చిత్ర అధినేత వై. వి. రావు అక్టోబరు 9 న ప్రసాద్ స్టుడియోలో కొత్త చిత్రాన్ని ప్రారంభించారు. ఈ చిత్రానికి 'ఒకనారి వంద తుపాకులు' అన్న పేరును పెట్టారు. కథానాయిక వేషాన్ని విజయలలిత ధరిస్తోంది.

ఎప్పటివలె యీ చిత్రానికి కూడా ఎన్టీ రామారావు క్లాప్ కొట్టడం, పూర్ణా కామరాజా స్విచ్ ఆన్ చెయ్యడం అత్యం[illegible] కోలాహలంగా జరిగింది. ఈ చిత్రానికి పీటూరీ [illegible], సత్యం సంగీతాన్ని, దేవరాజ్ ఛాయను [illegible]న్నారు. దర్శకత్వాన్ని కె. వి. ఎస్. కుట[illegible]ట్టారు.

దర్శకునికి మరొక [illegible]తం

పైన [illegible] దర్శ[illegible]బరావు సూర్యరాజ్ పిక్చర్స్‌వారి సోషియో క్రయిమ్ చిత్రానికి [illegible]డా సారథ్యం [illegible]స్తున్నారు. రామ[illegible] జ్యోతిలక్ష్మి జంటగా నటిస్తున్న యీ చి[illegible] [illegible] వచ్చింది. [illegible] చి[illegible] కృష్ణకుమా[illegible] ప్రభాకరరెడ్డి [illegible] జంటగా కనిపిస్తారు. హాస్య [illegible]లను వెంకన్న బాబు, విజయ [illegible]రిస్తున్నారు. ని[illegible]: జె. ఎమ్. కృష్ణంరాజు.

అక్కినేనిది పెద్ద మనస్సు

నటసామ్రాట్ నాగే[illegible]రావుగారిది చాలా పెద్ద మనసు. ఇలా చెప్పడానికి కారణంవుంది. ఆయన హీరోగా అంగీకరి[illegible], నిర్మాతలు క్యూలో నిలబడగలరు. కానీ [illegible] ఎక్కువ చిత్రాల్లో నటించాలన్న ధ్యాస ఆ రోజుల్లోనే లేదు. ఇప్పుడెందు కుంటుంది?

మొన్నీ మధ్య నాకు తెలిసిన కొందరు నిర్మాతలు ఆయన్ను తమ చిత్రాల్లో చేసిపెట్టమని అడిగారు. ఇప్పటికే ఎనిమిది మందికి అంగీకరించాను. అవి పూర్తయిన తర్వాత ఆలోచిద్దాం. అన్నారు. మరొకరయితే, వచ్చిందే తడవుగా అడ్వాన్సు తీసుకుని, వెయిటింగు లిస్టులో పడేసి వుండేవారు.

'నిర్మాత లేకపోతే మేమంతా ఎలా రాగలిగే వాళ్లం? నిర్మాత వృక్షాలయితే, మేమంతా కొమ్మలు, ఆకులు, పండ్లులాంటి వాళ్లమే' అన్న భావం గొన్న అక్కినేనిని పెద్ద మనసువున్న వ్యక్తి అనడం ఉచితమేగదా!

ఎనభై శాతం విజయం

గత 30 ఏండ్లలో నాగేశ్వరరావు నటించిన చిత్రాలలో నూటికి ఎనభై శాతం విజయ ఢంకా మ్రోగించియున్నాయి అని సోదాహరణంగా చెప్పగలను. ఇప్పటికీ ఆయనకి డిమాండు, ఆయన చిత్రాలకి డిమాండు వుంది.

నవంబరు 9న మరపురాని తల్లి

విజయా పంపిణీ సంస్థ విడుదల చెయ్యబోయే చక్కటి కుటుంబ చిత్రమే వాణిశ్రీ సమర్పిస్తున్న 'మరపురాని తల్లి' ఈ కథ అన్యోన్యానురాగాలకు బద్ధులైన యిద్దరి స్నేహితురాండ్రకు సంబంధించినది.

రవిరాజ్ ప్రొడక్షన్స్ నిర్మించిన యీ చిత్రానికి వాణిశ్రీ నటన జీవం, ప్రాణం పోసాయి. మరపురాని తల్లిగా, ఆమె మరువలేని నటన్ను ప్రదర్శించింది. నిర్మాత కేశన జయరాంకు మంచి కథ లభ్యం గావడం, కృష్ణ, వాణిశ్రీ, లక్ష్మి, గుమ్మడి, సత్యనారాయణ, రమాప్రభ, అల్లురామలింగయ్యలాంటి మంచి నటులు దొరకడం, ఆయనకి హుషారును పెంచింది.

పై చిత్రానికి గొల్లపూడి మాటలను, లక్ష్మణ గోరే ఛాయను, మహదేవన్ సంగీతాన్ని నిర్వహించారు. ఈ చిత్రంలోని పాటలన్నీ, ఆంధ్రా మార్కెట్టులో బహుళ ప్రచారం పొంది వున్నాయి. పెద్ద సంస్థలలో, అంతకన్నా పెద్దపెద్ద దర్శకులవద్ద పాఠాలు నేర్చిన డి. ఎస్. ప్రకాశరావు 'మరపురాని తల్లి' చిత్రానికి అనూహ్యమైన దర్శకత్వ ప్రతిభను చూపెట్టినట్టు, సినిమా చూసిన వాళ్లు అభిప్రాయపడుతున్నారు.

మా యింటి వెలుగు

శ్రీ మహేశ్వరీ మూవీస్ నిర్మించిన 'మాయింటి వెలుగు' చిత్రం కూడా విడుదల కోసం వురకలు వేస్తూ వుంది. అక్టోబరు రెండవ వారంలో రీ-రికార్డింగు పని ప్రారంభమైంది. ఈ చిత్రానికి



'మరపురాని తల్లి'లో కృష్ణ, వాణిశ్రీ.

పినిసెట్టి రచన్ను, సత్యం సంగీతాన్ని, ప్రకాష్ ఛాయను నిర్వహించారు.

'మావూరి మొనగాళ్ళు' చిత్రాన్ని వాయు వేగంతో నడిపించిన దర్శకుడు విజయ్ 'మాయింటి వెలుగు' కథను రాకెట్టు స్పీడుతో నడిపించారట. నిర్మాత పైడిమర్రి తెలుగుకు కొత్తవారే అయినా, కన్నడ నిర్మాణంలో గట్టి అనుభవం వుంది.

రెండు వేషాల్లో కృష్ణ

'మాయింటి వెలుగు' చిత్రంలో కృష్ణ రెండు వేషాలను ధరించారు. ఒకటి సాఫ్ట్ రోల్, మరొకటి రూడ్ రోల్. దొంగ, దొర లాంటి పాత్రలని చెప్ప వచ్చు. ఆయన అభిమానులకు, చప్పట్లు కొట్టి హర్షం వెలిబుచ్చే సన్నివేశాలు యిందులో చాలా వున్నాయి. నాయిక పాత్రలను చంద్రకళ, వెన్నిర్ ఆడై పోషించారు. బందిపోటు దొంగగా త్యాగరాజు, అతగాడి భార్యగా అంజలీదేవి నటించారు. సత్య నారాయణ పయోముఖ విషకుంభంగా కనిపిస్తాడు. పూర్ణా విడుదల.

సప్తగిరి ప్రొడక్షన్స్


ఏడుకొండల వాడి సన్నిధానంలో రాయదుర్గానికి, చెందిన నలుగురు మిత్రులు కలిసి స్థాపించిన సంస్థ యిది. అక్టోబరు 9న మద్రాసులో ప్రొడక్షన్ ఆఫీసుకు పూజ జరిగింది. అదే రోజున దర్శకులు కమలాకర కామేశ్వరరావుకు, సంగీత సారథి విజయా కృష్ణమూర్తికి, ఛాయాగ్రాహకుడు వి. ఎస్. ఆర్. కృష్ణారావుకు దక్షిణ తాంబూలాన్ని నిర్మాతలు యివ్వడం జరిగింది.

తమ తొలి ప్రయత్నంగా ఒక సముజ్వల

(34వ పేజీ చూడండి)



సప్తగిరి ప్రొడక్షన్స్‌వారి కార్యాలయం ప్రారంభోత్సవంలో కమలాకర కామేశ్వరరావు, నిర్మాతలు జయంతి భీమప్ప్రశేషిం, జయంతి రాధాకృష్ణ, ప్రొడక్షన్ మేనేజరు దుత్తలూరి రామారావు.





సి ని మా

(31వ పేజీ తరువాయి

సాంఘిక చిత్రాన్ని నిర్మించదలచినట్టు నిర్మాతలు నుడివారు. ఇంతకీ నిర్మాతల పేర్లు మీకు తెలియాలిగా. ఒకరు యతిరాజు నరసింహస్వామి. మరొకరు జయంతి భీమప్పశ్రేష్ఠి. మూడవవారు పూజారి వెంకటేశప్ప. నాలగవ వ్యక్తి పేరు జయంతి రాధాక్రిష్ణ. ఈ నల్వురికీ రాయలసీమలో అనేక వ్యాపార సంస్థలు వున్నాయి. వీరి నిర్మాణ వ్యవహారాలను దుత్తలూరి రామారావు చూస్తారు.

'కథ సిద్ధం అయింది. మాటలు వ్రాయడం ప్రారంభం అయింది. డిశంబరు నుండి షూటింగు మొదలెట్టాలని ప్రయత్నం జరుగుతూ వుంది.' అన్నారు నిర్మాతలు.

మట్టిబొమ్మలు

డాల్టన్ పిక్చర్స్‌వారి రెండవ చిత్రం యిది. నిర్మాత పేరు గుళ్లపల్లి నాగేశ్వరరావు. వీరు మీకు యిదివరకే పరిచితులు. 'శ్రీ వేంకటేశ్వర వైభవం' చిత్ర నిర్మాత వీరే.

'ఆ ఏడు కొండలవాడి కరుణా కటాక్ష వీక్షణ, ఆశీర్వచనబలమే నేటి నా రెండవ యత్నానికి పురికొల్పింది' అన్నారు జి. నాగేశ్వరరావు.

'మట్టిబొమ్మలు' చిత్రానికి రాజశ్రీ రచన్ను, సత్యం సంగీతాన్ని, సూరన్న కళను, నరసింహారావు కూర్పును నిర్వహిస్తున్నారు. ఛాయను అఖిల భారత వుత్తమ ఛాయాగ్రహణ బహుమతి గ్రహీత కె. ఎస్. ప్రసాద్ చేపట్టారు.

చలం—వాణిశ్రీ !

నాయకీ, నాయకులుగా వాణిశ్రీ, చలం నటిస్తున్నారు. దర్శకత్వాన్ని 'బుల్లెమ్మ— బుల్లోడు' నాగాంజనేయులుకు అప్పగించారు.

అక్టోబరు 12 వ రాజశ్రీ వ్రాసి, సత్యం రాగం కూర్చి, సుశీల పాడిన పాటను జెమినీ రికార్డింగు థియేటర్లో కోటేశ్వరరావు శబ్ద గ్రహణం చేశారు. అక్టోబరు 20 ప్రసాద్ స్టుడియోలో షూటింగు ప్రారంభం . లక్ష్మి విడుదల.

ఫల్గుణాలో వాణిశ్రీ, చలం

ఫల్గుణా సంస్థను గూర్చి మీకు కొత్తగా చెప్పవలసిన దేముంటుంది? లోగడ మూడు క్రయిమ్ చిత్రాలను నిర్మించిన విషయం మీకు తెలుసు. ఈ సంస్థలో ఏకామ్రేశ్వరరావు, రాఘవ భాగస్తులుగా వుండేవారు. ఇప్పుడు రాఘవ ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్‌కి అధినేత అయ్యారు అన్న విషయం కూడా మీకు తెలుసు.

ఫల్గుణాకంబైన్స్ పేరిట ఏకామ్రేశ్వరరావు ఒక సందేశాత్మక చిత్రాన్ని నిర్మించబోతున్నారు. చలం, వాణిశ్రీ ప్రధాన పాత్రలను పోషిస్తారు దర్శకత్వాన్ని , కె. విశ్వనాధ్ నిర్వహిస్తారు

తాత—మనవడు చాలా అయింది

ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న 'తాత—మనవడు' చిత్రం చాలవరకు పూర్తయింది. మామూలు కథలకి, యీ కథకి చాలా వ్యత్యాసం వుంది. కథలో ఎంతో నవ్యత వుంది. తాతగా ఎస్వీ రంగారావు, మనవడిగా రాజబాబు నటిస్తున్నారు. కథానాయికగా విజయనిర్మలకు వెరైటీవేషం, విలన్ సత్యనారాయణకు నావల్టీ వేషం దొరికాయి. గుమ్మడిది ఒక కొత్త తరహాపాత్ర. ఈ చిత్రం దాసరి నారాయణరావుకు, రమేష్ నాయుడుకు పెద్ద టెస్టు. ఈ టెస్టులో బెస్టు రిజల్టు వస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. నిర్మాత: కె. రాఘవ, విడుదల: తారకరామ.



'మా ఇంటి వెలుగు'లో చంద్రకళ.

ఎస్వీ ఆర్ మేనకోడలుగా చంద్రకళ

రామవిజేత ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న 'రామరాజ్యం' చిత్రంలో ముగ్గురు కథానాయకులు



'ఊరికి ఉపకారి'లో ఆరతి, చలం.

వున్నారు. న్యాయంగా ఎస్వీరంగారావు, నిజంగా జగ్గయ్య, ధర్మంగా గుమ్మడి ఆ నాయకులుగా కనిపిస్తారు.

తన చిత్రంలో ఏదేని కొత్త అంశాన్ని జొప్పించడం యీ సోదరులకు 'జరిగిన కథ' నుండి అలవాటు. ఈసారి శరత్ అనే కొత్తవాడిచేత, శోభన్ బాబుకు అనుకున్న వేషాన్ని వేయించారు. రిస్కు చేసినందుకు, మంచి ఫలితాలే వచ్చాయి అని దర్శకుడు బాబురావు చెప్పారు.

పై చిత్రంలో ఎస్వీఆర్ మేనకోడలుగా చంద్రకళ, జగ్గయ్య, సహధర్మచారిణిగా సావిత్రి, కుమార్తెగా రోజారమణి, అల్లుడిగా చంద్రమోహన్ కనిపిస్తారు.

న్యాయం,ధర్మం, సత్యం తు. చ. తప్పక పాటిస్తే, రామరాజ్యంగాక మరేమవుతుంది? అనెడి సత్యాన్ని చెప్పే సందేశాత్మక చిత్రమే యిది. నిర్మాత కె. ఏ ప్రభాకర్. లక్ష్మి విడుదల.

'విశాలి' సినిమా అవుతుంది

ఇటీవల తెలుగు నవలలకి సినిమావాళ్లు ఎక్కువ ప్రాముఖ్యత నిస్తున్నారు. ప్రముఖ రచయితలు వ్రాసిన 'ప్రేమనగర్, విజేత, జీవనతరంగాలు, దీపశిఖ'ల లిస్టులో తమిరిశ జానకి రచించిన విశాలి కలిసింది.

'విశాలి' నవలకు దేవీ శంకర్ పిక్చర్స్‌వారు తెర రూపం యివ్వదలిచారు. ఆచార్య ఆత్రేయ మాటలు, పాటలు వ్రాస్తున్నారు. ఈ చిత్రానికి పుహళేంది (మహదేవన్ సహాయకుడు) సంగీతాన్ని, సుకదేవ్ ఛాయను, సూరన్న కళను, కె. వి. రావు సహాయ దర్శకత్వాన్ని నిర్వహిస్తారు. రామమోహనరావు

నిర్మించే యీ చిత్రానికి ఎడిటింగును, డైరెక్షన్ను అక్కినేని సంజీవి నిర్వహిస్తారు.

ప్రధాన పాత్రలను శారద, కృష్ణంరాజు, రమాప్రభ పోషిస్తారు. కథానాయకుడెవరో వచ్చే సంచికలో తెలియ జేస్తాను.

'అనిత'గా జమున !

నవలా రచనలో తనకొక ప్రత్యేకత వుంది. అని 'అనిత' చదివిన వాళ్ళు ఒప్పుకుంటారు. సి. ఆనందరామం వ్రాసిన యీ నవలను 'మనసు—మాంగల్యం' నిర్మాత కుటుంబరావు సినిమాగా నిర్మించ దలిచారు. నాయిక జమున, నాయకుడు: కృష్ణ.

యోగి వేమన తీయాలని వుంది

అన్నారు, ఆడజన్మ, అమ్మమాట చిత్రాలను నిర్మించిన జి. వి. ఎస్. రాజు. పైగా, వాహినీవారి 'యోగివేమన' చిత్రం హక్కులు కూడా తన దగ్గరే వున్నాయట మరి, అక్కినేని నాగేశ్వరరావు గారు చేస్తానంటే, భారీఎత్తున ఈస్ట్‌మన్‌కలర్‌లో నిర్మించాలి, అన్నారాయన విజయలక్ష్మి మూవీస్ అధినేత.

శోభన్ చేసే కొత్త చిత్రం

అన్నపూర్ణా సినీ ఎంటర్‌ప్రైసెస్ తలపెట్టిన సాంఘిక చిత్రం షూటింగు అక్టోబరు 23న ప్రారంభం. పి. రాఘవరావు నిర్మించే యీ చిత్రానికి కె. విశ్వనాథ్ దర్శకుడు.

పై చిత్రానికి బొల్లిముంత మాటలను, చక్రవర్తి సంగీతాన్ని, జి. కె. రాము ఛాయను, అంకిరెడ్డి కూర్పును, కుదరవల్లి కళను నిర్వహిస్తారు.

జ్యోతి డిస్ట్రిబ్యూషన్‌లో విడుదలయ్యే యీ చిత్రంలో శోభన్, శారద, జయంతి, సత్యనారాయణ, రాజబాబు, అల్లు రామలింగయ్య, రావు గోపాలరావు ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు.

భరణి పిక్చర్స్ 20వ చిత్రం

కొత్త తరహా భూమికలో కనిపించడమేగాక, దర్శకత్వాన్ని కూడా నిర్వహిస్తున్న భానుమతిగారి కొత్తచిత్రం అంటే భరణి పిక్చర్స్‌వారి 20వ చిత్రం ఎప్పుడు వస్తుందా అని ప్రేక్షకులు, ముఖ్యంగా మహిళలు వేయికండ్లతో ఎదురు చూస్తూ వున్నారు. భరణిచిత్రమంటే వాళ్ళకి కావలసిన అన్ని అంశాలు వుంటాయి అన్న నమ్మకం వుంది.

కథలో, కథాగమనంలో, చిత్రీకరణలో ప్రత్యేకత కనిపించే యీ కుటుంబ గాథాచిత్రం అయిదు రీళ్లు అయిందని, తెలిసింది. ఈ చిత్రానికి మాటలను సముద్రాల, భానుమతీ రామకృష్ణ, సంగీతాన్ని సత్యం, పర్యవేక్షణను భానుమతి, కళను రాజేంద్రకుమార్, ఛాయను లక్ష్మణగోరే నిర్వహిస్తున్నారు.

సినిమా

ప్రధాన పాత్రలను భానుమతి, గుమ్మడి' చంద్రమోహన్, రాజనాల, ప్రమీల, పద్మనాభం' త్యాగరాజు, అల్లు రామలింగయ్య, పొట్టి ప్రసాద్, రమాప్రభ, కవిత పోషిస్తున్నారు.

ఇటీవల దాశరథి వ్రాసిన రెండు పాటలను, భానుమతి మధురాతిమధురంగా పాడారు.

'అంతా మన మంచికే' కన్నా మిన్నగా యీ చిత్రం వుంటుందని ఆశిస్తున్నారు. వారి ఆశలు సఫలీకృతమయ్యేవిధంగా చిత్రం తయారవుతూ వుందని చెప్పగలను.

కళ్యాణికి అమాత్యుని ప్రశంస

కూచిపూడి కళకు కుమారి కళ్యాణి చేస్తున్న సేవ అపారము. అదను దొరికినప్పుడల్లా, కళ్యాణి యీ కళను దేశ వ్యాప్తం చెయ్యడానికి ప్రయత్నిస్తూ వుంది.

అక్టోబరు 5న కూడా కాకినాడ సూర్య కళామందిరంలో కళ్యాణి, శ్రీ కృష్ణ సత్య నృత్యనాటిక ప్రదర్శనం జరిగింది. స్థానిక పైండా ఆండాళమ్మ జూనియర్ కాలేజీ ప్రారంభోత్సవ సందర్భంగా యీ నృత్య ప్రదర్శనం ఏర్పాటు చెయ్యబడింది.

'కళ్యాణి స్వయంగా రూపొందించిన యీ 'శ్రీ కృష్ణసత్య' ఒక విశిష్ట ప్రయత్నం, అద్భుతం' అన్నారు ప్రేక్షక మహాశయులు. 'నాట్యకళకు ముద్దుబిడ్డ' వరాలకూన, అన్నారు రసజ్ఞులు. సత్యభామలోని తీవి, అహం, అందం, విరహం, శృంగారం కళ్యాణిలో మూర్తీభవించాయా అనిపించింది.

నాటి సభకు అమాత్యులు శ్రీ మూర్తిరాజు అధ్యక్షత వహించారు. 'కళాభిమాని కాని వాని హృదయం సంకుచితమై యుంటుంది. మన ఆంధ్రులు పరిసర ప్రాంతాలకు పోయి తమ ప్రతిభా విశేషాలను రాణింప చేసుకోవలసి వస్తుంది, మనం కూడా కళలను అభిమానించడానికి, ఆదరించడానికి ముందుకు రావాలి' అన్నారు మూర్తిరాజు.



'సేమా–నాదేశం'లో జ్యోతిలక్ష్మి

మీకు తెలుసా?

హిందీ నటుడు షమ్మీకపూర్ నటనకు స్వస్తి చెప్పి దర్శకత్వాన్ని చేపట్టాడు.

మైసూర్ ఫిలిం ఛేంబర్ అధ్యక్ష పదవికి ఎమ్. భక్తవత్సలా ఎన్నికయ్యారు.

హిందీ నటి ముంతాజ్ తరచుగా తూర్పు ఆఫ్రికాకు వెళ్ళి వస్తుంది ఎందుకో?

సంజీవ్ కుమార్—తనూజ నటించిన 'అనుభవ్' రజతోత్సవం జరుపుకుంది. ఈ చిత్రానికి కేంద్ర ప్రభుత్వ బహుమతి లభించింది.

'అపరాధ్' చిత్రం మ్యాట్నీ ఆటలు ఆడి, సిల్వర్ జుబ్లీ బొంబాయిలో జరుపుకుంది.

కృష్ణ—వాణిశ్రీల దాంపత్యం

సావిత్రికి తల్లి, తండ్రి లేరు. ఆమెను మేనమామ చేరదీసి, పెంచి పెద్దదాన్నిచేసి, సత్యం అనే అతనికి యిచ్చి పెండ్లి చేస్తాడు. అతగాడు క్లబ్బులో పేకాట ఆడుతుండగా, కొంతమంది మిత్రులు మోసం చేస్తారు. సత్యం పోట్లాటలో దిగుతాడు. అతడి చేయి విరుగుతుంది. కట్టుగట్టిన స్థితిలో యింటికి వస్తాడు. తన భర్తకు సావిత్రి సేవచేస్తూ, అతడి మనస్సుకు హాయినిగొలిపేవిధంగా ఒక పాట పాడుతుంది.

'ఆలూ మగల అన్యోన్యం
అంతులేని ఆనందం
పండిన వలపుల దాంపత్యం
పాలూ తేనెల మాధుర్యం' అన్న — పాటను

వందినీ ఫిలింస్ 'ఇల్లు— ఇల్లాలు' చిత్రంలో వాణిశ్రీ, కృష్ణల దాంపత్య జీవితంపై దర్శకుడు చంద్రశేఖరరెడ్డి చిత్రీకరించారు. కె. సుబ్బిరెడ్డి సమర్పించు యీ చిత్రంలో వాణిశ్రీ దీపాత్రాభినయం చేసింది. సత్యంగా కృష్ణ, సావిత్రిగా వాణిశ్రీ, ఆమె మేనమామగా గుమ్మడి నటించారు.

'భార్యకు స్వర్గం, సుఖం లభించేది భర్త సన్నిధిలోనే— అలాగే భర్తకు మనశ్శాంతి, ప్రేమ, అనురాగం లభ్యమయ్యేది భార్య చెంతనే' అనెడి లోకనీతిని చాటిచెప్పే చక్కటి చిత్రమే 'ఇల్లు—ఇల్లాలు'.

—శ్రీనివాస్

వారఫలం

10-11-1972 శుక్రవారం మొదలు 16-11-1972 గురువారం వరకు

మేషం: వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. విద్యా వైజ్ఞానిక రంగాలో మీ కృషి రాణిస్తుంది. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. ఉద్యోగంలో గౌరవప్రాబల్యాలు బాగుంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

వృషభం: అనవసరమైన శ్రమ కలుగుతుంది వ్యాపారంలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు. వారంమధ్యలో అనుకూల పరిస్థితి యేర్పడుతుంది రావలసిన డబ్బు సమయానికి అందుతుంది అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరతాయి

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలో చికాకులు యేర్పడతాయి. బంధుమిత్రులను కల్సుకొంటారు

మిధునం వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది వారంమధ్యలో ఆందోళన కలుగుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం ఆఖరులో అన్నివ్యవహారాలు తిరిగి బాగుంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు శుభకార్యాల విషయంలో అభివృద్ధిని సాధించగలరు

కర్కాటకం అనవసరమైన సందేహాలు కలుగుతాయి. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది వృత్తిలో ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి వారం ఆఖరులో లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. దైవకార్యాలు నెరవేరతాయి

సింహం మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. పోటీవారితో వాదప్రతివాదాలు తగవు. ఇతరుల నిమిత్తం శ్రమకు గురి కాగలరు. సమయానికి యేదో ఒకవిధంగా డబ్బు చేతికి వస్తుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్య కళారంగాలో మీ కృషి రాణిస్తుంది

కన్య అన్నివ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా ఉంటుంది బంధువులకు సహాయం చేస్తారు. వారంమధ్యలో వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. విద్యావైజ్ఞానికరంగాలో ఖ్యాతి లభిస్తుంది. వారం ఆఖరులో మీరు అనుకొనేది ఒకటి జరిగేది మరొకటి కావచ్చును. ప్రయాణాలోచనలు చేస్తారు

స్త్రీలకు—పుణ్యకార్యాలు చేస్తారు ఆడంబరం కోసం వ్యయం జరుగుతుంది.

తుల వ్యాపారంలో పోటీవారి పోటీ తగ్గుతుంది రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. ఉద్యోగంలో గౌరవప్రాబల్యాలు బాగుంటాయి మీకు మున్ముందు లాభించగల వ్యవహారాల్లో అభివృద్ధిని సాధించగలరు.

స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది సంతోషకరమైన వార్తలను వింటారు

వృశ్చికం మీ ఆలోచనలు ఫలిస్తాయి ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరతాయి. స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. దైవకార్యాలు నెరవేరతాయి.

ధనుస్సు అన్ని వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. సాంఘిక కార్యక్రమాలో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది రావలసిన డబ్బు సమయానికి అందుతుంది విద్యావైజ్ఞానికరంగాలో ఖ్యాతి లభించగలదు వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి మిత్రులకు సహాయం చేస్తారు

స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు

మకరం. కొంతమందివ్యక్తులు మిమ్మల్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తారు ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది వారంమధ్యలో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అధికవ్యయం జరుగుతుంది.

కుంభం వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వారంమధ్యలో చికాకులు యేర్పడతాయి. మీ తాలూకు వస్తువులు పోవచ్చును ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది వారం ఆఖరులో మీ కార్యక్రమాలు బాగుంటాయి

స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. నూతన విషయాలను తెల్సుకొంటారు

మీనం అన్ని వ్యవహారాలోను గౌరవం లభిస్తుంది స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి మిత్రుల సహాయం లభిస్తుంది వారం ఆఖరులో వ్యతిరేక పరిస్థితి యేర్పడుతుంది

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు

—మహేష

దర్శకురాలు - విజయనిర్మల



తెలుగు చిత్రసీమలో తమ ప్రతిభ, పరిశ్రమల వల్ల వెలుగులోకి వచ్చి, నటీనటీ నలుగురిచేత శభాష్ అనిపించు కొన్న నారీమణులలో విజయనిర్మల ఒకతె. కేవలం తెలుగు చిత్రాల్లోనే గాక, తమిళ, మళయాళ చిత్రాలలో నటించి బహుళ ప్రజాదరణ పొందిన నటి. మంచి స్ఫురద్రూపంతో నటనలో వెరైటీ, వాక్కులో క్లారిటీ వున్న హీరోయిన్ శ్రీమతి విజయనిర్మల.

నటన, దర్శకత్వం !

కళకు, విద్యకు హద్దులంటూగాని, ఎల్లలంటూగాని లేవు. అందుచే ఎంత సాధించినా, ఇంకా ముందడుగు వేయాలని పిస్తుంది. అదే నిజమైంది విజయనిర్మల విషయంలో. మేటినటిగా పేరొందిన విజయనిర్మల తన దృష్టిని దర్శకత్వం వైపు మళ్లించింది. అనపై తనకున్న ఆత్మ విశ్వాసంతో పత్రికల, ప్రేక్షకుల ఆశీస్సును ఆశిస్తూ ఒక మళయాళ చిత్రాన్ని డైరెక్టు చేయడాన్కి పూనుకొంది. దర్శకత్వంలో ఆమె అనుభవాలను మీకు అందచేస్తున్నాను.

ప్ర: హీరోయిన్‌గా వుంటున్న మీకు డైరక్టు చేయాలన్న జిజ్ఞాస ఎలా గల్గింది?

జ: కథా బలంవున్న చిత్రాలను రక్తి కట్టించడాన్కి ప్రతిదర్శకుడు శక్తి వంచన లేకుండా, తన మేధాశక్తిని వుపయోగించడం వారి చిత్రాలలో నటించే నేను తలచుగా, తగు జాగరూకతతో పరిశీలిస్తుండే దాన్ని. ఆ ప్రభావమే నన్ను ఒక దర్శకురాలుగ రూపొందించింది.

ప్ర: మళయాళ చిత్రాన్నే చేపట్టడంలో గల మర్మం ఏమిటి?

జ: మర్మంలేదు, మాయాలేదు. నిర్మాత పరిచయమున్న వారు కావడం, కద నాకు నచ్చడమే, నేను ప్రధమంగా మళయాళ చిత్రాన్ని డైరక్టు చేయ పూనుకోవడాన్కి కారణాలు.

ఆ లో చ నా శ క్తి !

ప్ర: దర్శకత్వం వహించడంలో 'అను కరణ' పట్ల మీ అభిప్రాయం?

జ: అది ప్లాజిబుల్‌గాదు. పాజిబుల్ గాదు అందుకే నాకున్న ఆలోచనా శక్తినే వుపయోగించ దలచాను.

ప్ర: చిత్రం పేరును, కథా సారాం శాన్ని తెలియచేస్తారా?

జ: చిత్రంపేరు 'కవిత' తల్లి కారణంగా ఎన్నో వెతలకు గురి అయిన ఒక యువతి కన్నీటి గాథ.

ప్ర: దర్శకత్వంలో మీ తొలి అను భవాన్ని, అభిప్రాయాన్ని చెప్తారా?

జ: ష్యూర్. ఆటీవల 8 రోజులపాటు జరగాల్సిన షెడ్యూలును, టెక్నీషియన్ను, నిర్మాత, తగితరుల సహకారంతో 6 రోజుల్లోనే ముగించాను. దర్శకునికి భిన్నాభిప్రాయాలుంటా యనడాన్కి ఈ క్రింది వుదాహరణ చాలండి. అర్ధరాత్రి: గాడాంధకారం. దానికితోడు ఫెనుతుఫాన్ గదిలో ఒక చిన్న లాంతరు.

ఈ సన్నివేశాన్ని సహజత్వం కోసం, బయటకూడ ఎలాంటి వెలుతురు లేకుండా చిత్రీకరించాము. ఇదే సీన్‌ను కొంతమంది లోపల మాత్రమే లాంతరునుంచి వెలుప అంతా వెలుతురును పెడ్తారు.

తెలుగులో నిర్మాణం

ప్ర: ఈ చిత్రాన్ని తెలుగులో నిర్మించ దలచారా?

జ: వెరైటీ కథలను ఆంధ్రప్రేక్షకుల తప్పక రిసీవ్ చేసుకుంటారనే నమ్మకంలో, తెలుగులో గూడ నిర్మించ దలచాము.

ప్ర: హీరోయిన్‌గా చిత్రాలలో నటిస్తున్న మీకు దర్శకత్వ బాధ్యతను స్వీకరించినందువల్ల ఏమైనా బర్డెన్ సవ్‌గా ఫీలవుతున్నారా?

జ: నో.నో. దేంటికి క్లాష్ రాకూడదన్న వుద్దేశ్యంతోనే మంచికథ, మంచి స్క్రిప్టుగల చిత్రాలలోనే నటించ నిశ్చయించు కొన్నాను.

—శ్రీనివాస్




అన్ని తల నూనెలు మీ కేశములను దువ్వినవి
దువ్వినట్లు ఉంచుతాయి, కాని

స్వస్తిక్ పెర్ఫ్యూమ్డ్ కేస్టర్ హెయిర్ ఆయిల్

ఒత్తుగా, నిగనిగలాడే మరియు ఆరోగ్యమైన కేశములను
మీకు కలిగిస్తుంది, కేశములు దువ్వినవి
దువ్వినట్లు ఉంచుతుందని వేరే చెప్పాలా!

అందువలననే ప్రతి ఏడూ ఎక్కువ కుటుంబములు సువాసనగల
స్వస్తిక్ పెర్ఫ్యూమ్డ్ కేస్టర్ హెయిర్ ఆయిల్ వాడుకను ప్రారంభిస్తున్నాయి!



Shilpi HPMA 27a/72 Tel



జరిగిన కథ

రామ్మూర్తికి ఇద్దరు కొడుకులూ, ఒక కుమార్తె. పెద్దవాడు ప్రసాద్ ఉద్యోగం చేస్తున్నాడు. రెండవ వాడు కొంచెం అల్లరిచిల్లరగా తిరుగుతుంటాడు. కుమార్తె లక్ష్మి పెళ్లికి ఎదిగి వుంది. భార్య శాంతమ్మ రోగిష్టిది. కాంచన ప్రసాద్ ఆఫీసులోనే పని చేస్తున్నది. ప్రసాద్, కాంచనా ప్రేమలో పడ్డారు. అందుచేత తండ్రి తెచ్చిన సంబంధానికి ప్రసాద్ ఇష్టపడలేదు. ప్రసాద్, కాంచనలు మరింత దగ్గరయ్యారు. పెళ్లి చేసుకున్నారు. ప్రసాద్‌కి పిల్లనివ్వాలనుకున్న సత్యనారాయణకిది చాలా బాధ కలిగించి, రామ్మూర్తిని అపార్థం చేసుకున్నాడు. అనారోగ్యంగా వచ్చాడన్న సాకుతో అతన్ని ఉద్యోగంలోనుంచి తీసేశాడు.

6

ఉదయం తొమ్మిదిగంటలు అయింది. రామ్మూర్తి తన కుర్చీలో కూర్చుని భగవద్గీత చదువుకుంటున్నాడు. శాంతా, లక్ష్మీ వంటింట్లో ఉన్నారు. ప్రసాద్, కాంచన ఆఫీసుకు వెళ్ళడానికి తమ గదిలోనుంచి వచ్చారు.

రిక్షాకోసం వీధి గుమ్మంవద్దకు వెళ్ళింది కాంచన.

తమ గది గుమ్మం వద్ద నిలబడి 'అమ్మా' అని శాంతను పిలిచాడు ప్రసాద్.

'ఏం బాబూ?' అని అంటూ వంటయింట్లోనుంచి ప్రసాద్‌వద్దకు వచ్చింది శాంత.

'ఇదిగో డబ్బు' అని ప్రసాద్ రెండు నూరురూపాయలనోట్లను తల్లి చేతికి యిచ్చాడు.

'ఏమిటి యిది?'

'నిన్ననే ఆఫీసులో జీతం యిచ్చారు. ఇది యింటి ఖర్చుకు' అన్నాడు ప్రసాద్ ముభావంగా.

'రెండువందలే యిచ్చావు మిగిలిన డబ్బు యేం చేశావు?' అని ప్రశ్నించింది శాంత.

'నేను చేసే ఖర్చు అంతటికీ మీకు వివరాలు చెప్పాలా?' అని ప్రశ్నించాడు ప్రసాద్ చిరాగ్గా.

'నువ్వుచేసే ఖర్చుకు వివరాలు చెప్పమని నేను అడగడంలేదు. మీ నాన్నగారి పని పోయింది. ఆ విషయం నీకూ తెలుసును. అందుచేత యింకా కొంత డబ్బు యింటి ఖర్చుకు యిస్తావనే ఉద్దేశంతో అడిగాను' అని శాంతకూడా కొంచెం కోపంగానే అన్నది.

'నాన్నగారి పని పోతే, యింకోపని చూసుకుంటే సరి' అన్నాడు ప్రసాద్ యేమీ తొణకకుండా.

తన జీతం గురించి తల్లిదండ్రులు యే ప్రశ్న వేస్తే, యేమీ సమాధానం చెప్పాలో లానూ, కాంచనా యిదివరకే వివరంగా ఆలోచించుకొన్నారు కాబట్టి తల్లికి సమాధానం చెప్పడానికి ప్రసాద్ యేమీ తడుముకోవలసిన అవసరం లేకపోయింది.

మొట్టమొదట రామ్మూర్తికూడా ఏదో చెబుదామనుకున్నాడు. కాని ప్రసాద్ మాట్లాడే ధోరణిని చూసిన తరువాత తాను యేమి చెప్పినా కూడా ప్రయోజనం ఉండదు అని అనిపించడంవలన రామ్మూర్తి యేమీ మాట్లాడలేదు.

'అయితే మీ నాన్నగారికి యింకో జీతం వచ్చే వరకూ అయినా, యింకా కొంత డబ్బు యియ్యి! ఈ రెండు వందలు యిందుకూ సరిపోవు!' అన్నది శాంత.

'ఎందుకు సరిపోవు? ఇద్దరు మనుషుల నిమిత్తం రెండు వందలకంటే యెక్కువ ఖర్చు అవుతుందా? మేం యిద్దరం వింత పెద్ద హోటల్లో భోజనం చేసినా, నెలకు యింతకంటే ఎక్కువ ఖర్చుకాదు' అన్నాడు ప్రసాద్ ప్రశాంతంగా.

ఆ మాటలు వినగానే శాంతకు చాలా కోపం వచ్చింది. 'ప్రసాద్' అని గట్టిగా అంది ఆమె.

'ఏమండీ! రిక్షా వచ్చింది' అని వీధి గుమ్మంలోనుంచి కాంచన కేక వేసింది.

'నాకు ఆఫీసుకు వేళ అయిపోయింది' అని అంటూ ప్రసాద్ యింకేమి మాట్లాడకుండా బయటకు వెళ్ళిపోయాడు.

'ఏమండీ! విన్నారా ప్రసాద్ యేమిటో అన్నాడో' అంటూ శాంత రామ్మూర్తి వద్దకు వచ్చింది.

'అంతా విన్నాను. నాకు తల నొప్పిగా ఉంది. కొంచెం కాఫీ తీసుకొని రా!'



అన్నాడు రామ్మూర్తి.

శాంత యింకేమీ మాట్లాడకుండా కాఫీ తేవడం కోసం వెంటనే వంటింట్లోనికి వెళ్ళింది.

మనస్సుకు బాగా కష్టం కలిగినప్పుడు యెవరితోను మాట్లాడడం రామ్మూర్తికి యిష్టం లేదు. ఆ విషయం శాంతకు తెలుసును. అందుచేతనే రామ్మూర్తి కాఫీ తెమ్మనగానే శాంత యేమీ మాట్లాడకుండా వంటింట్లోనికి వెళ్ళిపోయింది.

ప్రసాద్ శాంతతో అన్న మాటలు వినగానే రామ్మూర్తి అంతవరకు కట్టుకుంటున్న ఆశాసౌధాలు అన్నీ ఒకేసారి కూలిపోయాయి.

తల్లితండ్రుల యెడల నిర్లక్ష్యంగా ప్రసాద్ యెన్నోసార్లు ప్రవర్తించాడు కాని రామ్మూర్తి దీనిని గురించి యెప్పుడూ పట్టించుకోలేదు. తనకు చెప్పకుండానే ప్రసాద్ కాంచనను వివాహం చేసుకొన్నప్పుడు కూడా రామ్మూర్తి అంతగా బాధపడలేదు. అదంతా 'కుర్రతన' మని రామ్మూర్తి తన మనస్సుకు తానే నచ్చచెప్పుకొన్నాడు

'తాను యింతవరకు కట్టిన ఆశాసౌధాలకు అసలు పునాదులే లేవు' అనే విషయం ఆవేళ రామ్మూర్తికి బోధపడింది.

తన రక్తం పంచుకొని పుట్టిన కొడుకు తాను అల్లారుముద్దుగా పెంచిన కొడుకు యీవేళ తల్లితండ్రులతోను కుటుంబంతోను తనకు యేమీ సంబంధంలేదు అని స్పష్టంగా చెప్పివేశాడు

'తన కష్టసుఖాలను పంచుకొంటాడు' అని తను ఆశించిన కొడుకు యీవేళ తమ యింటిని కేవలం ఒక హోటలుగా భావించి మాట్లాడాడు

కేవలం డబ్బు తీసుకొని భోజనంపెట్టే వాళ్ళనుగా తల్లితండ్రులను భావించిన యీ కొడుకును కనడానికేనా, తాము అప్పుడు అంత తహతహలాడింది?

రామ్మూర్తికి ఈ అభిప్రాయం కలగగానే, ప్రసాద్ పుట్టడానికి ముందు జరిగిన సంఘటన ఒకటి అతనికి గుర్తు వచ్చింది.

తనకూ, శాంతకు వివాహం జరిగిన తరువాత మూడు సంవత్సరాల వరకు తమకు సంతానం కలగలేదు. ఆ కొద్ది కాలంలోనే తానూ, శాంతా సంతానంకోసం యెంతగానో తహతహ లాడారు.

అప్పటికి యింకా శాంత తల్లి బ్రతికి ఉంది. ఆమె శాంతచేత సంతానం కోసం యెన్నో నోములు, పూజలు చేయించింది.

ఆమె ఒకసారి తననూ, శాంతను సన్యాసయ్య గుడికి తీసికొని వెళ్ళింది. సంతానం కోరే పురుషులందరూ, ఆ గుడికి కొంచెం దూరంలో ఉన్న చెరువులో స్నానం చేసి వచ్చి ఆ తడి బట్టలతోనే గుడి చుట్టూ దొర్లుతూ మూడుసార్లు ప్రదక్షిణ చెయ్యాలి. అది అక్కడ నియమం.

తాను కూడా నియమం ప్రకారం చెరువులో స్నానం చేసి వచ్చి గుడి చుట్టూ దొర్లుతూ ప్రదక్షిణం చేస్తున్నాడు. శాంత తనతోపాటు నడుస్తున్నది. ఒకసారి ప్రదక్షిణ చేయడం పూర్తి అయింది. రెండవ సారి ప్రదక్షిణ చేస్తుండగా కడుపుకు ఏదో గుచ్చుకొన్నట్లయింది. అక్కడ చేతితో తడమగా, చేతికి రక్తం అంటుకొన్నది. ఏదో గాజుముక్క గుచ్చుకొంది కాబోలు' అని తాను అనుకొన్నాడు.

దానిని శాంతకూడా చూసింది. 'ఆగండి కడుపుమీద రక్తం వస్తున్నది'

అనగనగా...

అని శాంత రెండుమూడుసార్లు అన్నది కాని తాను ఆగలేదు. మధ్యలో ప్రదక్షిణ చేయడం ఆపుచేస్తే నియమం చెడిపోతుందేమో, దానివలన తమకు సంతానం కలుగదేమో అనే భయంతో తాను అలాగ కడుపుమీదనుంచి రక్తం కారుతుండగానే మూడవ ప్రదక్షిణకూడా పూర్తి చేశాడు.

ఆ తరువాత కొద్దికాలానికే తమకు మగపిల్లవాడు జన్మించాడు. దేవుని ప్రసాదంవల్లనే ఆ మగపిల్లవాడు తమకు కలిగాడు అనే విశ్వాసంవలన తాము ఆ పిల్లవానికి 'ప్రసాద్' అని పేరు పెట్టారు.

తాము అన్ని పూజలు, యాత్రలుచేసి, కన్నది ఈ కొడుకునేనా? తాము అప్పుడు అంత తహతహ లాడింది ఈ కొడుకును కనడానికేనా?

* * *

మర్నాడు రామ్మూర్తి చిట్‌ఫండు కంపెనీ ఉద్యోగంలో ప్రవేశించాడు. రామ్మూర్తి ఆ ఉద్యోగంలోచేరి రోజు అంతా వీధుల్లో కుంటుకుంటూ తిరగడం శాంతకు యిష్టంలేదు. కాని యిద్దరు కొడుకుల వైఖరి చూసిన తరువాత ఆమె యేమీ మాట్లాడలేకపోయింది.

రామ్మూర్తికి యేపనైనా శ్రద్ధగా చేయడం అలవాటు కాబట్టి అతనికి చిట్‌ఫండు కంపెనీ ఉద్యోగంలో యే యిబ్బందీ కలుగలేదుకాని కంపెనీ డబ్బు వసూలు చేయడానికి రోజు అంతా తిరుగుతూనే ఉండడంవలన సాయంత్రానికి అతనికి చాలా నీరసం వచ్చేది.

రాత్రిపూట నీరసంగా కుంటుకుంటూ యింటికివచ్చిన భర్తను చూసేసరికి శాంతకు చాలా కష్టంగా ఉండేది. ఆమెకు చేతనయినంతవరకు భర్తకు సేవచేస్తూ ఉండేది. అంతకుమించి ఆమె చేయగలిగింది కూడా యేమీ లేదు.

అన్నయ్య యెలాగ ప్రవర్తించినప్పటికీ, వదినమాత్రం తనతో కబుర్లు చెబుతూ, సరదాగా ఉంటుందని లక్ష్మి ఆశించింది. కాని కాంచన యెవరితోనూ మాట్లాడేది కాదు ఉదయం స్నానం, భోజనం చేసి భర్తతో ఆఫీసుకు వెళ్లడం, సాయంత్రం ఆఫీసునుంచి రాగానే తమ గదిలోనికి వెళ్ళిపోవడం భోజనం సమయానికి భర్తతో పాటు యివతలకువచ్చి భోజనంచేసి తిరిగి తమ గదిలోనికి వెళ్ళిపోవడం కాంచన కార్యక్రమం. ఆమె యింట్లో యేపనీ చేసేదికాదు యెవరితోను మాట్లాడేదికాదు.

ఒకనాడు లక్ష్మి తనే చొరవతీసికొని కాంచనతో మాట్లాడింది. కాంచన ఆఫీసునుంచి వచ్చేసరికి లక్ష్మి ఒక మల్లెపువ్వుల దండ గుచ్చి ఉంచింది!

'వదినా! యిదిగో యీ మల్లెపువ్వుల దండ నీకే' అంటూ లక్ష్మి కాంచనకు ఆ దండ యివ్వబోయింది.

'నాకు నువ్వు యేమీ యివ్వనక్కరలేదు. నీ పని నువ్వు చూసుకో!' అని కాంచన కరకుగా సమాధానం యిచ్చింది.

లక్ష్మి ఆ తరువాత యెప్పుడూ కాంచనతో మాట్లాడడానికి ప్రయత్నించలేదు.

ఒకనాటి రాత్రి రామ్మూర్తి యింటికి వచ్చేసరికి శాంత చాలా దిగులుగా ఉన్నట్టు కన్పించింది.

రామ్మూర్తి భోజనంచేస్తూ 'అలాగ వున్నావు. ఏమిటి కారణం?' అని శాంతను ప్రశ్నించాడు.

'ఎలాగా లేను. బాగానే ఉన్నాను' అని శాంత ముక్తసరిగా సమాధానం యిచ్చింది.

'కోడలూ, ప్రసాద్ యేమైనా అన్నారా?'

'ఇప్పుడు కొత్తగా అనేది యేముంది? అనేదేదో యిదివరకే అన్నారు.'

'ఏమిటి?' అని తిరిగి ప్రశ్నించాడు రామ్మూర్తి. శాంత దేనినిగురించి అంటున్నదో అతనికి బోధపడలేదు.

'ఇంటిని హోటలు అని అన్నారుకదా! అలాగే ఆఫీసునుంచి యిద్దరూ వచ్చారు. భోజనంచేసి వాళ్ళ గదిలోనికి వెళ్ళిపోయారు. ఇంక అనడానికి యేముంది?'

దానికి రామ్మూర్తి యేమీ మాట్లాడలేదు. కాని శాంతయిచ్చిన సమాధానం అతనికి సంతృప్తిని కలిగించలేదు.

భోజనం అయిన తరువాత రామ్మూర్తికి ఒక మిఠాయి ముక్కను యిచ్చింది శాంత.

'ఎక్కడిది యిది?'

'మన ఊళ్లో యింటి పక్కను ఉన్న సావిత్రి వాళ్లు తిరుపతి వెళ్లి వస్తూ మన యింటికి వచ్చారు. వాళ్లు యిచ్చిన ప్రసాదమే యిది.'

మార్గో సబ్బు ఒక్కటే ఒక్క శుభ్రపరచడానికే గాక
ఎంతో వుపకరిస్తుంది. చలికాలంలో గాని ఎండాకాలంలో గాని
చర్మాన్ని రక్షిస్తుంది

ఎందుకంటే
మార్గోలోనే
వేపనూనె వుంటుంది





మార్గో సబ్బు మెరుగు వెన్నలా వుంటుంది. సహజమైన వేపనూనె సమృద్ధిగా వుంటుంది. లావణ్యంతో చర్మాన్ని పోషించడానికి కావలసిన ఉత్తమ పదార్థము. వేపయొక్క క్రిమినాశక గుణములు అంటురోగములను రానీయవు. మార్గో చర్మాన్ని మృదువు పరచి మచ్చలను పోగొడుతుంది. అంతేగాక మార్గోలోనున్న దుర్గంధాన్ని పోగొట్టి వేపనూనె గంటలకొద్దీ తాజాగా సవ సవ లాడింపజేస్తుంది. హానికరంగాని వెన్నవంటి మార్గో సబ్బు మీ కుటుంబ మంతటికీ ఎంతో వుత్తమమైనది!

మార్గో సబ్బు

మీ చర్మాన్ని
మృదువుగాను,
సున్నితముగాను వుంచును

కలకత్తా కెమికల్స్‌వారి తయారీ



అనగనగా...

రామ్మూర్తి ప్రసాదం కళ్ళకు అద్దు కొని నోట్లో వేసికొన్నాడు.

'మన ఊరి సంగతులు యేమయినా చెప్పారా?'

'ఊరి సంగతులు అన్నీ మామూలే. వాళ్ళు చాలాసేపు లక్ష్మి పెళ్ళి గురించే మాట్లాడారు.'

'ఏమిటి అన్నారు?'

'లక్ష్మికి సంబంధాలు చూస్తున్నారా? ఎప్పుడు పెళ్ళి చేస్తారు? మీ అబ్బాయి యేదో ఆఫీసులో మేనేజరు ఉద్యోగం చేస్తున్నాడట గదా! మీ అమ్మాయికి పెద్ద సంబంధమే వస్తుంది' ఇలాగే యెన్నో అన్నారు.'

'నువ్వు సమాధానం యేమిటి చెప్పావు?'

'సమాధానం యేమిటి చెబుతాను? అన్నిటికీ ఊకొట్టి ఊరుకొన్నాను. ఏది చెప్పుకొన్నా, మనకే అవమానం కదా!'

'అవును'

తరువాత శాంత ఏమీ మాట్లాడలేదు.

కొంచెంసేపు అయిన తరువాత రామ్మూర్తి 'త్వరలో లక్ష్మి పెళ్ళి చెయ్యాలి అది మన బాధ్యత' అన్నాడు

'అవునండీ! ఈ మాట మీతో చెపుదామని నేను చాలా రోజులనుంచి అనుకొంటు న్నాను. కాని యింటి పరిస్థితి చూస్తూ మీతో ఈ మాట చెప్పలేకపోయాను.'

దానికి రామ్మూర్తి యేమీ సమాధానం చెప్పలేదు.

'ఉన్న పొలం ఇప్పటికే అప్పుల్లో మునిగి పోయింది. అది ఉన్నా లేనట్టే లెక్క. పెళ్ళి చెయ్యాలంటే, కొద్దో గొప్పో కట్నం యివ్వాలి. తరువాత మిగిలిన ఖర్చులు ఉన్నాయి. ఇంత డబ్బు యిప్పుడు యెలాగ వస్తుంది?' అన్నది శాంత నిరాశతో.

'ఈ యిల్లు ఉందికదా! ఇక దీన్ని తనఖా పెట్టాలి'

'ఇల్లు, తనఖా పెడతారా?' అన్నది శాంత ఆశ్చర్యంగా.

'అవును. అంతకంటే వేరేదారి లేదు.'

'ఊ' అన్నది శాంత ముభావంగా.

'నాలుగురోజుల్లో అమావాస్య వెళ్ళి పోతుంది. తరువాత సంబంధాలు చూడడం ప్రారంభించాలి.'

* * *

రామ్మూర్తి పెళ్ళి సంబంధాలు వెదకడం ప్రారంభించాడు. అతను యెవరితో సంబంధం ప్రసక్తి తెచ్చినా, వారు 'కట్నం పదివేలు యిస్తారా? యిరవై వేలు యిస్తారా?' అని ప్రశ్నించేవారు.

'అంతకట్నం యివ్వలే'నని రామ్మూర్తి చెప్పగానే, వారు పెదవి విరచేవారు.

ఇలాగ అతను రెండుమాసాలపాటు పెళ్ళికొడుకులకోసం వెతకగా, వాళ్ళ ఊరువాడే అయిన శివరావు బావమరది కొడుకుకు సంబంధాలు చూస్తున్నారనీ వాళ్ళు కట్నం పుచ్చుకోరనీ అతనికి తెలిసింది.

శివరావుకూడా ప్రస్తుతం ఆ ఊళ్ళోనే యేదో గవర్నమెంటు ఆఫీసులో గుమాస్తా పని చేస్తున్నాడు. ఒక శెలవురోజున రామ్మూర్తి తీరుబడి చేసుకొని శివరావు యింటికి వెళ్ళాడు.

శివరావు రామ్మూర్తిని చాలా మర్యాద చేశాడు.

కొంతసేపు వాళ్ళఊరు కబుర్లు చెప్పుకొన్న తరువాత రామ్మూర్తి 'మీ బావమరది కొడుకుకు సంబంధాలు చూస్తున్నారట కదా!' అన్నాడు.

అనగనగా..

'ఆకస్మికంగా మీరు నా దగ్గరకు యెందుకు వచ్చారా? అని నేను యింతసేపూ ఆలోచిస్తున్నాను. మీ అమ్మాయి యీసరికి పెళ్ళీడుకు వచ్చి ఉండాలి కదా!' అన్నాడు శివరావు.

'అవును. అందుకే వచ్చాను.'

'అయితే మా బావమరది కొడుకుసంగతి చెబుతాను వినండి' అని అంటూ శివరావు సావకాశంగా చెప్పడం ప్రారంభించాడు.

'మా బావమరది వెంకట్రావు ఏలూరులో ఉన్నాడు. అతనుకూడా మీలాగే బట్టలకొట్లో గుమాస్తా పనిచేస్తున్నాడు. అతనికి ఒక్కడేకొడుకు. అబ్బాయికి యీ సంవత్సరం పెళ్ళిచెయ్యాలని వాళ్లు అనుకొంటున్నారు.

వాళ్ళకు ఆస్తియేమీలేదు కాని అతను కష్టపడి ఆ అబ్బాయిని యం.బీ.బీ.యస్. చదివిస్తున్నాడు. ఆ అబ్బాయి యింకా ఒక యేడాదిపాటు చదవవలసి ఉంది. అబ్బాయి బుద్ధిమంతుడు బాగానే ఉంటాడు.

మా బావమరది పూర్వకాలపు మనిషి. అతను తన కొడుకుకు పెళ్ళిచేయడానికి మూడు షరతులు పెట్టాడు.

ఒకటి—అమ్మాయి మంచి సాంప్రదాయం, గౌరవంకల కుటుంబానికి చెంది ఉండాలి.


రెండు—అమ్మాయి వాళ్ళ అబ్బాయికి నచ్చాలి.


మూడు—వాళ్ళ అబ్బాయికి కట్నం యేమీ యివ్వనక్కరలేదు. అయితే వాళ్ళ అబ్బాయి యింకా ఒక సంవత్సరంపాటు చదవవలసి ఉంది. దానికి రమారమి మూడు వేల రూపాయలు ఖర్చు అవుతుంది. ఆ డబ్బు అతనివద్ద లేదు. అందుచేత ఆమూడు వేల రూపాయల్నూ, పెళ్ళికూతురు తండ్రి అప్పుగా యివ్వాలి. ఆ అబ్బాయి ఉద్యోగం చేస్తున్నప్పుడు కాని, ప్రాక్టీసుపెట్టిన తరువాత కాని ఆ అప్పు తీర్చివేస్తాడు.

ఇవి మా బావమరిది షరతులు. ఇందులో మొదటి షరతుగురించి మీకు ప్రత్యేకంగా చెప్పవలసినది యేమీలేదు. మూడవషరతుకు మీకు అంగీకరిస్తే, ఇక రెండవ షరతు మిగిలి ఉంటుంది. వాళ్ళ అబ్బాయితోసహా వచ్చి మీ అమ్మాయిని చూసుకొమ్మని నేను ఉత్తరం రాస్తాను. మీరు ఆలోచించుకొని యేసంగతీ నాతో చెప్పండి' అని శివరావు గవర్నమెంటు రిపోర్టులాగ వాళ్ళ బావమరదిని కొడుకుగురించి వివరించాడు.

శివరావు చెప్పినదంతా రామ్మూర్తి శ్రద్ధగా విన్నాడు. ఈ సంబంధం చాలా బాగున్నట్లు అతనికి కన్పించింది.

'శివరావుగారూ! మీ బావమరదిగారిని గురించి నాకు యేమీ తెలియదు కాని ఆయన మీ బావమరదే కాబట్టి ఆయన మంచిచెడ్డలను గురించి నేను తెలుసుకోనక్కరలేదు. ఇక డబ్బు విషయం అంటారా? ఆయన మంచివాడు కాబట్టి డబ్బు విషయం ముందుగానే స్పష్టంచేశారు. అలాగకాకుండా పెళ్ళి అయిపోయేవరకు ఊరుకొని, ఆ తరువాత నాదగ్గర డబ్బు లేదు. మీ అల్లుడిని మీరే చదివించుకొండి అని అంటె మాత్రం మాకు తప్పుతుందా? అప్పుడైనా యెక్కడైనా తలతాకట్టు పెట్టి, అబ్బాయిని చదివించాలి కదా! అందుచేత యేదో ఒక విధంగా తంటాలుపడి—ఆ అబ్బాయి చదువుకు కావలసిన మూడువేల రూపాయలు నేనే





సౌందర్యాన్ని పెంపొందించటం కోసం. సింథెల్
వ్యానిషింగ్ క్రీమ్. ఉదయాన ముఖంపైన
తళుక్కున మెరిసే మంచు బిందువులాంటి అనుభవం.
ప్రతి రోజూ అలవాటుగా దీనిని వాడండి. దీనిలో
మీ లావణ్యాన్ని ఇనుమడించే గుణం ఉంది.
మీ 'మేకప్'ను చక్కగా రూపొందించి, మీ
వర్ణాన్ని ఎంతో తాజాగా ఉంచుతుంది.
రోజంతా, ప్రతి రోజూ.



ఇది గోద్రెజ్ వారి వస్తువు

ULKA GSVS-6 TEL

ధర్మతత్వం — ధర్మపథం



— భూసురపల్లి వేంకటరమణయ్య

'ధర్మం' అనే పదాన్ని అందరూ స్వేచ్ఛగా వాడతారు. కాని అర్థం చెప్పేటప్పుడు మాత్రం 'ఏమి చెప్పడమా?' అని కొంత ఆలోచింపవలసి వస్తుంది.

దీన్ని కొందరు 'మతం' అంటారు; కొందరు 'ఆచారం' అంటారు. కొందరు 'శీల'మని అంటారు. కొందరు 'నీతి నియమ' మంటారు.

'ధారణాద్ధర్మ ఇత్యాహుః
ధర్మో ధారయతి ప్రజాః.'

అనే దాన్నిబట్టి చూస్తే — ధర్మమనేది ప్రజలను పశువులనుండి రక్షించేదిగా — విశిష్టులను చేసేదిగా చెప్పబడుతున్నదని గ్రహించాలి. ఇది సార్వజనీనమూ, సార్వకాలికమున్నూ.

ధర్మం అనేకవిధాలు. అందులో పది విధాలు ప్రసిద్ధమైనవి!

'ధృతిః క్షమా శమో౽స్తేయం
శౌచ మింద్రియ నిగ్రహః,
ధీర్విద్యా సత్య మక్రోధో
దశకం ధర్మలక్షణమ్.'

(ఉత్తమ కార్యవిషయమై) స్థిరమైన మనస్సు కలిగి ఉండడమూ, సహనమూ, శాంత స్వభావాన్ని అలవరుచుకోవడమూ, మనోనిగ్రహమూ, ఇతరుల సొత్తు అపహరించకుండా ఉండడమూ, పరిశుద్ధంగా ఉండడమూ, ఇంద్రియనిగ్రహమూ, ఉత్తమమైన విద్యా, సత్యమునే పలకడమూ, ఎట్టి సందర్భంలోనూ కోపం తెచ్చుకోకుండా ఉండడమూ—ఈ పదిన్నీ ధర్మాలు.

ఈ ధర్మాలకు జాతి, మతాలతో నిమిత్తం లేదు. అన్ని మతాలవారూ అన్ని జాతులవారూ అన్ని ప్రాంతాలవారూ ఆచరింపదగినవి! వీటికి ఎప్పటికీ కాలదోషం పట్టదు. అన్ని కాలాల్లోనూ అనుసరించదగినవే!

ప్రపంచంలోని యిప్పటి పరిస్థితులను బట్టి ఎన్నో దేశాల్లో ఎన్నెన్నో రాజకీయ పక్షాలు ఏర్పడ్డాయి. ప్రతిపక్షమూ దేశాభ్యున్నతికోసం పాటుపడడానికే కంకణం కట్టుకున్నట్లు చెప్తూ ఉంటుంది. ఇతర పార్టీలను దుయ్యబట్టుకొని అత్యాచారాలకు కూడా సిద్ధపడుతుంది.

ఈ ధర్మాలను అనుసరించి దేశాభ్యున్నతికి పాటుపడితే పరస్పర విరోధానికే తావు ఉండదు. దేశాభ్యున్నతి స్తంభించకుండా కొనసాగుతుంది. ప్రజల ఆందోళన పటాపంచలవుతుంది.

అనగనగా...

సర్దుతాను. ముందు అమ్మాయిని చూసుకోమ్మని వారికి తెలపండి. మీకు అన్నిసంగతులూ తెలుసు. ఎలాగాచేస్తే బాగా ఉంటుందని మీరు అనుకొంటే అలాగ చెయ్యండి మీ మేలు యీ జన్మలో మరచిపోలేను' అన్నాడు రామ్మూర్తి.

'దానికి యేముంది లెండి, మీసంబంధం గురించి వాళ్ళకు యీవేళే ఉత్తరం రాస్తాను.'

'ఇది మీ స్వంత పనిలా భావించండి నేను సెలవు తీసుకొంటాను?' అన్నాడు రామ్మూర్తి లేచి నిలబడి.

'నేను ఉంటాను' అన్నాడు శివరావు తానుకూడా లేచి నిలబడి.

'మీ ఉత్తరానికి సమాధానం యెప్పుడు వస్తుందంటారు? అని ప్రశ్నించాడు రామ్మూర్తి.

'రెండు మూడురోజుల్లో వస్తుంది. వాళ్ళదగ్గరనుంచి సమాధానం రాగానే, నేనే మీకు తెలియజేస్తాను' అన్నాడు శివరావు.

శివరావు చెప్పినట్లుగానే మూడవరోజున అతనికి వెంకట్రావు వద్దనుంచి ఉత్తరం వచ్చింది. ఆవేళకు మూడవరోజు గురువారం నాడు ఉదయం యేడుగంటలకు తాము శివరావు యింటికి వస్తామనీ, తరువాత పదిన్నర, పదకొండుగంటలకు రామ్మూర్తి గారి యింటికివెళ్ళి వారి అమ్మాయిని చూస్తామనీ వెంకట్రావు శివరావుకు ఉత్తరం రాశాడు.

ఆ సాయంత్రమే శివరావు ఈ విషయాన్ని రామ్మూర్తికి తెలియజేశాడు.

మర్నాడు బుధవారం ఉదయం మామూలుగా ప్రసాద్, కాంచనా ఆఫీసుకు వెళ్ళడానికి బయలుదేరుతున్నారు.

ఆ సమయంలో శాంత 'రేపు ఉదయం పదిన్నరకు లక్ష్మిని చూడడానికి పెళ్ళివారు వస్తారు. అందుచేత మీరు యిద్దరూ రేపు ఉదయం ఆఫీసుకు సెలవుపెట్టి యింటి వద్ద ఉండండి' అంది.

తల్లి చెప్పినమాటకు సమాధానం యేం చెప్పాలో ప్రసాదుకు తోచలేదు. అందుచేత అతను 'యేం చేద్దాం?' అన్నట్లుగా కాంచనవైపు చూశాడు.

'రేపు ఉదయం ఆఫీసులో అర్జంటుపని ఉన్నది. సెలవు పెట్టడానికి కుదరదు' అన్నది కాంచన ఖచ్చితంగా.

'అవును అమ్మా! రేపు సెలవుపెట్టడానికివీలులేదు' అన్నాడుప్రసాద్ నెమ్మదిగా.

'ఇంట్లో పెళ్ళిచూపులు జరుగుతున్నప్పుడు కూడా పెద్దకొడుకు, కోడలు యింటివద్దలేరు అంటే బాగా ఉండదు. తరువాత మీ యిష్టం' అన్నది శాంత.

దానికి యేమీ సమాధానం యివ్వకుండానే కాంచన వీధిలోనికి వెళ్ళిపోయింది. కాంచనతోపాటు ప్రసాద్ కూడా వెళ్ళిపోయాడు.

ఈ సంఘటన శాంతకు యేమీ ఆశ్చర్యాన్ని కలిగించలేదు.


ఆ రాత్రి రాజా భోజనంచేసి మామూలుగా తన లాడ్జికి వెళ్ళడానికి బయలుదేరుతున్నాడు.

'రేపు ఉదయం లక్ష్మిని చూడడానికి పెళ్ళివారు వస్తున్నారు. ఇంట్లో పనులు ఉంటాయి. అందుచేత రేపు ఉదయం నువ్వు కొంచెం తొందరగా యింటికి రా!' అన్నది శాంత.

'అలాగే' అంటూ రాజా వెళ్ళిపోయాడు.

(ఇంకా ఉంది)

వెంకటరాఘవన్ కి ప్రియమైన కాఫీ:



"ఉత్తేజ భరితమయిన టెస్టు ఆఖరున ఒక కప్పు వేడి వేడి నెస్‌కాఫే విలువ తెలుస్తుంది. అలసట తీరాలంటే దానితోనే."



అతనికి తెలుసు కాఫీకి అలవాటీనవారికి తెలిసినట్టు. ఇతర ఇన్‌స్టంట్ కాఫీలన్నిటికన్న నెస్‌కాఫే విశిష్టమని. దాని ప్రత్యేకం తనవంటి కాఫీ కాముకులకోసం తయారు చేశారని అత్యుత్తమమయి 100% పరిశుద్ధమయిన దక్షిణాది కాఫీ గింజలతో.



నెస్‌కాఫే

నెస్‌కాఫె యిక్కని ప్రియమైనవారికీ అత్యంత ప్రియమైనది

ACIL-90(1) 233 TEL

దీపావళి కథల పోటీలో రు.500 బహుమతి పొందిన కథ

బంధాలు

జి. రమాకుమారి



‘తప్పుకాదూ?’ అన్నాడు ముసలాయన.

ఒక్కసారి తలవంచుకున్నాను. తప్పు చేశానా?

నేను చదువుకునే రోజుల్లో ఒకసారి తెలుగు మాష్టారన్నాడు. ‘వీడిలా ఉన్నాడు కానీ కాలాంతకుడు. పదిమంది గొంతుకలు కోసేసి ఏమీ తెలియదన్నట్లు, అసలిలాంటి పనులెలా చేస్తారన్నట్లు చూడగలడు. వీణ్ణి నమ్మకూడదు.’ కళ్లు పెద్దవిచేస్తూ వేలితో నా గుండెమీద పొడుస్తూ అన్నాడాయన. మా చుట్టూ నలుగురైదుగురు మాష్టార్లున్నారు. నా స్నేహితులు కూడా ఉన్నారు. వాళ్లందరిముందూ ఆయన నన్నలా అవమానించడం నాకు బాగోలేదు. ముక్కుపుటా లెగరేశాను. ‘నవ్వొంటిగా చూపి తన్నేట్లున్నాడు వీడు.’ అన్నాడా తెలుగు మాష్టారు మళ్లీ. అందరూ పకపకా నవ్వారు. నేను నవ్వలేదు—

‘పొరపాట్లు అందరూ చేస్తారు. అసలు, మనిషి కాకపోతే ఇంకెవరు చేస్తారు. పొరపాట్లు చెయ్యకపోతే దేవుళ్లయిపోరూ? చెప్పు. నీ భార్య నిన్నేమంత కష్టపెట్టిందని?’ అన్నాడా ముసలాయన మళ్లీ.

నేను తలెత్తలేదు. ఏదో స్టేషనులో ఆగకుండా జోరుగా పోతోంది రైలు. కంపార్టుమెంటులో ఎవరి గొడవల్లో వాళ్ళున్నారు.

చిన్నగా తలెత్తి కిటికీలోంచి బయటకు చూశాను. పచ్చని చీరకట్టుకున్న పల్లె పడుచొకామె పరుగులాంటి నడకతో పోతోంది. జయంతి కిలాంటి చీరలంటే చాలా యిష్టం— జయంతి నా ఎదురుగా నిల్చినట్లయింది. కళ్లనీళ్లతో జాలిగా చూసినట్లయింది. నాకు చెడ్డ కోప మొచ్చినపుడు అలాగే చూస్తుంది. ఇంకో క్షణంలో— ‘ఇంకెప్పుడూ అలాంటి మాట అనను. నాతో తిరిగి మామూలుగా మాటాడరా? అంతేకదూ?’ అంటుంది.

మా పెళ్లయి ఇంకా మూడేళ్లుకూడా నిండలేదు. రెండురోజుల కొకసారి ఇంట్లో భయంకరమైన పరిస్థితి ఏర్పడుతుంది. ఆ పరిస్థితినుండి నేను తప్పించుకోలేను. తప్పించుకోను. జయంతిని తప్పించుకోనీను. అదో అలవాటుగా దాపురించింది.

‘అమ్మాయి అంతా చెప్పింది నాకు. అమ్మాయిది తప్పే అనుకో. నువ్వంతలో కోపం తెచ్చుకోవాలా?’

‘అదికాదు చిన్నాన్నా’ అన్నాడు ఆ ముసలాయనకు ఎదురుగా కూర్చున్నతను. తల పక్కకు తిప్పాను. అతన్ని గమనించాను. అతనికింకా ముప్పైఏళ్లు కూడా మీద పడనట్లుంది. చామనఛాయ. మొహంలో సౌమ్యత కనుపిస్తోంది.

‘అదికాదు చిన్నాన్నా దాని సంగతి నీకు తెలీదు.’ సాధ్యమైనంత మెల్లిగా అన్నాడు. అలా అంటున్నప్పుడు అతని మొహం కందింది. అతని బాధ నాకు బోధపడింది.

ఇవి ఇంటి విషయాలు. అందరికీ వినబడితే బాగుండదు.

ముసలాయన ఇబ్బందిగా కదిలాడు. కళ్ల జోడులోంచి నన్ను చూశాడనిపించింది. నేను తదేకంగా దేన్నో కిటికీలోంచి చూస్తున్నట్లు ఉండిపోయాను.

నా ప్రక్కన ముసలాయన. ముసలాయన ప్రక్కనే అతను. తక్కిన సీట్లన్నీ ఎవరో గుజరాతీలలా ఉన్నారు. బండి ఎక్కిందగ్గర్నించీ నిమిష నిమిషానికీ సీట్ల క్రింది పెద్ద పెద్ద డబ్బాలలోంచి మిఠాయితీసి తింటూనే ఉన్నారు.

'వనజ మాటలూ చేతలూ నీకెలా చెప్తే తెలుస్తుంది చిన్నాన్నా? చెప్పుకుంటే సిగ్గు. అంతకన్నా నడివీధిలో కొచ్చేసినా నయమనిపిస్తుంది ఆలోచనా వివేకం ఏవీ లేవు చిన్నాన్నా ఆ మనిషిలో.'

'అది కాదురా సుందరం. పోనీ వనజకి ఆలోచన, వివేకం లేవంటున్నావు. నీకున్న జ్ఞానం ఎక్కడ పోయిందిరా?'

'అంతా అయింది చిన్నాన్నా. ఆర్నెల్ల సహవాసం చేస్తే వారు వీరవుతారంటారు అది మా విషయంలో పట్టి అబద్ధం చిన్నాన్నా. నేను అటువేపు మారలేక పోయాను. అది ఇటువేపు వచ్చిందికైనా ప్రయత్నించలేదు. అప్పుడే నాలుగేళ్లయిందా సంసారం పెట్టి? నా బతుకిలా కాలిపోవా లని రాసిపెట్టి ఉంది.' మూడువేళ్లతో నుదుటిమీద గీతలా గీస్తూ అన్నాడు సుందరం.

ముసలాయన నిట్టూర్చాడు.

ఈ మధ్య జయంతితో పోట్లాట ఎక్కువయిపోయింది నాకు.

ఉదయం ఆఫీసుకు వెళ్తున్నప్పుడే సాయంత్రం సినిమాకి వెళ్దాం, రడీగా ఉండు అని చెప్పిపోయాను. పోని అందరి మొగుళ్లలా కాకుండా బుద్ధిమంతుడిలా అయిదున్నర గంటలకే వచ్చేశాను.

'తొందరగా వచ్చేస్తానన్నారు! ఇంత ఆలస్యం అయిందేం?' అంది జయంతి మామూలుగానే. ఆమె వాలకంచూస్తే నీదే ఆలస్యం బయల్దేరు అన్నట్లుంది.

జయంతిని చూస్తే నాకెందుకో కసిగా ఉంటుంది. నా యిష్టంతోనే పెళ్లిచేసినా, నా పెళ్లికి వచ్చిన ప్రతివాడూ నన్ను అన్యాయం చేశాడనిపిస్తుంది అప్పుడప్పుడు. జయంతి అందరు ఆడవాళ్లలాగా నాజూకుగా ఉండదనిపిస్తుంది. ఎంత మంచి చీరతెచ్చినా దానివంటికి నచ్చదనిపిస్తుంది. జయంతి తప్ప నా కంటికి కనిపించిన ప్రతీ ఆడకూతురూ అందంగా ఉంటుంది. దాంతో జయంతంటే అసహ్యం పెరిగి పోతోంది.

'ఎంతాలస్యమయిందేం ?— ఊరికే — ఏడింటికొచ్చానా ? ఎనిమిదికి వచ్చానా?' రెచ్చిపోతూ అడిగాను. ఎందుకలా రెచ్చి పోతానో కూడా తెలీదు.

'అయితే ఎందుకంత కోపం? నేనే మన్నానని? తీసుకెళ్తే తీసుకెళ్లండి. లేక పోతే మానేయండి' అంది జయంతి అదో రకంగా మొహంపెడుతూ. 'ఇలాంటి వెధ వ్వేమిటి నువ్వు ?' అన్నట్లుంటుంది ఆ చూపు ఆ మొహం చూస్తేనే నాకు తిక్క రేగిపోతుంది.

'ఎందుకలా గొంతు చించుకుంటావ్ ? మెల్లిగా మాట్లాడలేవూ? చేతకాదా ?' జయంతంటే అసహ్యం నన్నలా మాట్లా డిస్తుంది కాబోలు!

'మాట్లాడుతున్నది మీరా నేనా ?'

అలాంటి సవాళ్లుకూడా నా కిష్టం లేదు 'అయితే నన్ను తప్పు పడుతున్నా వన్నమాట. అంతటి దానివయ్యా వన్న మాట' — చూపుల్తోనే మసి చేస్తానన్న చూపుతో.

కొంతసేపు పోయింతర్వాత —

'ఇలాంటివి మీకూ నాకూ రోజూ ఉండేవే. అసలు ఇప్పుడు మనం సినిమాకి వెళ్తున్నామా, లేదా?' నవ్వు తెచ్చిపెట్టు కుని అంది.

ఇలా నిలదీసి అడగడంకూడా నా కిష్టం లేదు. 'తీసికెళ్లనే ఏం చేస్తావ్ ?'

'ఏం చేస్తాను? ఏం చేయగలను? రోజూ నేననుకున్నవి జరిగిపోతున్నాయి కను కనా ఏం చేయడానికీ' చివరి మాటల్లో వణుకునిబట్టి ఏడుస్తోందని తెలిసినా నాలో మార్పుండదు. జయంతి మొహంవేపు చూడకుండా ఉంటే జాలి పుట్టుకొచ్చేదే. కాని ఆమె మొహంచూశాక 'ఛీ. వెధవ గోల. ఇంట్లోఉన్న కొద్దిసేపూ మనశ్శాం తిగా ఉండనీయవు' తిరిగి ప్యాంటు షర్టు వేసుకున్నాను. జయంతి వెనకనే ఉంది.

'ఎక్కడికి వెళ్తున్నారు' అడిగింది.

'నా యిష్టం వచ్చిన చోటికి. మనశ్శాంతి కావాలి నాకు'

'నా ఉనికే అంత కష్టంగావుంటే పోనీ నేనే పక్కింటి కెళ్తాను లెండి. అక్కడే ఓ గంట కూర్చుంటాను. మీ రెళ్లకండి' నేనలా కోపంతో బయటికెళ్తే మరో ఐదారు గంటల వరకూ రానని జయంతికి తెలుసు.

జయంతి మరో పావుగంట వరకూ పక్కింటికెళ్లదని తెలుసు. బాత్‌రూంలో తలుపేసుకుని ఏం చేస్తుందో కూడా తెలుసు.

జయంతి అటు వెళ్లగానే నాకు ఆమె మీద జాలి పుట్టుకొస్తుంది. నిజానికేమంత తప్పుచేసిందని? అయినా బెట్టు సడలించను —

ముసలాయన 'ఊఁ' అని మళ్ళీ నిట్టూర్చాడు.

'నీకు తెలియదు చిన్నాన్నా. పెళ్లికాక ముందు నేను ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. మొహం చూసి మనిషిని అంచనా వేయవచ్చని అంటారు. కాని వనజ విషయంలో నేను పొరపాటు పడ్డాను. ఏం సుఖపడ్డానో పెళ్లి అయింతర్వాత ఏడాది కూడా లేదు ఆఫీసులో ఉన్న ఏడెనిమిది గంటలూ హాయిగా ఉంటుంది ప్రాణానికి. నా జీతం నీకు తెలుసుగా చిన్నాన్నా. తమ్ముడు స్కాలర్‌షిప్ మీద చదువుతున్నాడు. సత్రంలో భోజనం. వాడి పై ఖర్చులకి మాత్రం పదో పదిహేనో పంపుతున్నాను. చెల్లెళ్ల పెళ్లి ఉన్నాయి. అమ్మ, చెల్లెళ్లూ ఆ ఊరినుంచి రారు ఇక్కడికి. పుట్టిన ఊరు వదిలి రాలేనురా అంటుంది. నా పరిస్థితి తెలుసు. ఈ మహా పట్నంలో వాళ్లందర్నీ ఆపలేనని తెలుసు. నీకు తోచిందేదో పంపించు, సర్దుకుంటాం అంటుంది. నాకు తోచింది పంపుతున్నాను. ఆ డబ్బుతో వాళ్ళు అన్నమే తింటున్నారో, గడ్డే తింటున్నారో నేను ఆలోచించడం లేదు. ఆలోచించి చేసేదేముంది గనుక ఇలాంటి పరిస్థితులలో నగలెక్కడ కొనగల్ను. ఖరీదైన చీరలెక్కడ నుంచి తేగల్ను చెప్పు. రోజూ సాధిస్తుంది. అర్థం

వేసుకోదు. రోజూ ఓ వేపు టిక్కెట్లు మిగిలించవచ్చనీ—మా ఆఫీసు నుండీ ఇంటికి దూరం తెలుసుగా—నడిచే వస్తాను కాళ్ళు పీక్కుపోతాయి ఇంటికి వచ్చేటప్పటికి రడీగా ఉంటుంది యుద్ధానికి. ఒకసారి తిన్నింటు సిరులో చెప్పాను, పరిస్థితులన్నీ. దానికవేం పట్టవు డబ్బు కావాలి, నేను చచ్చి పోయినా సరే—నా స్నేహితులంతా అంటారు రోజు రోజుకీ నేను చిక్కిపోతున్నాననీ ..' -

సుందరం ఆగిపోయాడు జేబులోంచి రుమాలు తీశాడు పూర్తిగా విప్పి మొహంమీద వేసుకున్నాడు తల వెనక్కి వాల్చి కూర్చున్నాడు

ముసలాయన ఏదో గొణిగాడు తల వంచుకున్నాడు

సుందరంవేపు చూశాను ఎంతకు ముందు సుందరం బలంగా ఉండేవాడేమో నన్పించింది వనజ ఎలా ఉంటుందో కూడా ఊహించుకున్నాను

'టికెట్ ప్లీజు'

రెండు టిక్కెట్లు చూపించాను పక్క నున్న ఆడవాళ్ళ గుంపులో ఒకామె ఉందని చెప్పాను ఈ మూడుగంటల ప్రయాణంలో కూడా జయంతి నా ఎదురుగా ఉండడం ఇష్టంలేక అక్కడ కూర్చోపెట్టాను. నిన్నరాత్రి అలా జరిగి ఉండకపోతే ఈ రైల్లో ఉండేవాడ్ని కాను

నిన్న—

ఉదయం అన్నం సరిగ్గా తినలేదు నేను సాయంత్రం ఆకలితో వస్తానంటూ ఆఫీసుకెళ్ళిపోయాను మూడుగంటలకు విపరీతమైన ఆకలి వేసింది సరోగంట వరకూ అతి కష్టంమీద ఆపుకోగలిగాను. ఆ తర్వాత నా శక్యం కాలేదు జేబులో రూపాయి ఉంది ఈ నెలకి ఇదే ఆఖరి రోజు హోటల్లో శుభ్రంగా టిఫిన్ చేశాను టిఫిన్ చేస్తున్నప్పుడు జయంతి మీద విపరీతమైన అభిమానం కలిగింది. జయంతి రూపాయి ఇవ్వకపోతే నా ఆకలి తీరేది కాదు ఎలా దాస్తుందో, నా స్వంత ఖర్చులకోసం ఇచ్చిన డబ్బులు సరిగ్గా చివర్లో అప్పుడప్పుడూ రూపాయి, అర్ధా ఇస్తుంటుంది

ఆరుగంటలకు ఇల్లు చేరాను. జయంతి పడుక్కుని ఉంది.

'సంధ్యవేళ ఈ పడకలేమిటి?' చికాగ్గా అన్నాను

జయంతితో ఈమధ్య ఇలానే మాట్లాడుతున్నాను

వెందుకో—వొక్కొంటి రాధతో గానీ, ఆఫీసులో టైపిస్టు నిర్మలతో గానీ, ఇంకే ఆడదానితోనైనా మాటాడుతున్నపుడుండే ఉల్లాసం జయంతితో మాటాడుతుంటే రావడంలేదు. నా మాటల్లో ప్రతి వాక్యాని కొక విట్టుంటుందని వాళ్లంటారు పెళ్ళయిన కొత్తల్లో జయంతి కూడా అంటుండేది 'మీ మాటలు తమాషాగా ఉంటున్నాయి' అని. కాని జయంతితో నాకలా హాస్యంగా మాట్లాడాలని కోరిక లేదిప్పుడు.

ఇదే నా మిత్రుడు శాస్త్రితో అంటే అతనంటాడూ 'నువ్వు హోటల్లో పూరీ తింటున్నావనుకో. నీ ప్రక్కనున్నవాడు దోశె తింటున్నాడనుకో. అప్పుడు నీ కని పిస్తుంది. అయ్యో దోశె తెప్పించుకున్నా బాగుండేదే అని. ఆడవాళ్ళతో కూడా అంతే పెళ్ళిచేసుకునే ముందర జయంతిలాంటి అమ్మాయి కోసం నువ్వు తహతహలాడావు పెళ్ళయిపోయింది. కొత్తదనం పోయింది నువ్వు చదువుకున్నవాడివి. నీకింతకన్నా చెప్పలేను జయంతి నా చెల్లెలుకన్నా ఎక్కువ. ఆమె కన్నీళ్లు చూడకు.'

— నేను ఎంత వద్దనుకున్నా నా స్వరం అలా చికాగ్గా వచ్చేస్తుంది నా స్వరంతో ఆమె మూడ్ మారిపోయిఉంటుంది. 'ఏమీ లేదు ఊరికేనే' అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది అలాకాకుండా నవ్వుతూ నాతో మాట్లాడుతే దాని సొమ్మేంపోయింది అనుకుంటాను ఆఫీసులో పనిచేసి వస్తే ఇంట్లో ఇలాంటి పరిస్థితి చిరాకు కలిగించదూ ? మొహం కడుక్కొని వచ్చి కూర్చున్నాను జయంతి రాలేదు, ఇంతకు మునుపయితే 'తప్పయిపోయింది ఇంకెప్పుడూ అంత రాష్‌గా మాట్లాడను' అంటూ ప్రాధేయపడేది ఈమధ్య అలా ప్రతిమాలడం లేదు. ఏడుగంటలకు —

'భోజనానికి రండి' అంది వంటింట్లోంచే.

'తినను నాకాకలి లేదు' తినకపోవడానికి గల కారణంకూడా నాకు తెలీదు. నా మాటల్లో నాకు కోపంవచ్చిందని తెలియపర్చాను

దగ్గరగావస్తూ అంది జయంతి. 'ఏం? ఎందుకు తినరు ? మంచి ఆకలిమీద వస్తానన్నారు కదా ? అన్నీ వండేశాను' నిష్ఠూరంగా.

'పెట్టు వస్తున్నాను' అన్నాను కోపంగా.

జయతి వడ్డించింద రెండు గంటల క్రితం టిఫిను తిన్నందువల్ల ఆకలిగాలేదు. జయంతి ఇంకా అలాగే కూర్చుని ఉంది. 'నువ్వుకూడా పెట్టుకు తిను.'

'తినాలని లేదు' అంది జయంతి.

'ఏందుకు?' అంటూ 'చెయ్యి కడుక్కొ నేందుకు నీళ్ళు తీసుకున్నాను. కోపం వస్తోంది నాకు

'నా వంట్లో బాగులేనట్లు ఫీలవు తున్నాను' అంటూ నా చెయ్యి పట్టు కుంది. ఇంకోక్షణంలో కళ్ళంట నీళ్ళు తిరనాయి.

'ఏం ఏమయింది?' చెయ్యి విదిలించు కుంటూ అడిగాను.

'జ్వరం వచ్చినట్లుంది'

నాకు గొప్ప కోపం వచ్చింది జ్వరం అయితే ఇంత వంట ఎందుకు' పారబోయ డానికా? ఆ మాటే అన్నాను

'ఛీ. మూడేళ్ళు సంసారం చేస్తున్నా ఇద్దరి మనుషులకు తిండి ఎంత కావలసి ఉంటుందో తెలీని మొద్దువైపోయావు. ఆఫీసులో నేనెంత కష్టపడుతున్నదీ నీకు తెలీదు. తెలిస్తే ఇలా వేస్తు చెయ్యవు చదువుకున్నా, సంస్కారం, తెలివితేటలూ వేదూ లేకపోయింతర్వాత ఎందుకు బతుకు?' కంచంలో చెయ్యి కడిగేసుకున్నాను లోపలి గదిలోకి పోతూ జయంతివేపు చూశాను తలవంచుకుని నేనుతిన్నకంచం ఎత్తుతోంది.

నాకు పక్కవేస్తూ అంది జయంతి. 'ఈ మధ్య మీరు మారిపోయారు. మును పటిలా మాట్లాడంలేదు నేనంటేనే మీకు అసహ్యంగా ఉంది. నేను చేసిన తప్పే మిటి?'

'నీవల్ల తప్పేమీ లేదు. సరా? నాదె .. నాదే తప్పు. నేను మూర్ఖుడ్ని' మెల్లిగా మాట్లాడుదామనుకున్నా వ్యంగ్యంగా కర్క శంగా ఉన్నాయి నా మాటలు.

జయంతి మాట్లాడలేదు. మాట్లా డదు కనీసం నా కోపం పోగొట్టడానికి ప్రయత్నమేనా చేయడంలేదు, ఈమధ్య.

పడుక్కుంటూ అంది 'పోనీ నన్ను మా ఊరు దిగబెట్టండి. ఓ నెల్లాళ్ళు ఉండి వస్తాను. ఏమిటో నాకు బెంగగా ఉంటోంది.'

'బెంగెందుకు నేనేం రాక్షసుడి నను కున్నావా? ఉన్నపాటున మింగేస్తాననుకుం టున్నావా? అంత భయమయితే ఇప్పుడే ఈ క్షణంలో పో' అన్నాను గట్టిగా

'నా అభ్యంతరం లేదు' మెల్లిగా అంది.

గబుక్కున నిలబడ్డాను. 'పద... పెట్టె సర్దుకో'

'అరతే! రైల్లో వచ్చి పడ్డాంగా'

వనజతో పోల్చి చూస్తే జయంతి ఎలాంటిదో అర్ధమవుతోంది.

శాస్త్రి అన్నమాటలూ జ్ఞాపకాని కొచ్చాయి.

ఈ మూడేళ్ళలోనూ జయంతి ఓ పువ్వు కూడా కొనిపెట్టమని అడగలేదు.

రైలు ఏదో స్టేషనులో ఆగింది. దిగేశాను. ప్రక్క కంపార్టుమెంటుకు వెళ్ళాను.

'జయంతీ' పిల్చాను.

'ఏం?' అన్నట్లు చూసింది జయంతి

'దిగు' అన్నాను సౌమ్యంగా

'ఎందుకు?' ఆశ్చర్యంగా చూసింది.

'దిగమన్నానా?' కసురుతూ అన్నాను. తర్వాత నవ్వు వచ్చింది.

జయంతి చేతిలోని పెట్టె అందు కున్నాను.

రైలు కూతవేసి బయల్దేరింది.

నేనిందాక ఎక్కిన కంపార్టుమెంటు నా ప్రక్కనుండే పోతోంది.

సుందరం ముసలాయనతో ఇంకా ఏదో చెప్తున్నాడు .... ●


TERENE
Chaitra-CAFI-63 Tel

అనామధేయుడి ఆత్మకథ

సీరియస్‌లెస్ హాస్యరచన — ఆర్వీయ

15

సాహిత్య గోష్ఠి

"సంగీతధర్మంబు సాహిత్యధర్మంబు
తెలియనేర్చుట ప్రజ్ఞగల ఫలంబు."


ఒక పక్క నాటకాలు, మరొక పక్క సాహిత్యగోష్ఠి కూడా జరుగుతుండేవి. చిన్నతనంలో ఏవో భావగీతాలూ, గేయాలూ, పద్యాలూ గొలికేవాడినని మీకు తెలుసు గదూ? నేను స్కూల్లో నేర్చుకున్నదేమిటంటే, స్కూలు నాటకాల్లో వేషాలు వెయ్యడం—స్కూలు మేగజైన్‌లో కధలూ, గేయాలూ, పద్యాలూ రాయడం ... చదువు చెట్టెక్కడానికి యివే మూలకారణాలు!

ఆ మధ్య దస్తావేజులగురించి వెదుకుతూ వుండగా ఒక పాత బూజుపట్టిన కట్ట దొరికింది. అమందానంద సంభరితుడినయ్యేను—అది దస్తావేజుల కట్టా కాదు... నోట్లకట్ట అంతకన్నా కాదు. కాని, అది రచయితకి—లేక రచయితనని అనుకుంటున్నవాడికీ—పెన్నిధి!! కరెన్సీనోట్ల కట్టకన్నా, వెయ్యి మడుగులు అమూల్యతరము— అదే అముద్రిత గ్రంధ చింతామణి. ఆ కట్ట బూజు దులిపితే కొన్ని అనూర్యంపశ్యలైన రచనలూ, అనాఘ్రాతపుష్పాలూ, అనర్ఘమణులూ రాలేయి. కొన్ని పురుగులు కూడా రాలకపోలేదు ఏమైతేనేం, ఆ అముద్రిత గ్రంధ చింతామణిని చూసి యమ పుప్పొంగిపోయాను. అదంతా యిక్కడ చేరుస్తే బాగానే వుంటుంది. కాని, ఇప్పటికే గ్రంధం పెరిగిపోయినట్లు కనబడుతుంది. ఇంకో సంగతి—మీకు విసుగు కలుగుతుందేమో! మరో ముఖ్యమైన సంగతి—మనలో మాట—ఇవన్నీ కలిపి 'ముద్రిత—ఇతఃపూర్వ—అముద్రిత గ్రంధ చింతామణి' అని అరడజను సంపుటాలలో ప్రచురిద్దామనుకొంటున్నాను అంటే— పబ్లిషర్లు ఎవరైనా ముందుకి వస్తే!

నేను చదువుకొనే రోజుల్లో, సర్వకాలసర్వావస్థలయందూ ఒకే ఒక్క ప్రపంచం! పద్య ప్రపంచం. చదువూలేదు. సంధ్యాలేదు.

'ఆవగింజంత భూతి మైనలది కొనిన
తొఁరి గుమ్మడి కాయంత వెఱ్రిపుట్టు'—

అని శ్రీనాధుడు కాబోలు అన్నాడు. కొంటెషను సరిగా లేకపోతే క్షంతవ్యుడివి. ఆ వెర్రి ఎంతవరకూ వచ్చిందంటే నన్ను నేను మరిచిపోయేటంతవరకూ వచ్చింది. ఆ రోజు క్లాసులో లెక్కల మాస్టారు, 'విద్యార్థి భయంకర' కాలభైరవేశ్వరయ్యగారు బోర్డు మీద ఆల్‌జీబ్రా లెక్కలు వేసి బోధపరుస్తున్నారు. నాది లెక్కల గ్రూపు లెండి. అసలే ఆల్‌జీబ్రా గాంద్రు గాభరా! అందులో కవితారసానికీ నీరసమైన లెక్కలికీ ఎక్కడా పొత్తు కుదరదు. అంచేత నా దృష్టి లెక్కల మీద ప్రసరించక ఊహాప్రపంచంలోకి ఉరకలేసింది అంతలో ఏదో ఒక చిన్న భావతరంగం సుళ్ళు తిరిగి యోజనా సముద్రాన్ని రేపింది. ఆ భావసంచలనానికి తట్టుకోలేక వెంటనే ఆ భావాన్ని పద్యాల్లో ఇరికించడం ఉపక్రమించేను. ఆ పద్యరచనామృతంలో నిమగ్నుడనైపోయి, తదేక దీక్షతో భావనాప్రపంచైక సాగరంలో రచనా నౌకపై విహరిస్తూ, కవితా మధుర మధురసాస్వాదానాయత్తచిత్తుడనై,



విశృంఖలంగా ఊహాలోకాల్లో తిరుగు తెత్తుతూ నన్నూ, నా పరిసరాల్నీ పూర్తిగా విస్మరించాను.

అలా యెంతసేపున్నానో చెప్పలేను. బహుశా ఇరవై లేక ముప్ఫయి నిమిషాలయి వుండొచ్చు. అసలు ఆ కాలానికి విలువ కట్టడం ఎవరి తరం? కాలానికి విలువ లేదు; ఇదమిద్ధమని నిర్ణయించరానిది అన్న సంగతి ఇటీవల, 'ఐన్‌స్టీన్' కని పెట్టిన సాపేక్ష సిద్ధాంతంబట్టి తెలుసు కొన్నాను;

చెప్పకుండా చెంత చేర్చుకునిచూస్తే మీకెలా వుంటుందండీ? — మత్తు వదుల తుంది. సరిగ్గా అదే జరిగింది. ఉలిక్కిపడి తేరుకుని నెమ్మదిగా ఈ ప్రపంచంలో


అనామధేయుడి ...


వచ్చాను. పక్కనే— 'విద్యార్థి లోకాంతక' కాలభైరవేశ్వరయ్యగారు కోపారుణనేత్రాలతో విలోకిస్తున్నారు. నాకు ముచ్చెమటలు పోశాయి. సహాధ్యాయులంతా నానా ముఖ భంగిమలతో, వివిధ హావభావాలతో కళ్ళప్పగించి నావేపే చూస్తున్నారు. 'అమ్మామ్మా!' అని అనుకొన్నా మనస్సులో. సిగ్గుతో, అవమానంతో నాకు ఒళ్ళు చచ్చినంత పనైంది.

ఆ కాలంలో విద్యార్థులు సత్తెకాలపు వాళ్ళు గనక అలా జరిగింది. అదే ఈ కాలంలో అయితేనా ?...ఎన్నిసభలు ... ఎన్ని సమావేశాలు...ఎన్ని వాకౌట్లు...ఎన్ని నిరసన తీర్మానాలు...అదలా వుంచండి ! క్లాసు పిల్లలంతా బోర్డువేపే చూస్తూ వుంటే నేనొక్కణ్ణే తలొంచుకొని తదేకదీక్షతో బహుబుద్ధిగా రాసుకోవడం భైరవయ్య గారిలో కుతూహలం రేకెత్తించింది. దాని పరిణామమే—ఈ హఠాత్ విపత్ సన్నివేశం ! భైరవయ్యగారు అన్నారు: 'చూడు, అబ్బాయీ ! పబ్లిక్ పరీక్షలు ఇంకా రెండు నెలలున్నాయి. మొదట పరీక్ష పాసయ్యే మార్గం చూడు. శ్రద్ధగా చదువుకో. ఇప్పుడు పద్యాల్లో పడకు. పరీక్షలు పాసయిన తర్వాత యావజ్జీవం రాసుకోవచ్చు. ఇప్పుడు తప్పటడుగు వేశావా ఆ జన్మాంతమూ ఏడవ్వాలసివస్తుంది...' అని చాలా చాలా బుద్ధి చెప్పేరు.

నాకుకూడా ఆయన చెప్పిన సలహా చాలా చాలా నచ్చింది. అలా చేశానా లేదా అనిమాత్రం నన్నడక్కండి. కొన్ని కొన్ని సలహాలు బాగానే వుంటాయి – వినడానికి. ఆచరణలో పెట్టడం దుస్సాధ్యం. పరీక్షల దారి పరీక్షల్దే. పద్యాల దారి పద్యాలదే ! మొత్తానికి, ఆ విధంగా నా విద్యార్థి దశ ముగిసింది. ఆ తర్వాత నా అయ్యవారి ఉద్యోగం, మద్రాసు పయనం. ఉద్యోగాన్వేషణా వగైరా మీకు తెలిసిన కథా వస్తువులే!

ఉద్యోగంలో ప్రవేశించిన తర్వాత ఈ కవితాధోరణికి కొంత స్వస్తి చెప్పటం జరిగింది. 'ఉద్యోగః కవిత నాశాయ' అన్నట్టు. కాని 'కళా కండూతి మండలి' స్థాపించిన తర్వాత నాటకవిభాగంతోపాటు సాహిత్య





అనామధేయుండి ...

విభాగంకూడా ఒకటి ఏర్పాటు కావడంతో, నా సాహిత్యవ్యాసంగానికి కొంత ఆలంబన దొరికినట్లయింది. సాహిత్యవిభాగవర్గం వారు ఒక పత్రికని — వ్రాతపత్రిక — ప్రారంభించడం, దానికి 'సాహిత్యకండూతి' అని నామకరణం చెయ్యడం జరిగింది:

ప్రతినెలా సభ్యులు రచనలు చేసి వివరి రచనవారే ఆ పత్రికలో రాసుకోవడం, అవి నలుగురికీ చదివి వినిపించి ఆ కండూతి కాస్త తీర్చుకోడం — ఇలా పత్రిక నడిచేది. కథలూ, కథానికలూ, స్కెచ్‌లూ, నవలికలూ, గేయాలూ, వ్యాసాలూ వగైరా పత్రికలో పడుతు వుండేవి కాని పద్యాలు లేకపోవడం ఒక లోటుగా సంపాదకీయవర్గం భావించింది. పద్యాలు రాయవలసిన బాధ్యత నామీద వేశారు.

'ఈ కాలంలో పద్యాలెవడికి కావాలయ్యా? ఇంకా మీరు పద్దెనిమిదో శతాబ్దంలోనే వున్నారు' అని వారించాను. కాని, వాళ్లెవరూ వినిపించుకోలేదు.

'చదివినా, చదవకపోయినా, అర్థం అయినా, కాకపోయినా — పద్యాలు — వాఙ్మయంలో ఒక స్థానం సంపాదించుకొన్నాయి. అవి పత్రికకి ఒక అలంకారం. కనక, ఉండవలసిందే!' అన్నారు వారు.

'అలాంటి వెట్టిపని ఎందుకయ్యా?' అంటాన్నేను.

వాళ్లు అంగీకరించరు అందుచేత నేను ఇదివరకు రాసిన కావ్యకళాఖండాలు ఒక్కొక్కటే పత్రికలో వేస్తూ వచ్చేను. ఇలా ప్రతినెలా ప్రకటింపబడిన సాహిత్యం ఒక సవాలక్షగ్రంథం వుంది. ఈ పత్రికలో నా కలం పేరు: 'అర్వీయ' అందుచేత 'అర్వీయ' అనే నామం నాకు రూఢమైపోయింది.

ఈవేరికి బోరుకొట్టడం నాకంత యిష్టం కాదు, గాని ఈ ఒక్క విషయమూ మనవిచేసి ఆపేస్తాను.. అవి ఎలక్షను రోజులు ఆ మరునాడు మా వూరికి ఒక రాజకీయనాయకుడు దయచేస్తాడని కబురు తెలిసింది అప్పుడు మా మండలి సభ్యులికి ఒక ఆలోచన వొచ్చింది ఆయన్ని మా క్లబ్బుకి ఆహ్వానిస్తే ఆయన రాకవల్ల మా మండలి గౌరవం ఇనుమడించగలదన్న

ఆశాభావం కొందరు వెలిబుచ్చారు. ఆయన లాంటి సుప్రసిద్ధ వ్యక్తి మన మండలి ఆహ్వానాన్ని అంగీకరిస్తాడా— అన్న నిరాశా భావం మరికొందరు వ్యక్తపరిచేరు. తన అంతస్తు మరికొంత పెరగడానికి దోహదం చేస్తుందన్న అపోహతోనైనా, మన ఆహ్వానాన్ని అంగీకరించవచ్చు అన్న ధోరణి వ్యక్తీకరించేరు విజ్ఞులైన కొందరు రాజకీయ పరిశీలకులు.

'ఆయన్ని పద్యాలతో అభిషేకించాలి' ఉత్సాహంతో అరిచాడు ఒక సభ్యుడు.

సభ్యులంతా ఏకోన్ముఖంగా అంగీకారాని ప్రదర్శించేరు.

అధ్యక్షులవారు నా ముఖం చూశారు.

'చచ్చాన్రా' అనుకున్నాను నేను.

అనామధేయుడి ...

నా ముఖంలో నెత్తురుచుక్క లేదు.

'ఏమండీ, అలా వున్నారు ? వంట్లో బావుండలేదా ?' అని అడిగాడు ఒక సభ్యుడు.

'నా ఒంట్లో బాగానే వుంది గాని, నావల్ల మాత్రం ఈ పని కాదు !' అని ఖండితంగా చెప్పేశాను.

'ఏ పని ?' అని తెల్లమొహం వేశాడు ఆ సభ్యుడు.

'సన్మాన పద్యాలు 'ఆర్పియ' అని రాయమంటామేమో అని గాభరా పడిపోతున్నాడు. ప్స్ .ఆ మాత్రానికే భయపడ్తే విలాగండి?' అని పెదవి చప్పరించేడు అధ్యక్ష మహాశయుడు.

'నన్నెందులో దూకమన్నా దూకుతాను. గాని ఈ పద్యాలు నావల్ల కాదు. నన్ను అవస్థ పెట్టకండి!' అని గోలెత్తాను.

'మేమంతా వుండగా, మీకు భయమెందుకండీ?' అని హామీ యిచ్చారు మరొకరు.

'మీరంతా వుండి ఏం చేస్తారు ? నావల్ల ఇది కానేరదు మీకు చెప్తే బోధపడదు ' అని ఘోష పెట్టేను

'మీరు సన్మాన పద్యాలు రాసి తీరాలి!' అని పట్టు పట్టేరు అధ్యక్షులవారు.

'మేమంతా వినే తీరాలి' ముక్తాయించేరు ఉపాధ్యక్షులవారు.

'ఇది తప్పదు' నొక్కివక్కాణించేరు కార్యదర్శిగారు

'పద్యాలు రాయడమంటే కబుర్లు చెప్పినట్టుగాదు కవితాంచన విడిచిపెట్టి ఒక దశ అయింది రేపు ఆయన వస్తాడు ఈ రాత్రికి రాత్రే సన్మాన పద్యాలు రాయడం తమాషా కాదు ధారణాబలం, మేధాసంపత్తీ , భావప్రపూర్ణతా, శరీరదార్ఢ్యం, ఆశుధారా పుష్కలంగా ఉన్నవాళ్ళ తప్ప —అడిగిన విషయంమీద అర్జంటుగా అందరూ పద్యాలు రాసెయ్యలేరు ' అన్నాను

'కవేమిటి? పద్యాలు రాయలేకపోవడమేమిటి?' అని ధర్మసందేహం వెలిబుచ్చారు కోశాధికారిగారు

'అదే పొరపాటు. ప్రతీ కవీ పండితుడనీ, ప్రతి పండితుడూ కవి అనీ, ప్రతీ కవీ ఆశుకవిత్వం అడగ్గానే చెప్పగలడనీ, చెప్పలేకపోతే కవే కాడనీ, నిర్ణయించేస్తారు. అంతేగాని, సాధకబాధకాలేమిటో కొంచెమైనా ఆలోచించరు.' అని ఆగ్రహం వ్యక్తపరిచేను.

'అయితే, ఇందులో వున్న కష్టం ఏమిటి ?' ఉపకార్యదర్శి ప్రశ్న.

'అడిగిన విషయం మీద అప్పటికప్పుడే పద్యాలు అల్లడం ప్రతి కవికీ చేతనవదు. నాటకంలో గ్లిసరిన్ రాసుకుంటే బాష్పధార కారినట్టు ఆశుధార కారదు.. లఘువులూ, గురువులూ, గణాలూ, యతులూ ప్రాసలూ, పాదాలూ, భావాలూ ...ీట్లతో

కుస్తీ పట్టి—పట్టి పల్లార్చుతేగాని — ఒక పద్యం బైట పడదు ' అన్నాను.

'ఏమైనా సరే — సన్మాన పద్యాలు రాయాలి, రాత్రల్లా మేలుకొని కూర్చో వలసి వచ్చినా—సరే!' అందరూ నడుములు బిగించేరు. ఇంతలో ఒకడు అందుకున్నాడు 'ఇతని వైముఖ్యానికి కారణం — రాజకీయ కారణమేమో !' అని. ఇంకా చర్చ తీవ్ర పరిణామాలకి దారి తీస్తుందేమో అని సభ సమాప్తి చేశారు.

ఆ రాత్రల్లా కూర్చుని చచ్చీచెడి చాయంగల విన్నపాలని దాపి బుర్ర గోక్కున్నాను... ఆ రాజకీయ నా[illegible] మండలి చేసిన సన్మానమంతట[illegible] 'స్వాగత పంచరత్న పద్యము[illegible]' [illegible] ఉత్సాహపూరితుడిగా చేసింద[illegible] తెలిసింది.

(ఇంకా [illegible])

నిష్కపటి వాణిశ్రీ

✱ నవ్వుతూ నవ్విస్తుండడం అంటే మహాసరదా వాణిశ్రీకి. ప్రతి విషయాన్ని కుండబద్దలు కొట్టినట్లు అతిసహజంగా మాట్లాడడం ఆమె అలవాటు. బంధాలకు, అనుబంధాలకు ప్రాముఖ్యత నిస్తుంది. విరోధం, వైషమ్యాలకు దూరంగా వుంటుంది. మాటల సందర్భంలో తన కుటుంబం, స్నేహితులు, సన్నిహితులు, అభిమానులు, ఆశయాలు అన్నింటినిగూర్చి వివరంగా ఇలా చెప్పింది.

'మమతలకు నిలయం మా ఆలయం; దేవతలకు ప్రతిరూపాలు మా అక్కా— బావలు. మా పెద్దలు అంటే మా అమ్మ, అక్క, బావలది ఎన్నటికీ మారని పసిడి మనసులు. వారి నీడలో నేనొక బిడ్డగా, నిడతెగని ప్రేమతో, వాత్సల్యంతో పెంచ బడుతున్నాను. నా మంచీ— చెడులన్నీ మా అక్కా— బావలే చూస్తుంటారు; నేనూ వారిపట్ల వినయంగాను, అనునయంగాను నడచుకుంటాను. అసలు మా దొక ఆదర్శ కుటుంబం. మా అక్కకు నేనంటే ప్రాణం. అందుకే షూటింగునుండి నేను రావటానికి ఎంతలేటు అయినప్పటికీ నా కోసం వెయిట్‌చేసి, నాతోగాని అన్నానికి కూర్చోదు. ఇక మా బావగారు నాకు కావలసిన సదుపాయాలను, సలహాలను ఎప్పటికప్పుడు విసుగు లేకుండా అంద చేస్తుంటారు. నిజంగా అలాంటి సహృద యులు నావారు కావడం నా అదృష్టం. వార్ని చూచినవెంటనే షూటింగుతో విసిగి పోయుండినప్పటికీ నా వదనం వికసిత మౌతుంది' అంది అందాలతార వాణిశ్రీ.



'సాధారణంగా సున్నిత మనస్కులకు అలాంటి మనస్తత్వం వున్నవారే స్నేహి తులు, సన్నిహితులౌతారు. నా ఫ్రెండ్స్ అందరూ నిజాన్ని నిక్కచ్చిగా చెప్పేటం నిర్మల స్వభావులు. పేరులో ముఖస్తుతి చేసి, పరోక్షంగా చెడు అష్టోత్తరం పాడే వారుకారు నా హితులు. నా నటనలో ఎలాంటి లోపాలున్నా వేలెత్తి చూపిస్తారు. అలాంటి విమర్శలంటే నాకు యిష్టం' అంది తాదాత్మ్యంతో పుచ్ఛదళనందుకొన్న వాణిశ్రీ.

'ఆడవారు అధికంగా కన్పడుతున్నారు నన్ను అభిమానించే వ్యక్తులలో. అదీ ఆంధ్రలో ఎక్కువశాతమున్నారు. చిన్న పిల్లలుగూడ నా చిలిపిపాత్రలను, అల్లరి వేషాలను చూచి అభిమానిస్తున్నందుకు నా మనస్సెంతో సంబరంగాను, సంతోషంతోను మురిసిపోతుంది. వాస్తవానికి నన్ను మొదట అభిమానించినవారు గూడ వెంకట్రామన్ అనే చిన్నవారే. (నా మొదటి చిత్రం బంగారు తిమ్మరాజు కధనుచూచి) వీరిపుడు ఆర్మీలో చేరినప్పటికీ అడపాదడపా నా చిత్రాలనుచూచి ప్రశంసాపత్రాలను వ్రాస్తుం టారు' అంది వాక్కును వరంగాగొన్న వాణిశ్రీ.

'జీవితంలో వివప్పి కష్టాలను, నష్టా,

అను విమర్శిస్తున్నను. కాని నేనాడు ఓటమి పొందలేదు. కమిడియన్‌గా నటిస్తుండిన నేను సడన్‌గా ఒక కథానాయిక నయ్యానంటే నా స్వయంకృషి, స్వామి కృపలే కారణాలు.'

జరుగనున్నది జరక్కమానదు. అందుకే భవిష్యత్తు నుగూర్చి నేనేమి ఆలోచించడం లేదు. నటిగా నటించగలననే నమ్మకం నాలో వున్నంతవరకు నటిస్తాను. వివాహమనేది జరిగితేమాత్రం సినిమాకి స్వస్తిచెప్పి క్రొత్తతరహా జీవితాన్ని ప్రారంభిస్తాను. నా వివాహం మంచిగుణం, చదువు, సంస్కారమున్న వ్యక్తితో జరగాలని మా అక్క చిరకాలవాంఛ. నేనూ మా అక్క మాటకు ఏనాడు ఎదురు చెప్పలేదు. ఎప్పటికీ చెప్పను' అని ముగించింది వాణిశ్రీ.

—శ్రీనివాస్ ●

(ఫోటో (ప్రభాకర్))

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1, and at Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna.


దీపావళి తారావళి బిరుదావళి

వె సత్యం

ఘనాఘనల గర్జనల
గాంగేయుడు శ్రీరాముడు
కంసుని తెగటార్చిన
గోపాలుడు తారకరాముడు

విశాలాంధ్ర తారాపథంలో
వెన్నెలవాన
వివిధ కథారహస్యం
విన్యాసాల లలన

తెలుగు మామిళ్ళ
చివురాకు జొంపాల కోకిల
పాషాణములు ద్రవించే







దశకంఠుడు శ్రీకంఠుడు
శతకంఠుడు మహానటుడు
కళామతల్లి కంటిపాప
ఎన్‌టీరాముడు ఘనుడు!

దసరాబుల్లోడు
తెలుగుతల్లి చిలిపి కుర్రోడు
కురుకురు మీసలరేడు
వలనాటి బాలచంద్రుడు

విరిసిన మనోరంజితాల సువాసన
నయనానందకరం
నయాగరాజలపాతం జమున!

ప్రేమికుల గుండెలలో
గూళ్ళుకట్టిన ప్రణయం
భక్తుల హృదయాల
దివ్యాలయాల నిర్మించిన ప్రణవం

మధురగానాల మంజుల
తల కోన జలపాత ధ్వనితరంగాల
రాగలహరి కలస్వనాల సుశీల!

పాత్రోచిత నటనకామె
ప్రత్యేకత తెచ్చిన సిరి
చలనచిత్ర జగత్తునకు
సౌందర్యం శిల్పశ్రీ







మీగడ తరకల రుచిగలాడు
బలే సొగసుగాడు
సాటిలేని నటనా ధురీణుడు
నాగేశ్వరుడు!

నాగార్జున సాగరం
మధురాతి మధురగానం
ఘంటసాల అంతరాత్మ
ప్రతిధ్వనించు ఓంకారనాదం!

నలరాజును మురిపించే
చిరునవ్వుల వెన్నెలసిరి
కలియుగాన కళారాణి
కలికిశ్రీ వాణిశ్రీ!



కుమారునితో నటి జమున

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA.

